

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 59

మంగళవారం 14-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




భారత్ 9/9

వరల్డ్‌కప్‌లో నెదర్లాండ్స్‌పై 160 పరుగుల తేడాతో గెలుపు - 12లో



దీపావళి ధమాకా

పండుగ సీజన్‌లో ఇప్పటికే రూ.3.75 లక్షల కోట్ల వ్యాపారం - 13లో



కుప్పకూలిన 'ఉత్తర కాశీ' సొరంగం

ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలో సొరంగం కుప్పకూలింది. అందులోని కార్మికులను రక్షించేందుకు బలగాలు రంగంలోకి దిగాయి.

వివరాలు 6లో ▸



బంగారు కోట కట్టిస్తామంటారు

మధ్యప్రదేశ్‌లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ బంగారంతో కోట కట్టిస్తామని కూడా హామీ ఇస్తుందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు.


వివరాలు 10లో ▸



ఢిల్లీపై దీపావళి ఎఫెక్ట్!

ఢిల్లీలో వర్షాలతో కాస్త తగ్గుముఖం పట్టిన వాయు కాలుష్యం.. దీపావళి పండుగ వల్ల మళ్లీ విజృంభించింది.

వివరాలు 6లో ▸



కాల్పుల్లో టీఎంసీ నేత మృతి

పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ నేత సైఫుద్దీన్‌ను దుండగులు తుపాకీతో కాల్చిచంపారు. ఒక నిందితుడు మూకదాడిలో మరణించాడు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

నేడు అల్పపీడనం!



బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది ఈ నెల 16 నాటికి వాయుగుండంగా బలపడనుంది. దీంతో మంగళ, బుధవారాల్లో కోస్తా, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది.

వివరాలు 10లో ▸

విమానయానం ఫుల్ జోష్!



రాష్ట్రంలో విమానయాన రంగం జోరు మీద కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలోని ఆరు విమానాశ్రయాల ద్వారా 27,49,835 మంది ప్రయాణించారని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

వివరాలు 5లో ▸

హనుమంత వాహనంపై పద్మావతి అమ్మవారు



తిరుపతి జిల్లా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి అమ్మవారు హనుమంత వాహనంపై శ్రీరామచంద్ర మూర్తిగా మాడవీధుల్లో ఊరేగారు.

వివరాలు 5లో ▸

'హాల్ ఆఫ్ ఫేమ్'లో సెహ్వాగ్, ఎడుల్జీ

అరవింద డిసిల్వాకు కూడా చోటు

12లో

ఇదండీ జగత్



కార్యకర్తలకు ఖర్చుపెట్టడానికి డబ్బుల్లేవట!



బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక గ్రామంలోని లంక భూములు

లంక భూములు గట్టెక్కాయి

దశాబ్దాల రైతుల ఆశలకు సీఎం వైఎస్ జగన్ పట్టాభిషేకం

- విలువ ఉన్నా రైతుకు పనికిరాని పరిస్థితికి ఇక చెల్లు
- 9 వేల ఎకరాలకు పట్టాలివ్వనున్న ముఖ్యమంత్రి
- 8 జిల్లాల్లో 17 వేలకు పైగా కుటుంబాల్లో వెలుగు
- ఏళ్ల తరబడి తిరిగినా ఏ నాయకుడూ పట్టించుకోలేదంటున్న రైతులు
- 50 ఏళ్లుగా ప్రతి ప్రభుత్వానికీ తమ గోడు చెబుతూనే ఉన్నామని వేదన
- ఇన్నాళ్లకు జగనన్న తమ సమస్యను పరిష్కరించారని సంతోషం
- లంక భూముల నుంచి 'సాక్షి' ప్రతినిధి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

10లో



"మా తాత నుంచి నాకు అర ఎకరం పొలం వచ్చింది. కాగితాలు లేకపోవడంతో ఆ భూమిపై మాకు ఎలాంటి హక్కు లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇందుకోసం చాలా డబ్బు ఖర్చు చేశాం. జగన్ ప్రభుత్వం వచ్చాక పైసా ఖర్చు లేకుండా మా భూమికి పట్టా ఇస్తున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.


- తోడేటి నాంచారయ్య, చింతల్లంక, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా

పల్నాడు ప్ర'జల కళ'..

వరికపుడిశెల

రూ.320.26 కోట్లతో ఎత్తిపోతల నిర్మాణానికి రేపు శంకుస్థాపన చేయనున్న సీఎం వైఎస్ జగన్

- తొలి దశలో 24,900 ఎకరాలకు సాగునీరు
- అటవీ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో 6 దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన వరికపుడిశెల
- వరికపుడిశెలతోపాటు గోదావరి జలాలతో పల్నాడును సుభిక్షం చేసేందుకు సీఎం ప్రణాళిక
- సీఎం వైఎస్ జగన్ కృషితో టైగర్ ఫారెస్ట్‌లో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చిన కేంద్ర అటవీ శాఖ



సాక్షి, అమరావతి: పల్నాడు ప్రజల ఆరు దశాబ్దాల స్వప్నం వరికపుడిశెల ఎత్తిపోతలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. పులుల అభయారణ్యం (టైగర్ ఫారెస్ట్)లో వరికపుడిశెల ఎత్తిపోతల, పైపులైన్ పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీఎం వైఎస్ జగన్ చేసిన విజ్ఞప్తికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అంగీకరించింది. దీంతో వరికపుడిశెల ఎత్తిపోతల తొలి దశ పనులను రూ.340.26 కోట్లతో చేపట్టేందుకు మాచర్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. తొలి దశ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి.. అధునాతన పైప్డ్ ఇరిగేషన్(పూర్తిగా పైపులైన్ల ద్వారా) పద్ధతిలో 24,900 ఎకరాలకు నీళ్లందించే దిశగా అడుగులు వేస్తున్నారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో పల్నాడు ప్రాంతం ఒకటి. తలాపున వరికపుడిశెల వాగు, కృష్ణా నదులు ప్రవహిస్తున్నా పల్నాడులో సాగునీటికే కాదు.. గుక్కెడు తాగునీటికీ

మిగతా 2వ పేజీలో ▶

కులగణనకు నాంది

రేపు 5 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన ప్రారంభం

- 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో మొదలు
- రెండు రోజులు ప్రయోగాత్మకంగా కులగణన.. కుల గణనపై ఈ నెల 22 వరకు శిక్షణ
- బుధవారం నుంచే జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు
- విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు బుధవారం నాంది పలకనుంది. రాష్ట్రంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా కుల గణన చేపట్టనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాల్లో మూడు గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుంది. సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడానికి ఈ నెల 3న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కుల గణన ముందస్తు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి ఎం. గిరిజా శంకర్ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న వివిధ శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు తెలియజేస్తూ

మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం

ఇద్దరు చిన్నారులు సహా 9 మంది దుర్మరణం

మరో 9 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

నాంపల్లి బజార్‌ఘాట్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఘటన



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లి బజార్‌ఘాట్‌లోని బాలాజీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో సోమవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికీలలు ఎగసి పడటం, రసాయనాల వల్ల వెలువడిన పొగ పీల్చి అపస్మారక స్థితిలోకి చేరడం, ఆపై మంటలు అంటుకోవడంతో ఇద్దరు చిన్నారుల సహా 9 మంది అశువులు బాసారు. మరో 9 మందికి గాయాలు కాగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మరణించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా అపార్ట్‌మెంట్‌లో ఉన్న మరో 21 మందిని

మిగతా 10వ పేజీలో ▶



పెన్షన్లు విధాన నిర్ణయం

- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు
- చెల్లింపులు ప్రభుత్వ ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటాయి
- కోర్టుల జోక్యం తగదని 'సుప్రీం' సైతం చెప్పింది
- ఏటా పెన్షన్లకు కేంద్రం రూ.288 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.19,161 కోట్లు చెల్లిస్తోంది
- బహుళ పెన్షన్లపై ప్రభుత్వ నిబంధనల్లో జోక్యం చేసుకోలేం

3లో

చదువుకుందాం.. ఆడుకుందాం

ప్రభుత్వ బడుల్లో క్రీడలకు ప్రాధాన్యం

- అకడమిక్ కేలండర్‌లో అంతర్భాగం చేసిన ప్రభుత్వం
- 45 వేల స్కూళ్లకు సామగ్రి అందజేత
- ప్రతి స్కూల్ నుంచి కనీసం ఇద్దరు జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా శిక్షణ.. త్వరలో జిల్లాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సదుపాయాలు కల్పించి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం విద్యార్థులను క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే పాఠశాలలకు పీఈటీలను నియమించగా.. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు సమగ్ర శిక్ష ద్వారా రూ.27 కోట్లతో క్రీడా సామగ్రిని సైతం అందించింది. జాతీయ విద్యావిధానంలో భాగంగా క్రీడలనూ అకడమిక్ కేలండర్‌లో అంతర్భాగం చేసింది. పాఠశాలల్లో క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు త్వరలో ప్రతి జిల్లాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. వీటిని ఈ విద్యా సంవత్సరంలోనే అందుబాటులోకి తీసుకొచ్చి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కేంద్రాలలో

మిగతా 3వ పేజీలో ▶

పెద్ద స్క్రీన్లపై భారత్-న్యూజిలాండ్ సెమీస్

- విశాఖ ఆర్కే బీచ్ సమీపంలో, విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం, కడప ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు
- ఒక్కోచోట దాదాపు 10 వేల మంది వీక్షించేలా స్క్రీన్లు సిద్ధం
- 15వ తేదీ మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 11 వరకు ఉచితంగా వీక్షించవచ్చు
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి వెల్లడి

14లో





బ్రిటన్ మంత్రివర్గంలో కుదుపు

- భారత మూలాలున్న హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్‌పై వేటు
- వివాదాస్పద వ్యాఖ్యలే కారణం!
- ప్రధాని రిషి సునాక్ నిర్ణయం
- విదేశాంగ మంత్రిగా డేవిడ్ కామెరాన్.. మాజీ ప్రధానికి కీలక బాధ్యతలు
- విదేశాంగ నుంచి హోం శాఖకు జేమ్స్ క్లెవర్లీ.. తప్పుకున్న మరో ఏడుగురు మంత్రులు

6లో

క్లుప్తంగా...

ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు అరుదైన గుర్తింపు

మెడ్‌టెక్‌జోన్ డబ్ల్యూటీసీకి వరల్డ్ ట్రేడ్ సెంటర్ అసోసియేషన్ అప్రూవల్



సాక్షి, విశాఖపట్నం: వైద్య ఉపకరణాల తయారీ, ఎగుమతులలో ప్రపంచ దేశాలకు చిరునామాగా మారిన ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు మరో అరుదైన గుర్తింపు లభించింది. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన ఏఎంటీజెడ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు.. వరల్డ్ ట్రేడ్ సెంటర్ అసోసియేషన్ ఆమోదముద్ర వేసింది. 2022 మే 11న మెడ్‌టెక్ జోన్‌లో డబ్ల్యూటీసీ తాత్కాలిక కార్యాలయం ఏఎంటీజెడ్ క్యాంపస్‌లోని పిరమిడ్ టవర్స్ 4వ అంతస్తులో ప్రారంభమైంది. వైద్య ఉపకరణాల ఎగుమతులకు సంబంధించి అంతర్జాతీయ వాణిజ్య విస్తరణకు మెడ్‌టెక్ జోన్‌లోని డబ్ల్యూటీసీ కీలకంగా మారింది. ఈ అసోసియేషన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం అందులో మెడ్‌టెక్ జోన్‌కు చోటు కల్పిస్తున్నట్లు ధ్రువీకరించింది. ఇటీవలే 150 రోజుల్లోనే ఏఎంటీజెడ్‌లో నిర్మించిన ఇండియా ఎక్స్‌పో సిటీకి డబ్ల్యూటీసీ అసోసియేషన్ నుంచి ప్రశంసలు దక్కాయి.

కనీస మద్దతు ధరకు చిరుధాన్యాల కొనుగోలు

సాక్షి, అమరావతి: ఈ ఖరీఫ్ సీజన్‌లో జొన్నలు, రాగులు, కొర్రలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లాల వారీగా సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాపై ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో సమీక్షించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 4,643 హెక్టార్లలో జొన్న సాగు చేయగా 9,499 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. 21,536 హెక్టార్లలో 36,973 మెట్రిక్ టన్నుల రాగులు, 8,126 హెక్టార్లలో 8,660 మెట్రిక్ టన్నుల కొర్రల దిగుబడిని అధికారులు అంచనా వేశారు. ఆర్‌బీకెల ద్వారా కనీస మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనుందని తెలిపారు. జొన్న, రాగి, కొర్ర పంటలు ఈ నెల నుంచి జనవరి వరకు కోతకు వస్తాయని పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగు పెరుగుతున్న జిల్లాల్లో వాటిని కనీస మద్దతుధరకు కొనుగోళ్లకు వ్యవసాయ, రెవెన్యూశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చిరుధాన్యాలకు ప్రకటించిన కనీస మద్దతుధరను పోస్టర్లు, తదితర మార్గాల ద్వారా రైతులకు తెలపాలని సూచించారు. చిరుధాన్యాల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. చిరుధాన్యాలు కొనుగోళ్లు సమస్యల్లేకుండా సాఫీగా సాగేలాగ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నదీం అహమ్మద్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా హిరియల్ నదీం అహమ్మద్ పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ అహమ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 27తో పదవీకాలం ముగిసిన నదీం అహమ్మద్ పదవీ కాలాన్ని పొడిగించడంతో మరో రెండేళ్లపాటు కొనసాగనున్నారు.

■ తెలంగాణ

మళ్లీ ఐటీ సోదాలు

ఈసారి ఫార్మా రంగానికి చెందిన వారి ఇళ్లపై..

సాక్షి, హైదరాబాద్, పటాన్‌చెరు: నగరంలో ఐటీ అధికారుల వరుస సోదాలు సోమవారం మరోసారి కొనసాగాయి. ఫార్మా రంగానికి చెందిన పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో ఉదయం నుంచి ఐటీ అధికారుల బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడ, ఆర్‌సీపురం, వట్టి నాగులపల్లి, గచ్చిబౌలిలోని మై హోం భుజాలో సోదాలు నిర్వహించాయి. మై హోమ్ భుజాలో నివాసం ఉంటున్న ప్రదీప్ అనే ఫార్మా వ్యాపారి ఇంట్లో సోదాలు చేసినట్టు సమాచారం. ప్రదీప్ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబానికి సన్నిహితులని తెలిసింది. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్ గూడాలో అంతర్జాతీయ రసాయన పరిశ్రమకు చెందిన ఓ డైరెక్టర్ ఇంటిపై ఐటీ శాఖ అధికారులు దాడులు చేశారు. తనిఖీల సమయంలో ఎవరినీ లోపలికి రానీయకుండా సీఆర్పీఎఫ్ జవాన్లు బందోబస్తు నిర్వహించారు. ఆయా కంపెనీలకు చెందిన ఆర్థిక లావాదేవీల వివరాలకు సంబంధించిన పత్రాలను ఐటీ అధికారులు పరిశీలించినట్టు సమాచారం. కాగా, ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులకు పలు ఫార్మా కంపెనీల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు ఇస్తున్నట్టు అందిన పక్కా సమాచారం మేరకు ఐటీ అధికారులు మెరుపుదాడులు చేపట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

వావ్.. విశాఖ!



- ■ నగరం వైపు ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ల చూపు
- ■ ఇప్పటి వరకు బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్ కార్యకలాపాల కేంద్రం
- ■ ఇన్ఫోసిస్ రాక తర్వాత విప్రో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు
- ■ విప్రో బాటలో మరికొన్ని దిగ్గజ సంస్థలు

సాక్షి, అమరావతి : పాలనా రాజధానిగా సర్వహంగులూ సమకూర్చుకుంటున్న విశాఖ ముఖచిత్రం మారుతోంది. ఐటీ రంగంలో ఇప్పటివరకూ బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్(బీపీవో) కార్యకలాపాలకు ప్రధాన వేదికగా నిలిచిన ఈ నగరం.. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్(డీసీ)ను ఆకర్షిస్తోంది. ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ రాష్ట్రంలో తొలి డెవలప్‌మెంట్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటుచేయడంతో.. అదే బాటలో మరికొన్ని సంస్థలు ఆసక్తిచూపుతున్నాయి. ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాక ఎప్పటి నుంచో విశాఖ కేంద్రంగా బీపీవో సర్వీసులు నడిపిస్తున్న విప్రో కూడా డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. లావండర్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విశాఖ కేంద్రంగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తోంది. ఇంతకాలం విశాఖ అనగానే పల్సస్ గ్రూపు, డబ్ల్యూఎన్ఎస్, టెక్ మహీంద్రా, విప్రో వంటి బీపీవో కార్యకలాపాలే కనిపించేవి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బీచ్ ఐటీ డెస్టినీ పేరుతో విశాఖకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఆకర్షించేందుకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

బీచ్ ఐటీ డెస్టినీగా విశాఖ..

విశాఖను బీచ్ ఐటీ డెస్టినీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో.. ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజ సంస్థ విశాఖ రావడం వలన మరిన్ని ఐటీ పరిశ్రమలు ఇక్కడకు వచ్చే అవకాశముందని పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యాక్సెంచర్, సీడాక్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో కార్యాలయాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పలు ఐటీ సంస్థలు రాష్ట్రంలో శాఖల ఏర్పాటుకు ముందుకొచ్చాయని, ఈ పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తేవడంతో పాటు, ప్రస్తుత ఐటీ కంపెనీల అవసరాలు తీర్చడంపై దృష్టిసారించినట్టు శశిధర్ వెల్లడించారు.

అదానీ డేటా సెంటర్‌తో పాటు మరికొన్ని..

ఇప్పటివరకు బీపీవోల కేంద్రంగా ముద్ర ఉన్న విశాఖకు ఇన్ఫోసిస్ రాకతో ఆ ముద్ర చెరిగి.. డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతోందని ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ(అపిటా) గ్రూప్ సీఈవో ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమెజాన్, భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సంస్థలు డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పగా, తాజాగా ఇన్ఫోసిస్ 1,000 సీటింగ్ సామర్థ్యంతో క్యాంపస్‌ను ఏర్పాటుచేసింది. రానున్న కాలంలో దీన్ని మరింత విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. తాజాగా విప్రో కూడా అదే బాటలో అడుగులు వేస్తోంది. అలాగే, అదానీ డేటా సెంటర్ కూడా ఏర్పాటుకానుండటం.. సింగపూర్ నుంచి సముద్రమార్గం ద్వారా ఫైబర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటవుతుండటం.. పారిశ్రామిక రంగంలో నాలుగో తరం ఆవిష్కరణలను ప్రోత్సహించేలా దేశంలోనే తొలి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ.. కల్పతరువు పేరిట విశాఖలో ఏర్పాటుచేయడం.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రొబోటిక్స్, డేటా ఎనలిటిక్స్ వంటి వాటిపై పరిశోధనలను ప్రోత్సహించేలా ఆంధ్రా వర్సిటీలో మరో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకావడంతో పలు ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖలో ప్రారంభించేందుకు ఆసక్తిచూపుతున్నాయి. అతి తక్కువ వ్యయంతో పుష్కలమైన మానవ వనరులున్న నగరాల్లో విశాఖ ముందంజలో ఉందని తాజాగా నాస్కామ్-డెలాయిట్ విడుదల చేసిన నివేదికలో పేర్కొనడం కూడా విశాఖకు కలిసివస్తోంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉండటంతో విశాఖలో డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు పలు సంస్థలు చర్చలు జరుపుతున్నాయని, వీటిలో చాలా సంస్థలు స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లలో నమోదు కావడం వల్ల వాటి వివరాలను అప్పుడే చెప్పలేమని ఎస్‌టీపీఐ విశాఖ అడిషనల్ డైరెక్టర్ సురేష్ చెప్పారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం, త్వరలో మెట్రో రైలు పనులు ప్రారంభం కానుండటం, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌ను ఏర్పాటు చేస్తుండటంతో విశాఖ త్వరలోనే పూర్తిస్థాయి కాస్మోపాలిటన్ నగరంగా మారనుంది. దీంతో ఐటీ నిపుణులు పనిచేసేందుకు విశాఖను ఎంచుకునే అవకాశాలు పెరుగుతాయని పల్సస్ గ్రూపు సీఈవో గేదెల శ్రీనుబాబు వివరించారు.

పల్నాడు ప్ర'జల కళ'.. వరికపుడిశెల

▶ మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఇబ్బందులే. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 40 కి.మీ.ల ఎగువన కృష్ణా నదిలో వరికపుడిశెలవాగు కలవక ముందే.. ఆ వాగు నుంచి జలాలను ఎత్తిపోసి పల్నాడును సుభిక్షం చేయాలనే ప్రతిపాదన దశాబ్దాలుగా ఉంది. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పనులు చేపట్టడానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఆ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కాగితాలకే పరిమితమైంది.

పల్నాడును సస్యశ్యామలం చేసే దిశగా

వరికపుడిశెలవాగు, కృష్ణా, గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానం ద్వారా నదీ జలాలను తరలించి దుర్భిక్ష పల్నాడును సుభిక్షం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. దాంతో గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానం తొలి దశ పనులతోపాటు వరికపుడిశెల ఎత్తిపోతల తొలి దశ పనులను అధికారులు చేపట్టారు. వరికపుడిశెల వాగు కుడి గట్టున ఎత్తిపోతలను నిర్మించి తొలి దశలో రోజుకు 281 క్యూసెక్కుల చొప్పున 1.57 టీఎంసీలను తరలించి వెల్దుర్తి మండలంలో 24,900 ఎకరాలకు నీళ్లందించే పనులను రూ.340.26 కోట్లతో చేపట్టారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో వరికపుడిశెల వాగుపై ఎత్తిపోతల నిర్మాణం, ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించడానికి 4 కి.మీ.ల పొడవున పైపు లైన్ నిర్మాణానికి 19.13 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందుకు ప్రతిగా దుర్గి మండలంలో 21 హెక్టార్ల భూమిని అటవీ శాఖకు బదలాయించి పరిహారాన్ని కూడా ప్రభుత్వం చెల్లించింది. సీఎం జగన్ ఆదేశాల మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో పల్నాడు ప్రాంత ప్రజాప్రతినిధులు, జల వనరుల శాఖ అధికారులు పలు దఫాలుగా చర్చలు జరపడంతో కేంద్రం కదిలింది. వరికపుడిశెల ఎత్తిపోతలకు ఏప్రిల్ 28న అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది.

రేపు పల్నాడు జిల్లా మాచర్లలో సీఎం పర్యటన

వరికపుడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం పల్నాడు జిల్లా మాచర్లలో పర్యటించనున్నారు. అక్కడ వరికపుడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 9.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మాచర్ల చేరుకుంటారు. అక్కడ చెన్నకేశవ కాలనీ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలి వద్ద ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం సభలో ప్రసంగించి తిరిగి మధ్యాహ్నం తాడేపల్లికి చేరుకుంటారు.

పనులకు తొలగిన అడ్డంకి

శ్రీశైలం-నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వరికపుడిశెల ఎత్తిపోతల పనులు చేపట్టేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతిచ్చింది. దాంతో వరికపుడిశెలవాగు కుడి గట్టుపై పంప్‌హౌస్ నిర్మాణానికి.. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 4 కి.మీ.ల పొడవున పైపులైన్ నిర్మించడానికి మార్గం సుగమమైంది. దాంతో ఆ ఎత్తిపోతల పనులకు బుధవారం సీఎం శంకుస్థాపన చేస్తున్నారు. ఎత్తిపోతల ద్వారా వెల్దుర్తి, ఉప్పలపాడు, గొట్టిపాళ్ల, సిరిగిరిపాడు, బోదిలవీడు, గంగులకుంట, లోయపల్లి గ్రామాల పరిధిలో 24,900 ఎకరాలకు సరఫరా చేయడానికి వీలుగా పైపు లైన్‌లు వేయనున్నారు. పైపులైన్ల ద్వారా నీటిని తరలించడం వల్ల సరఫరా నష్టాలు ఉండవని.. ఆయకట్టుకు సమర్థవంతంగా నీటిని అందించవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరికపుడిశెల ఎత్తిపోతల రెండో దశలో పల్నాడులో భారీగా ఆయకట్టుకు నీళ్లందించేలా డీపీఆర్ తయారీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కులగణనకు నాంది

▶ మొదటి పేజీ తరువాయి

యూవో నోట్ విడుదల చేశారు. ముందస్తుగా ఐదు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో అవసరమైతే మార్పులు చేసి, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టనున్నట్లు సమాచారం.

సిబ్బందికి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా కుల గణనలో ఎన్యూమరేటర్లుగా వ్యవహరించే సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ చేసే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు మూడు విడతల్లో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో మంగళ, లేదా బుధవారం శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచే రౌండ్ టేబుల్ సమావేశాలు

కుల గణనపై ప్రభుత్వం బుధవారం నుంచి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత భాగస్వామ్యులతో ఈ సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఐదు ప్రాంతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు జరపనున్నారు. ఈ నెల 17న రాజమండ్రి, కర్నూలులో, 20న విశాఖ, విజయవాడలో, 24న తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రాంతీయ సదస్సులు జరిగే ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండవని రాష్ట్ర ప్రణాళిక శాఖ స్పష్టం చేసింది.

పలుకే.. బంగారమాయెనా!

స్మార్ట్‌ఫోన్లలో వీడియోలు చూపిస్తూ చిన్నారులను బుజ్జగిస్తున్న తల్లిదండ్రులు

క్రమంగా వాటి మాయలో పడిపోతున్న పిల్లలు | ఆలస్యమవుతున్న 'మాటలు'... | కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత 15 రెట్లు పెరిగిన 'స్పీచ్ డిలే' కేసులు | ఎదుగుతున్నకొద్దీ విచక్షణ కోల్పోతున్న వైనం



వయసు	పలికే పదాలు
➤ మొదటి సంవత్సరం	10 నుంచి 20 పదాలు
➤ రెండో సంవత్సరం	50 నుంచి 60 పదాలు
➤ మూడో సంవత్సరం	కనీసం 150 పదాలు.. ఆ పైన

- ➤ కెనడాకు చెందిన ఓ సంస్థ దీనిపై అధ్యయనం చేసింది. 6 నెలల నుంచి రెండేళ్లలోపున్న 900 మంది చిన్నారులను పరీక్షించింది.
- ➤ 20 శాతం మంది చిన్నారులు ప్రతిరోజూ సగటున 28 నిమిషాల సేపు స్మార్ట్‌ఫోన్లను చూస్తున్నట్లు తేలింది.
- ➤ 30 నిమిషాల డిజిటల్ స్క్రీనింగ్ వల్ల చిన్నారులకు 'స్పీచ్ డిలే' రిస్క్ 49 శాతం పెరుగుతుందని వెల్లడయ్యింది.

ఏం చేయాలి?

- ➤ ముందుగా చిన్నారుల చెంతకు స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్‌లు దరిచేరకుండా చూసుకోవాలి. పిల్లలకు అసలు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వవద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం సూచించింది.
- ➤ పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడపాలి. వారి నవ్వులకు, అరుపులకు ప్రతిస్పందించాలి.
- ➤ చిన్నారులను ముఖానికి దగ్గరగా తీసుకొని మాటలో, పాటలో, కథలో చెబుతూ.. మీకు కనెక్ట్ అయ్యేలా చూసుకోవాలి.
- ➤ స్నానం చేయించేటప్పుడు, పాలు తాగించేటప్పుడు, ఆహారం తినిపించేటప్పుడు.. చేసే పని గురించి వారికి వివరిస్తూ ఉండాలి.
- ➤ పిల్లలను ఆలోచింపజేయాలి. జంతువులు ఎలాంటి శబ్దాలు చేస్తుంటాయి? తదితరాలన్నీ అడుగుతూ, అనుకరిస్తుండాలి. పిల్లలు ఏ వస్తువు చూస్తుంటే.. దాని గురించి వివరిస్తుండాలి. తద్వారా పిల్లలు కూడా మిమ్మల్ని అనుకరించేందుకు ప్రయత్నిస్తూ.. క్రమంగా మాట్లాడుతారు.

విజయవాడకు చెందిన రాజేశ్, ఉష దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆ పిల్లాడిని బుజ్జగించేందుకు.. పుట్టిన ఏడాది గడిచేసరికల్లా స్మార్ట్‌ఫోన్‌లో వీడియోలు చూపించడం మొదలుపెట్టారు. ఏడుపు ఆపాలన్నా.. భోజనం చేయాలన్నా.. ఫోన్‌లోని వీడియోలు చూడాల్సిందే. ఇలా.. ఆ చిన్నారి క్రమంగా స్మార్ట్‌ఫోన్‌కు బానిస అవ్వగా.. ఆ తల్లిదండ్రులు నాలుగేళ్లయినా 'అమ్మా, నాన్న' అనే పిలుపులకు నోచుకోలేక పోయారు. చివరకు స్పీచ్ థెరపిస్ట్‌లను ఆశ్రయించి.. చికిత్స తీసుకోవాల్సి వచ్చింది.

- గుండ్ర వెంకటేశ్, ఏపీ సెంట్రల్ డెస్క్



ఒకప్పుడు చిన్న పిల్లలు ఏడిస్తే.. వారిని లాలించేందుకు తల్లిదండ్రులు జోలపాటలు పాడేవాళ్లు. ఎత్తుకొని ఆరుబయట తిప్పుతూ చందమామను చూపించి కబుర్లు చెప్పేవాళ్లు. అమ్మ, నాన్న.. అనే పదాలను చిన్నారుల నోటి వెంట పలికించడానికి ప్రయత్నించేవాళ్లు. వారు ఆ పదాలను పలకగానే విని మురిసిపోయేవాళ్లు. కానీ ఇప్పుడు సిరులొలికించే 'చిన్ని' నవ్వులు.. చిన్నబోతున్నాయి. చీకటి ఎరుగని 'బాబు' కన్నులు.. క్రమంగా మసకబారిపోతున్నాయి. చిట్టిపొట్టి పలుకుల మాటలు మాయమైపోతున్నాయి. మొత్తంగా స్మార్ట్‌ఫోన్లలో చిక్కుకొని 'బాల్యం' విలవిల్లాడిపోతోంది. చిన్నారుల నోటి వెంట వచ్చే 'అమ్మ, నాన్న..' అనే పిలుపులతో కొందరు తల్లిదండ్రులు పులకించిపోతుంటే.. మరికొందరు తల్లిదండ్రులు ఆ 'పలుకుల' కోసం నెలలు, సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సి వస్తోంది.

పునాది పటిష్టంగా ఉంటేనే..

ప్రతి ఒక్కరి జీవితంలో 'మాట్లాడటం' అనేది చాలా ముఖ్యమైన విషయం. చిన్నారులు ఎదుగుతున్నకొద్దీ మెల్లగా మాటలు నేర్చుకుంటూ ఉంటారు. మనం ఎలా మాట్లాడిస్తే అలా అనుకరిస్తూ ముద్దుముద్దుగా ఆ పదాలను పలుకుతుంటారు. ముఖ్యంగా చిన్నారి పుట్టిన మొదటి రెండేళ్లు లాంగ్వేజ్ డెవలప్‌మెంట్‌కు చాలా కీలకం. అప్పుడు సరైన పునాది పడితేనే.. మూడో ఏడాదికల్లా మంచిగా మాట్లాడగలుగుతారు.

'స్మార్ట్'గా చిక్కుకుపోయారు..

సాధారణంగా చిన్నారులు ఏదైనా త్వరగా నేర్చుకుంటారు. మొదటి రెండేళ్లలో ఇది ఎక్కువగా ఉంటుంది. వారు తమ చుట్టుపక్కల ఎవరైనా మాట్లాడుతూ ఉంటే.. వారి పెదాల కదలికను చూస్తూ అనుకరిస్తుంటారు. కానీ చుట్టుపక్కల అలాంటి వాతావరణం లేకపోతే వారిలో బుద్ధి వికాసం లోపిస్తుంది. కొందరు తల్లిదండ్రులు వారి పనుల ఒత్తిడి వల్ల తమకు తెలియకుండానే పిల్లలకు సెల్‌ఫోన్లను అలవాటు చేస్తున్నారు. పిల్లల ఏడుపును ఆపించడానికో, భోజనం తినిపించడానికో, నిద్రపుచ్చేందుకో ఫోన్‌లలో ఆ సమయానికి ఏది దొరికితే ఆ వీడియో చూపిస్తున్నారు. క్రమంగా అది అలవాటుగా మారి.. పిల్లలు బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోతున్నారు. వాటిలోనే లీనమైపోయి.. తల్లిదండ్రుల పిలుపులకు సరిగ్గా స్పందించలేకపోతున్నారు. తమ భావాలను మాటల రూపంలో వ్యక్తం చేయలేకపోతున్నారు. మరికొందరైతే గతంలో తాము నేర్చుకున్న పదాలను కూడా మర్చిపోయారు. ఫోన్లలో చూపించే కార్టూన్లు, గేమ్స్ వల్ల పిల్లలకు ఎలాంటి ఉపయోగం ఉండదు. అందులోని శబ్దాలు, మాటలను వింటారు. కానీ.. వాటికి, నిజజీవితానికి చాలా తేడా ఉండటంతో ఆ శబ్దాలు, మాటలను అనుకరించలేకపోతున్నారు. అదే సమయంలో తల్లిదండ్రుల మాటలను కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. దీని వల్ల పిల్లల్లో 'స్పీచ్ డిలే' సమస్య వస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కోవిడ్ తర్వాతే అధికం

చిన్నారుల్లో 'స్పీచ్ డిలే' సమస్య కోవిడ్ తర్వాత అధికమైందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి కేసుల సంఖ్య 15 రెట్లు పెరిగిందని పేర్కొంటున్నారు. లాక్‌డౌన్‌లో అందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. అలాంటి సమయంలో అనుబంధాలు పెరగాలి. కానీ, ఆ సమయంలో చుట్టుపక్కలవారికి, బంధువులకు దూరంగా ఉండటం వల్ల అందరూ స్మార్ట్‌ఫోన్లకు అంకితమైపోయారు. చిన్నారులను లాలించడానికి కూడా ఫోన్లను ఉపయోగించారు. దీనివల్ల 9 నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న కొందరు చిన్నారులు తమ కీలక సమయాన్ని కోల్పోయారు. వేరే పిల్లలతో కలవకపోవడం, తల్లిదండ్రులు సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల పిల్లల్లో 'స్పీచ్ డిలే' సమస్య అధికమైందని వైద్యులు చెబుతున్నారు. కోవిడ్‌కు ముందు వారానికి ఐదు కేసులు వస్తే.. కోవిడ్ తర్వాత 20 వరకు కేసులు వస్తున్నాయని పిల్లల వైద్యులు వెల్లడించారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం

చిన్నారులు ఫోన్‌కు అడిక్ట్ అవ్వకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. చిన్నారుల వద్ద ఫోన్ పెట్టేసి.. ఒంటరిగా వదిలేయవద్దు. అలాగే తల్లిదండ్రులు కూడా సెల్‌ఫోన్‌ను అనవసరంగా వినియోగించడం మానుకోవాలి. వీలైనంత ఎక్కువ సేపు పిల్లలతో గడుపుతూ.. వారి వైపే చూస్తూ కబుర్లు చెప్పాలి. పిల్లలను ఆలోచింపజేసేలా కుటుంబసభ్యులు, వస్తువులు, జంతువుల గురించి వర్ణిస్తూ మాట్లాడాలి. తద్వారా పిల్లలు సులభంగా మాటలు నేర్చుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ ఇండ్ల విశాల్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణుడు, విజయవాడ

గిరిజన ప్రాంతాల్లో భూ రీ సర్వే ముమ్మరం

- ● అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేకంగా డీజీపీఎస్ సర్వే
- ● సిగ్నల్స్ లేకపోవడమే కారణం
- ● 1010 గ్రామాల్లో పూర్తయిన గ్రౌండ్ సర్వే.. 776 గ్రామాల్లో డిజిటల్ రికార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అయితే కొండలు, లోయలు, సంక్లిష్టతర వాతావరణం ఉండే అల్లూరి సీతారామరాజు జిల్లాలో సమస్యలు అధిగమించి సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే వెయ్యి గ్రామాల్లో గ్రౌండ్ సర్వే పూర్తయింది. 776 గ్రామాల డిజిటల్ రికార్డులు కూడా రూపుదిద్దుకున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలు, లోయలు ఉండటం, తరచూ వర్షం పడుతుండడంతో కొద్దినెలల క్రితం వరకు ఎలా ముందుకెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. డ్రోన్ సర్వే ఆ ప్రాంతంలో చేయడం అసాధ్యంగా మారింది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో శాటిలైట్ సిగ్నల్స్ అందక ఆ ప్రాంతంలో డ్రోన్ సర్వే చేయడం సాధ్యం కాదని మొదట్లో సర్వే శాఖ నిర్ధారించింది. మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలో భూముల వివాదాలు, అనేక తరాల నుంచి రెవెన్యూ రికార్డులు లేకపోవడంతో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారాయి. గతేడాది నవంబర్‌లో ఈ ప్రాంతంలో డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) మిషన్లతో రోవర్ల ద్వారా సర్వే మొదలు పెట్టారు. కార్స్ (సీఓఆర్ఎస్) నెట్‌వర్క్‌కే దీన్ని కూడా అనుసంధానించి వేగంగా సర్వే చేస్తున్నారు.

వనరులు పరిమితం..

పరిమితమైన సిబ్బంది, తక్కువ వనరులతోనే సర్వేను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రంపచోడవరం, పాడేరు ఏరియాలన్నీ కలిపి కేవలం 325 మంది సర్వేయర్లే ఉన్నా, వారికితోడు ఇతర జిల్లాల నుంచి కొందరు మండల సర్వేయర్లను పంపి సర్వే నిర్వహిస్తున్నారు. ఆరు డీజీపీఎస్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించి వాటిపై ఐదుగురు ఐఏఎస్‌లను నోడల్ అధికారులుగా నియమించారు. వారి ఆధ్వర్యంలో ఒక డీజీపీఎస్ బృందం, మరో సర్వేయర్ల బృందం కలిపి ఆ ప్రాంతంలో ఎంతో కష్టపడి పనిచేయడంతో ఆగస్టు నాటికి 1,010 గ్రామాల్లో (3,13,815 ఎకరాలు) గ్రౌండ్ సర్వే పూర్తయింది. ప్రస్తుతం ఆ గ్రామాల్లో డిజిటల్ రికార్డులు తయారుచేస్తుండగా, 776 గ్రామాల్లో ఆ పని కూడా పూర్తయింది. ఆ గ్రామాల్లో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు కూడా జనరేట్ చేశారు. 361 గ్రామాల్లో సర్వే అన్ని దశలు పూర్తవడంతో అక్కడ నంబర్ 13 నోటిఫికేషన్లు కూడా జారీ చేశారు. 319 గ్రామాల్లో ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) కూడా తయారయ్యాయి. మొత్తం 2,676 గ్రామాల్లోని 9.42 లక్షల ఎకరాల్లో సర్వే చేయాల్సివుంది. అనేక సంక్లిష్ట పరిస్థితుల నడుమ డీజీపీఎస్ సర్వేను విజయవంతంగా నిర్వహిస్తున్నామని సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ కాకినాడ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కేజియాకుమారి తెలిపారు.

క్లుప్తంగా...

బాబుకు వత్తాసు పలికే పార్టీలను భూస్థాపితం చేస్తాం

1,142వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే నిరాహార దీక్షలో నాయకులు

తాడికొండ: ప్రజలను మోసం చేసిన మాజీ సీఎం చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ అమరావతి పేరుతో అడ్డగోలు రాజకీయాలు చేస్తున్న పార్టీలను బహుజనులంతా ఏకమై రానున్న ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,142వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ స్వలాభం కోసం చంద్రబాబు ఎంతకైనా తెగిస్తాడనేందుకు తెలంగాణలో టీడీపీని మూసేసి ఇతర పార్టీలకు మద్దతివ్వడమే నిదర్శనమని చెప్పారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పిడతల అభిషేక్, ఈపూరి ఆదాం, పులిదాసు, నూతక్కి జోషి, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మోదీ మాయలో పడొద్దు..

మాదిగలకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు సూచన

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే మాదిగలపై ప్రధాని మోదీ కపటప్రేమ చూపిస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు ధ్వజమెత్తారు. మాదిగలు మోదీ మాయలో పడొద్దని సూచించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సువర్ణరాజు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఉషా మెహ్రా కమిషన్ నివేదికను పట్టించుకోకుండా కాలయాపన చేసేందుకే కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని ప్రకటన చేశారన్నారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు పి.కిరణ్, మంద నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశ్నించడానికే పుట్టిన జనసేన తీరు విచిత్రం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రశ్నించడానికే పుట్టినట్లు చెప్పుకున్న జనసేన పార్టీ తీరు విచిత్రంగా ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు భిన్నమైన పద్ధతులు అనుసరిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణాలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న జనసేన... ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో కలిసి ప్రయాణం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. సీపీఎం ప్రచార జాతాల ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెన్షన్లు విధాన నిర్ణయం

బహుళ పెన్షన్లపై ప్రభుత్వ నిబంధనల్లో జోక్యం చేసుకోలేం

- న్యాయస్థానాల జోక్యం తగదని 'సుప్రీం' సైతం చెప్పింది
- చెల్లింపులు ప్రభుత్వ ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటాయి
- ఏటా పెన్షన్లకు కేంద్రం రూ.288 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.19,161 కోట్లు చెల్లిస్తోంది
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు



సాక్షి, అమరావతి: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ల విధానాన్ని హైకోర్టు సమర్థించింది. పెన్షన్ల చెల్లింపు పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఆర్థికపరమైన అంశాలు ముడిపడి ఉన్న వ్యవహారాల్లో నిర్దిష్టంగా ఫలానా విధంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఆదేశించలేవని పేర్కొంది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు సైతం చాలా స్పష్టంగా చెప్పిందని గుర్తు చేసింది. ఈ మేరకు ఒక కుటుంబంలో బహుళ పెన్షన్ల చెల్లింపుల విషయంలో ప్రభుత్వ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకానికి సంబంధించి ప్రభుత్వం 2019 డిసెంబర్‌లో జీవో 174 జారీ చేసింది. కుటుంబంలో బహుళ పెన్షన్ల చెల్లింపుల విషయంలో కొన్ని నిబంధనలు తెచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ న్యాయవాది తాండవ యోగేష్ 2022లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, సెర్ప్ సీఈవో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే బహుళ పెన్షన్ల విషయంలో నిబంధనలు రూపొందించిందని ప్రభుత్వ న్యాయవాది వడ్లమూడి కిరణ్ కుమార్ హైకోర్టుకు నివేదించారు.

తీర్పులో ముఖ్యాంశాలు ఇవీ..

ఈ గణాంకాలు చూశాక..

'కేంద్రం రూ.288 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.19,161 కోట్లు చెల్లిస్తోంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ఆసక్తికరమైన గణాంకాలను మా ముందుంచాయి. వృద్ధాప్య పెన్షన్ల కోసం కేంద్రం తన వాటా కింద ఏటా రూ.188.74 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.10,164 కోట్లు చెల్లిస్తోంది. వితంతు పెన్షన్ల కోసం కేంద్రం రూ.91.07 కోట్లు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.4,129.44 కోట్లు ఇస్తోంది. దివ్యాంగులకు కేంద్రం రూ.9.05 కోట్లు ఇస్తుంటే రాష్ట్రం రూ.2,594.31 కోట్లు చెల్లిస్తోంది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ఏటా పెన్షన్ల కింద వివిధ వర్గాలకు మొత్తం రూ.19,161.66 కోట్లు చెల్లిస్తోంది. ఈ గణాంకాలను చూసిన తరువాత జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదన్న పిటిషనర్ వాదనను మేం ఏమాత్రం అంగీకరించడం లేదు.

ప్రభుత్వ నిర్ణయానికే వదిలేస్తున్నాం

అశ్వనీకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వృద్ధులకు ఆర్థిక సాయం, పెన్షన్లు, నివాసం, మెడికల్ ఖర్చుల చెల్లింపు విషయంలో సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలు ఇచ్చింది. వృద్ధుల దయనీయ పరిస్థితిని సానుభూతి కోణంలో పరిశీలించి పెన్షన్ ఇవ్వటాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే పెన్షన్ మంజూరు పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందుబాటులో ఉన్న నిధులు, ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అంతేకాకుండా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు లోబడి ఉంటుందని తేల్చి చెప్పింది. అందువల్ల పెన్షన్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయాల్లో మేం ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం. అది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయానికే వదిలేస్తున్నాం. దివ్యాంగులకు పెన్షన్లు మంజూరులో కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థిక కోణంలో ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయం ఇది. దీన్ని పునఃసమీక్షించేందుకు మేం అధికరణ 226 కింద మాకున్న అధికారాన్ని వినియోగించలేం. ఆ నిర్ణయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విచక్షణకే వదిలేస్తున్నాం.' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

బీజేపీలో ఎన్నాళ్లు ఉంటారో చెప్పగలరా?

- పురందేశ్వరికి వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్న
- ఎప్పటికప్పుడు పార్టీలు మార్చగల నైపుణ్యం పురందేశ్వరి సొంతం
- చంద్రబాబు కోసమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు



సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితత్వం ప్రజలకు బాగా అర్థమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అన్నారు. ఎప్పటికప్పుడు పార్టీల రంగులు మార్చే నైపుణ్యం ఆమె సొంతమని విమర్శించారు. కనీసం బీజేపీలో అయినా ఎన్నాళ్లు ఉంటారో చెప్పగలరా? అని పురందేశ్వరిని విజయసాయిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 'ఎన్టీఆర్ కూతురిగా పుట్టి.. ఆయనకే వెన్నుపోటు పొడిచారు. ఆ తర్వాత ఎన్టీఆర్ వ్యతిరేకించిన కాంగ్రెస్‌లో చేరి కేంద్ర మంత్రి పదవి అనుభవించారు. అనంతరం కాంగ్రెస్‌కు అధికారం దక్కదని బీజేపీలో చేరారు. అక్కడ పదవి తీసుకొని టీడీపీ అధ్యక్షుడైన ఆమె మరిది చంద్రబాబుకు కొమ్ముకాస్తున్నారు. ఇన్ని రంగులు మార్చగల ఆమె నైపుణ్యాన్ని ఏమని పిలవాలి? టీడీపీలో ఎన్నాళ్లు ఉన్నారో.. కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారో, అక్కడి నుంచి ఎందుకు బయటకు వచ్చారో, బీజేపీలో ఎందుకు చేరారో, ఇందులో ఏ ఒక్క ప్రశ్నకూ పురందేశ్వరి జవాబు చెప్పలేకపోయారు. కనీసం బీజేపీలో అయినా ఎన్నాళ్లు ఉంటారో చెప్పగలరా?' అని పురందేశ్వరిని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రజలందరికీ ఒక అనుమానం వస్తోంది. ఇంతకూ ఆమె చంద్రబాబుతో విభేదించి టీడీపీ నుంచి బయటకు వచ్చారా? లేకపోతే చంద్రబాబు ప్రయోజనాలను కాపాడటం కోసం.. ఆయన పంపిస్తేనే వేరే పార్టీల్లో చేరి కోవర్టుగా పని చేస్తున్నారా?' అని నిలదీశారు.

రామోజీ ఎందుకింత కడుపు మంట?

'ఎందుకీ ఎంపీలు?' అంటూ రామోజీ తన కడుపు మంటను 'ఈనాడు' ద్వారా బయటపెట్టారని విజయసాయిరెడ్డి విమర్శించారు. 'ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్, విభజన హామీల అమలు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలంటూ ఈనాడులో రాసింది మరిచిపోయావా? హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అన్న చంద్రబాబేమో పోరాట యోధుడా?' అని రామోజీని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఏనాడూ మాట మార్చలేదని చెప్పారు. 2019 జూన్ 15న జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ ముందే.. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హోదా హామీని నెరవేర్చకపోతే ప్రధాని మాటలకు, పార్లమెంటుకు విలువేముందంటూ సీఎం జగన్ ప్రశ్నించారని గుర్తు చేశారు. 2019 జూన్ 20న ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ప్రధాని మోదీని అడిగారని పేర్కొన్నారు. 2021 ఫిబ్రవరి 20న జరిగిన నీతి ఆయోగ్ వర్చువల్ సమావేశంలో ప్రత్యేక హోదాతో పాటు పోలవరం సవరించిన అంచనాల అనుమతి గురించి ప్రధాని మోదీని సీఎం జగన్ అడిగారని వివరించారు. 2022 నవంబర్ 12 విశాఖలో జరిగిన సభలో హోదా, స్టీల్ ప్లాంట్, పోలవరం, విభజన హామీలు పరిష్కరించాలని ప్రధాని మోదీని సీఎం జగన్ కోరారని గుర్తుచేశారు. ఇవన్నీ రామోజీకి ఎందుకు కనపడలేదో ఆయనకే తెలియాలన్నారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ఖరారు

ఉమ్మడి మేనిఫెస్టోలో 12 అంశాలు.. ఇరుపార్టీల నేతల వెల్లడి

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో 12 అంశాలను చేర్చినట్టు ఆ పార్టీల నేతలు యనమల రామకృష్ణుడు, ముత్తా శశిధర్ తెలిపారు. రెండు పార్టీల మేనిఫెస్టో కమిటీ సమావేశం సోమవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ తరఫున ఆరు అంశాలతో మినీ మేనిఫెస్టో ఇచ్చామని, ఇప్పుడు జనసేన మరో ఆరు అంశాలు ఇచ్చిందని తెలిపారు. రెండింటితో మినీ మేనిఫెస్టో తయారు చేశామని, దీన్ని ముఖ్య నాయకులకు పంపుతామని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ బాగుపడాలని, రైతులకు మేలు జరగాలని, అన్ని రంగాల్లో ప్రజలు మహాశక్తివంతులవ్వాలని భావిస్తున్నామని ఆ దిశగానే ఉమ్మడి మేనిఫెస్టో రూపొందించామని వివరించారు. జనసేన నేత ముత్తా శశిధర్ మాట్లాడుతూ.. సంపన్న ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే రాజధాని, ఉచిత ఇసుక ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించడం, జనసేన సౌభాగ్యపథం ద్వారా నిరుద్యోగ యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడం, వ్యవసాయాన్ని భాగ్యపథంగా తీసుకెళ్లడం ద్వారా రైతులు, కౌలు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడం వంటి అంశాలను తమ తరఫున మేనిఫెస్టోలో చేర్చామని తెలిపారు. టీడీపీ తరఫున యనమల, అశోక్ బాబు, పట్టాభి పాల్గొనగా, జనసేన తరఫున ముత్తా శశిధర్, వరప్రసాద్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్‌పై దాడి

- పెందుర్తి మండలంలో జనసేన, టీడీపీ కార్యకర్తల వీరంగం
- డైరెక్టర్ కనకరాజుకు తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



గాయపడిన గనిశెట్టి కనకరాజు

పెందుర్తి: విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీలో టీడీపీ-జనసేన కార్యకర్తలు రెచ్చిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ భూ వివాదంలో తమకు అనుకూలంగా మాట్లాడలేదన్న కక్షతో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత గనిశెట్టి కనకరాజుపై జనసేన, టీడీపీ కార్యకర్తలు చందక గోవింద్, మాడిస హరీష్, దాసరి గణేష్ దాడికి పాల్పడ్డారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో కనకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కనకరాజు భార్య వెంకటలక్ష్మి చింతగట్ల సర్పంచ్‌గా ఉన్నారు. కొన్నాళ్ల క్రితం గ్రామానికి చెందిన చందక గోవింద్ కుటుంబసభ్యులు తమ భూమిని దుర్గాప్రసాద్, విక్రమరాజుకు విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే ఈ ఒప్పందంపై ఇరువర్గాలకు వివాదాలు తలెత్తాయి. దీంతో సమస్య పరిష్కారానికి ప్రయత్నించిన కనకరాజు ఆదివారం సాయంత్రం ఇరువర్గాలను పిలిపించగా.. వారి మధ్య వివాదం మరింత ముదిరింది. ఈలోగా అక్కడి వారు 100కు ఫోన్ చేసి పోలీసులకు విషయం చెప్పారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తర్వాత గోవింద్‌కు మద్దతుగా వచ్చిన హరీష్, గణేష్‌లు కనకరాజుపై వాటర్ బాటిల్, నికెల్‌చెస్టలతో దాడికి చేసి వెళ్లిపోయారు. కనకరాజు ఫిర్యాదు ఆధారంగా సోమవారం నిందితులైన గోవింద్, హరీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పెందుర్తి సీఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితులకు మద్దతుగా టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడారు. గోపాలపట్నం బెహరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గనిశెట్టి కనకరాజును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు.

చదువుకుందాం.. ఆడుకుందాం

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపిక చేసిన క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

క్రీడా పరికరాల కొనుగోలు

రాష్ట్రంలో 33,704 ప్రాథమిక, 4,138 ప్రాథమికోన్నత, 6,112 ఉన్నత, 1,044 హయ్యర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో విద్యార్థుల వయసుకు తగినట్టుగా క్రీడా పరికరాలను కొనుగోలు చేశారు. సీనియర్ సెకండరీ, ఉన్నత పాఠశాలలకు 17 రకాల వస్తువులు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 14 రకాలు, ప్రాథమిక పాఠశాలలకు 9 రకాల వస్తువుల చొప్పున అందించారు. వీటిలో వాలీబాల్, నెట్, త్రోబాల్, నెట్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, యోగా మ్యాట్లు, ఫుట్‌బాల్, షాట్‌పుట్ వంటి వస్తువులు ఉన్నాయి. ఈ సామగ్రి కోసం ఒక్కో పాఠశాలకు రూ.7,080 నుంచి రూ.17,700 చొప్పున నిధులు వెచ్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి, బోధన ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినెలా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నారు. ఇకపై ఈ స్కూల్ కాంప్లెక్స్‌లో క్రీడా సామగ్రి వినియోగంపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పీఈటీలు లేని పాఠశాలల్లో స్థానిక ఉపాధ్యాయులను గుర్తించి విద్యార్థుల్లో క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్ కుమార్ ఆదేశాలు సైతం జారీ చేశారు.

గతానికి భిన్నంగా క్రీడలకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులు ఉన్నప్పటికీ గతంలో వారికి ప్రోత్సాహం దాదాపు శూన్యమనే చెప్పాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక క్రీడలను విద్యలో అంతర్భాగం చేసింది. క్రీడల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థుల వివరాలు నమోదు చేసుకునేందుకు స్కూల్ అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో 'స్కూల్ గేమ్స్' విభాగాన్ని కూడా జోడించింది. జిల్లాస్థాయి పోటీలకు వెళ్లే విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తోంది. జిల్లా, ఆపై స్థాయి పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా చార్జీలు సైతం ప్రభుత్వమే అందించడం గమనార్హం. ఇప్పటికే క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను గుర్తించి జిల్లాకు ఐదు చొప్పున 130 క్రీడా ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి అండర్ 14, 17, 19 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 120 క్రీడాంశాల్లో ఇప్పటి దాకా 60 క్రీడాంశాల్లో పోటీలు ముగిశాయి. డిసెంబర్‌లో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ఉన్నందున ఈ నెలాఖరు నాటికి మిగిలిన అంశాల్లో పోటీలు పూర్తి చేసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృషి చేస్తోంది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఫిబ్రవరిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి జిల్లాలోను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను ఏర్పాటు చేసి ప్రతిభ గల విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.



జీవితాన్ని సంతోషమయం చేసుకోవడానికి అవసరమైనవి అతి కొద్ది అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

– మార్కస్ అరీలియస్

ఫోకస్

సాక్షి

మంగళవారం, 14 నవంబర్ 2023

ఇది మూణ్ణాళ్ళ కథ కాదు!

ప్రజల ఆరోగ్యం విషయంలోనూ పాలకులకు న్యాయస్థానాలు గడువు విధించాల్సి రావడం విచిత్రమే. అయితే, ఇప్పటికే అదే పనిలో ప్రభుత్వముంటే, త్వరితగతిన పనులు జరగడానికి ఈ గడువు విధింపు తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. శానిటరీ న్యాప్కిన్ల పంపిణీపై దృష్టి పెడుతూ, జాతీయ స్థాయిలో 'వాంఛనీయ' ఋతుస్రావ కాల ఆరోగ్య విధానాన్ని 4 వారాల్లో ఖరారు చేయాలంటూ సుప్రీమ్ కోర్ట్ గత సోమవారం అన్నమాట అలాంటిదే. ప్రభుత్వ ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సగటున ఎంతమంది ఆడపిల్లలకు ఎన్ని మరుగుదొడ్లు ఉండాలన్న దానిపైనా జాతీయ స్థాయిలో ఒక మోడల్‌ను నిర్ణయించాల్సిందిగా కోర్ట్ ఆదేశించింది. దాదాపు 37.5 కోట్ల మంది ఋతుస్రావ వయసువారున్న దేశంలో... 2011 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో... దేశ ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం ఇచ్చిన ఈ ఆదేశం మహిళా లోకానికి కొంత ఊరట.

ఋతుస్రావ ఆరోగ్య ప్రాధాన్యాన్ని కోర్ట్ గుర్తించడం, ప్రస్తావించడం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలో అనేకసార్లు ఆ పని చేసింది. పట్టని ప్రభుత్వాలకు అక్షింతలు వేసింది. ఏడు నెలల క్రితం ఏప్రిల్‌లో కూడా ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంలో స్పందిస్తూ, ఋతుకాలపు ఆరోగ్యంపై ఏకరూప జాతీయ విధాన రూపకల్పనకు కేంద్రాన్ని సుప్రీమ్ ఆదేశించింది. తాజాగా, కోర్ట్‌లో ప్రభుత్వ వకీలు పేర్కొన్నట్టు జాతీయ విధానం ముసాయిదాను కేంద్రం ఇటీవలే ఆన్‌లైన్‌లో పెట్టింది. సామాన్య ప్రజల మొదలు నిపుణుల దాకా అందరి అభిప్రాయాలు కోరింది. తద్వారా ఋతుస్రావం పట్ల తరతరాలుగా మన దేశంలో నెలకొన్న అనేక అపోహలనూ, సవాళ్ళనూ నిర్వీర్యం చేయాలన్నది ప్రయత్నం. అర్ధంతరంగా బడి చదువు మానేయడం సహా అనేక సమస్యలకు కారణమవుతున్న ఈ ఆరోగ్య అంశం పట్ల దృష్టి పెట్టడానికి స్వతంత్ర దేశంలో ఏడున్నర దశాబ్దాలు పట్టింది.

అలాగని అసలేమీ జరగలేదనలేం. కొన్నేళ్ళుగా ప్రపంచవ్యాప్తంగా ఋతుస్రావ కాల ఆరోగ్యం, పరిశుభ్రత (ఎంహెచ్‌హెచ్) పట్ల దృష్టి పెరుగుతోంది. భారత్‌లో సైతం ప్రజారోగ్య చర్చల్లో ఈ అంశాన్ని భాగం చేశారు. 'జాతీయ ఆరోగ్య మిషన్ 2011'లో గ్రామీణ ప్రాంతాల్లోని కౌమార బాలికల్లో ఋతుస్రావ కాలపు ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో దీన్ని చేర్చారు. కేంద్ర తాగునీటి, పారిశుద్ధ్య శాఖ సైతం 2015లోనే పాఠశాలలకు మార్గ దర్శకాలు జారీచేసింది. దాని ఫలితాలు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల్లో కొంత కనిపించాయి. పీరియడ్స్ వేళ ఆరోగ్యకరమైన పద్ధతులను పాటించడమనేది మునుపటి సర్వేతో పోలిస్తే, అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో 15 నుంచి 24 ఏళ్ళ వయసు యువతుల్లో 20 శాతం పెరిగింది. ఇది కొంత సంతోషకరం. పైగా, ఐరాస పేర్కొన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఎంహెచ్‌హెచ్ కూడా ఒకటనేది గమనార్హం.

నిజానికి, ఆంధ్రప్రదేశ్‌లో 'స్వేచ్ఛ', కేరళలో 'షీ ప్యాడ్', రాజస్థాన్‌లో 'ఉడాన్' ఇలా రకరకాల పేర్లతో వివిధ రాష్ట్రాలు కౌమార బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్కిన్లను పంపిణీ చేస్తున్నాయి. దీర్ఘకాలిక వినియోగ నిమిత్తం కేరళ, కర్ణాటకలు న్యాప్కిన్లకు బదులు ఋతుస్రావ కప్స్ అందిస్తున్నాయి. అయితే, సమాజంలోని దురభిప్రాయాలను పోగొట్టడమనే సవాలు మిగిలే ఉంది. పన్నెండేళ్ళ సోదరి దుస్తుల మీద ఉన్న తొలి ఋతుస్రావ రక్తపు మరకలను చూసిన ఓ అన్నయ్య ఆమెను అనుమానించి, కొట్టి చంపిన ఘటన ఆ మధ్య మహారాష్ట్రలో జరిగింది. ఆడవారికే కాక, మగవారికి సైతం పీరియడ్స్ పట్ల అవగాహన పెంచాలంటున్నది అందుకే. 'ఆ 3 రోజులు' ఆడవారిని ప్రాథమిక వసతులైనా లేని గుడిసెల్లో విడిగా ఉంచే మహారాష్ట్ర తరహా అమానుష పద్ధతుల్ని మాన్పించడం లక్ష్యం కావాలి. ఋతుక్రమం అపవిత్రత కాదనీ, శారీరక జీవప్రక్రియనీ గుర్తెరిగేలా చేయాలి.

తగిన ఎంహెచ్‌హెచ్ వసతులు లేకపోవడంతో ఏటా మన దేశంలో 2.3 కోట్ల మందికి పైగా బాలికలు అర్ధంతరంగా బడి చదువులు మానేస్తున్నట్టు సర్వేల మాట. సరిగ్గా చదువుకోని వారు ఋతుస్రావ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపలేకపోతున్నారన్నది దాని పర్యవసానం. అంటే, ఇది ఒక విషవలయం. దీన్ని ఛేదించాలి. బడిలో వసతులు పెంచడంతో పాటు జాతీయ విధానం ద్వారా ఆరోగ్యంలో, సామాజిక అనాచారాలను మాన్పించడంలో టీచర్లు కీలక పాత్ర పోషించేలా తగిన శిక్షణనివ్వాలి. విధానాల నిర్ణయం, కార్యక్రమాల రూపకల్పనలో తరచూ ఓ పొరపాటు చేస్తుంటారు. యువతుల మీదే దృష్టి పెట్టి, ఋతుక్రమం ఆగిపోయిన లక్షలాది మహిళల ఆరోగ్యాన్ని విస్మరిస్తుంటారు. అది మారాలి. మెనోపాజ్ అనంతర ఆరోగ్యం, అపోహల నివృత్తిపైనా చైతన్యం తేవాలి. ఆరోగ్య కార్యకర్తలకు అందుకు తగ్గ శిక్షణనివ్వాలి. ప్యాడ్ల పంపిణీతో బాధ్యత ముగిసిందనుకోకుండా సంక్లిష్ట సామాజిక అంశాలపై జనచైతన్యం ప్రధానాంశం కావాలి.

ఇన్నేళ్ళకు ఒక జాతీయ విధానం తేవడం విప్లవాత్మకమే కానీ దానితో పని సగమే అయినట్టు! గ్రామప్రాంతాల్లోనూ అందరికీ అందుబాటు ధరలో న్యాప్కిన్లుండాలి. శుభ్రమైన మరుగుదొడ్లు, నీటి వసతి బడిలో భాగం కావాలి. ఆరోగ్యం, ఆచారం లాంటి అంశాల్లో తరతరాలుగా సమాజంలో నెలకొన్న అభిప్రాయాలను పోగొట్టడం సులభం కాకపోవచ్చు. కానీ, అందుకు ప్రయత్నించకపోతే నేరం, ఘోరం. ఋతుస్రావ ఆరోగ్యంపై చైతన్యం తేవడంలో భారత్ మరింత ముందడుగు వేసేందుకు సత్వర జాతీయ విధానం తోడ్పడితే మేలు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సైతం ఏళ్ళు పూళ్ళు తీసుకొని, మరో అయిదేళ్ళ తర్వాత అమలు అంటున్న పాలక వర్గాలు ఆకాశంలో సగమనే ఆడవారి తాలూకు శారీరక, మానసిక ఆరోగ్యం గురించి వెంటనే పట్టించుకుంటే అదే పదివేలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.2.21 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** అనూరాధ తె.4.10 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.7.54 నుండి 9.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.26 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** సా.5.36 నుండి 7.13 వరకు

సూర్యోదయం : 6.08
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వ్యర్థాలూ ఆదాయ మార్గం కావాలి!

అభిప్రాయం



టి.కె. అరుణ్

పంట వ్యర్థాలను సేకరించే శ్రమను తీసుకోవాలంటే రైతులకు ఒక ప్రేరణ అవసరం. అన్ని రకాల వ్యవసాయ వ్యర్థాలూ ఎరువులను ఉత్పత్తి చేయడానికి అనువైనవి. దీని నుంచే వచ్చే ఘన ఎరువు స్వయంగా ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు. ఇందులో వెలువడే మీథేన్‌ను వెంటనే వాడుకునే వీలుగా వేరే చోటికి పైపుల ద్వారా తరలించాలంటే, దానిలోని ఇతర వాయువులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రాంతంలో లభించే పంట అవశేషాలు, ఇతర వ్యవసాయ వ్యర్థాల పరిమాణంపై ప్రభుత్వం నమ్మదగిన అంచనాలతో ముందుకు వస్తే, వ్యవస్థాపకులు తగిన పరిమాణాలలో బయోడైజెస్టర్లను ప్లాన్ చేయవచ్చు. అప్పుడు కాలుష్యానికి కారణమయ్యేలా పంట వ్యర్థాలను వృథాగా కాల్చే పనివుండదు.

ప్రభుత్వ సీనియర్ అధికారులు కచ్చితంగా క్వాంటమ్ కణాలకు చాలా భిన్నమైనవారు. అయినప్పటికీ, కణాలకూ, అధికారులకూ ఒక సారూప్యమైన గుణం ఉంటుంది. గమనించినప్పుడు స్థితి మార్చుకోవడం! పరిశీలనకు సంబంధించిన తక్షణ చర్యే మార్పును ప్రేరేపిస్తుంది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం పంట అవశేషాల దహనానికి స్వస్తి చెప్పాలని ఉత్తర భారత రాష్ట్రాల అధికారులను ఆదేశించినందున, అది ఎలా చేయాలో వారికే వదిలేస్తే, మనం ఎంతో కొంత చర్యను ఆశించవచ్చు. తదుపరి పంటను వేయడానికి తమ పొలాల్లోని పంట అవశేషాలను తొలగించాల్సిన రైతులతో విభేదాలు లేకుండా కోర్టు ఆదేశాలపై ఎలా చర్య తీసుకోవాలనే విషయంపై ఇక్కడ కొన్ని సూచనలు ఉన్నాయి.

ప్రపంచంలోని ఐదు అత్యంత కాలుష్య నగరాలలో నాలుగు దక్షిణాసియా నగరాలే. అవి: లాహోర్, ఢిల్లీ, ముంబై, ఢాకా. భారత దేశం, పాకిస్తాన్ సరిహద్దుకు ఇరువైపులా ధాన్యాన్ని వేరుచేసిన తర్వాత పొలాల్లో మిగిలినదాన్ని తగుల బెట్టే ఆచారం సమస్యలకు కారణం అవుతోంది. వాస్తవానికి, గాలిలో సాంద్రతలో ఈ మసి గరిష్ఠంగా 40 శాతం వరకు ఉంటుంది. దీంతో గాలి వేగాన్ని తగ్గించే వాతావరణం ఏర్పడడం వల్ల, కురుస్తున్న వర్షాన్ని అరికట్టడం వల్ల ఈ కాలుష్య కారకాలు చాలాకాలం పాటు అలా గాలిలో నిలిచివుంటాయి. ఇది గాలి నాణ్యతను గణనీయంగా క్షీణింపజేస్తుంది.

వాహనాల పొగ, నిర్మాణపరమైన పనుల వల్ల ఏర్పడే దుమ్ము కాలుష్య కారకాలలో ఎక్కువ భాగంగా ఉంటున్నాయి. ఈ కాలుష్య మూలాలను అరికట్టడం చాలా కష్టం. వాహనాల కాలుష్యాన్ని తొలగించాలంటే, శిలాజ ఇంధనాలను వినియోగించే అంతర్గత దహన యంత్రాల స్థానంలో వాహనాలకు విద్యుచ్ఛక్తిని ఇవ్వాల్సి ఉంటుంది. శుభ్రపర్చిన ఇంధనాలు, మెరుగైన ఇంజన్లు తాత్కాలికంగా సహాయపడతాయి. కాలుష్య కారక వాహనాలను శుభ్రపరిచి వాటిని మార్చే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దీనికి సమయం పడుతుంది. రోడ్డుపై నుండి వాహనాలు వెలువరించే ధూళిని ఎలా తగ్గించవచ్చు అంటే... అన్ని రోడ్ల పక్కన బహిర్గతమైన నేల, బహిరంగ ప్రదేశాలను కప్పడానికి గడ్డిని నాటడం ద్వారా. వెంటనే మొదటి గాలికే దుమ్మును దులిపే రకం చెట్లను కాకుండా, ఆ దుమ్మును నిలుపుకోగలిగే పచ్చదనాన్ని నాటడం కూడా మేలుచేస్తుంది. అయితే ఎడారి నేల మీదుగా వీచే గాలుల ద్వారా కొట్టుకువచ్చే దుమ్మును తగ్గించడానికి చేయగలిగేది తక్కువ.

నగరాల్లో జరిగే నిర్మాణ పనుల్లో దాని స్థానిక రూపంలోని పొడి సిమెంట్‌ను కాకుండా ముందే కలిపిన కాంక్రీట్‌ను మాత్రమే ఉపయోగించేట్టు చేయాలి. కాంక్రీట్ కలపడం కూడా బహిరంగంగా కాకుండా పరివేష్టిత ప్రదేశాలలో జరగాలని పట్టుబట్టడం ద్వారా చాలావరకు నిర్మాణాల పరమైన ధూళిని అరికట్టవచ్చు. ఇవి అవసరమైన చర్యలు.



సంపూర్ణంగా ఆచరణీయమైనవి. అలాగని 19వ శతాబ్దానికి చెందినట్లుగా ఇంకా పంట అవశేషాలను తగులబెట్టడం కొనసాగాలని అర్థం కాదు. ఆ అలవాటు అంతరించిపోవాలి. కానీ ఎలా?

పంట వ్యర్థాలు, అలాగే అన్ని రకాల వ్యవసాయ వ్యర్థాలు, జీవ జీర్ణక్రియలో చిక్కుకున్న శక్తిని విడుదల చేయడానికీ, ఎరువులను ఉత్పత్తి చేయడానికీ అనువైనవి. నీటి ఆవిరి, కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, పేడనీళ్లతో కలిపిన మొక్కల అవశేషాలు మీథేన్‌గా కుళ్లిపోతాయి. దీని నుండి అవసరమైతే ఘన ఎరువులను తీయవచ్చు. దీనికిదే స్వయంగా ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు. ఇందులో వెలువడే మీథేన్‌ను వెంటనే వాడుకునే వీలుగా వేరే చోటికి పైపుల ద్వారా తరలించాలంటే, దానిలోని ఇతర వాయువులను శుభ్రం చేయాల్సి ఉంటుంది.

బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించడం, వాటిని నిర్వహించడం అనేవి వ్యవసాయానికి భిన్నమైన కార్యకలాపాలు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్వాహకులు కొనుగోలు చేయగలిగిన పంట అవశేషాలను కుప్పలుగా సేకరించడానికి రైతుకు ఒక ప్రేరణ అవసరం. పంట వ్యర్థాలను వదిలించుకోవడానికి ఒక మార్గం ఏమిటంటే, హ్యాపీ సీడర్ అనే యంత్రాన్ని ఉపయోగించడం. ఇది పొలాల నుండి వ్యర్థాలను అటు తీస్తూనే, ఇటు తదుపరి పంట విత్తనాలను నాటుతుంది. ఆ వ్యర్థాలను పొలంలోనే నశించేట్టు చేస్తుంది. అయితే ఈ పరికరం విస్తృతమైన కొనుగోలుకు లేదా అద్దెకు నోచుకోలేదు. తదుపరి పంటను నాటడానికి ఉన్న విరామం చాలా స్వల్పం. రైతులందరికీ ఆ వ్యవధిలో పని చేయడానికి సరిపడా హ్యాపీ సీడర్లు అందుబాటులో లేవు.

బయోగ్యాసును ఉత్పత్తి చేసే శక్తిమంతమైన కొత్త పరిశ్రమకు ముడి పదార్థంగా ఈ పంట అవశేషాలను అందించడమే మేలైన ప్రత్యామ్నాయంగా కనబడుతోంది. దీనిద్వారా రైతులు తమ పంట అవశేషాలను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతారు. పైగా సింథటిక్ ఎరువుల ధరతో పోల్చదగిన ధరకు సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంటాయి. కానీ పంట అవశేషాలు అనేవి చురుకైన కాలుష్య కారకాల నుండి అదనపు వ్యవసాయ ఆదాయానికి పనికొచ్చే ప్రయోజనకరమైన ప్రవాహంగా మారడం దానంతటదే జరగదు. దానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బయోడైజెస్టర్లు వివిధ స్థాయుల సాంకేతిక అధునాతనత్వంతో రావచ్చు. ఇది ఎక్కువగా ముడి పదార్థంగా ఉపయోగించే వివిధ రకాల సేంద్రియ పదార్థాల ముందస్తు చికిత్సపై ఆధారపడి ఉంటుంది. ఒక భారతీయ బహుళజాతి సంస్థ బయోగ్యాస్ కోసం పెద్ద ప్రణాళికలను కలిగి ఉంది. బహుశా అధునాతన బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించి సరఫరా చేస్తుంది. ఇది ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లో చెరకు పంట వ్యర్థాలను నిర్వహిస్తోంది.

ప్రతి ప్రాంతంలో లభించే పంట అవశేషాలు, ఇతర వ్యవసాయ వ్యర్థాల పరిమాణంపై ప్రభుత్వం నమ్మదగ్గ అంచనాలతో ముందుకు వస్తే, వ్యవస్థాపకులు తగిన పరిమాణాలలో బయోడైజెస్టర్లను ప్లాన్ చేయవచ్చు. ఈ ప్రక్రియ పట్ల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు బాగా ఆలోచించి సబ్సిడీతో బలం చేకూర్చినప్పటికీ, ప్లాంట్లను నిర్మించడం, గ్యాసు కోసం పైప్‌లైన్ నెట్వర్క్ వేయడం, గ్యాసును ఎలా ఉపయోగించాలో నిర్ణయించడం వంటి వాటికి కాస్త సమయం పడుతుంది.

అయితే ఇప్పుడు పంట వ్యర్థాలను తగలబెట్టడం ఆపేయాలని కోర్టు ఆదేశం. దీని వల్ల మంటలను ఎలాగైనా ఆర్పడానికి పోలీసులను ఉపయోగించాలనే ఆలోచన కలిగించవచ్చు. ఇది ఓటర్లుగా కూడా ఉన్న రైతుల్లో భిన్నమైన మంటలను రేకెత్తిస్తుంది. అందువల్ల పంట వ్యర్థాలను సేకరించడం, నిల్వ చేయడమే సరైన పరిష్కారం. వ్యర్థాలను బయటకు తీయడానికి, రవాణా చేయడానికి రైతులకు అయ్యే ఖర్చును భరించడానికి ఒక సేకరణ ఏజెన్సీ సరిపోతుంది. భాక్రానంగల్ డ్యామ్ నిర్మిస్తున్నప్పుడు, దాని నిర్మాణానికి చెల్లించాల్సిన పన్ను గురించి రైతులు నిరసన వ్యక్తం చేసినప్పుడు, రాజకీయ నాయకులు, సీనియర్ అధికారులు ఆ ప్రాంతాన్ని రైతులు సందర్శించేలా చూశారు. తమ ముందు రూపుదిద్దుకుంటున్న ఆధునిక అద్భుతాన్ని స్వయంగా చూసేందుకు రైతులను ప్రాజెక్ట్ స్థలానికి తీసుకెళ్లారు. ప్రతాప్ సింగ్ కైరోన్(పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి), అప్పటి వ్యవసాయ కార్యదర్శి ఆర్‌ఎస్ రంధావా, అప్పటి శాఖ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ సింగ్ వంటి వారు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించారు. రైతులు మరింత ఆహారాన్ని పండించాలనీ, మార్పునకు ఏజెంట్లుగా ఉండాలనీ కోరారు. నేడు పంజాబ్‌లోని రాజకీయ, పరిపాలనా నాయకులు మార్పుకు ఏజెంట్లుగా మారడానికి అవకాశం ఉంది. అయితే వారు ఈ సందర్భానికి తగినట్టుగా ప్రవర్తించగలరా అనేది ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అన్యాయం



బ్రిటన్‌లో వెన్నెముక ఉన్న ఒకే ఒక్క రాజకీయ నేత సువెల్లా బ్రేవర్‌మాన్‌ను హోం మంత్రిగా తొలగించడం సిగ్గుచేటు. ప్రధాని రిషీ సునాక్ ఆమెకు అండగా నిలబడలేకపోయారు.

– హారిస్ సుల్తాన్, యాక్టివిస్ట్

అసలు బాధ్యత



బ్రిటన్ హోం మంత్రిగా నియమితుడిని కావడం నాకు దక్కిన గౌరవం. లక్ష్యం స్పష్టం. ఈ దేశంలోని ప్రజలందరినీ సురక్షితంగా ఉంచడం నా బాధ్యత.

– జేమ్స్ క్లెవెర్లీ, బ్రిటన్ నూతన హోంమంత్రి

ఉన్నదే!



యూదు వ్యతిరేకత అనేది కొత్తగా పెరిగిందేమీ కాదు. కాకపోతే కొన్ని వారాలుగా పదులు, వేలమంది ధైర్యంగా తమను తాము వ్యక్తపరుచుకుంటున్నారంతే. అదే తేడా!

– కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యాఖ్యాత

బాగా చేస్తున్నారు!



మా కంపెనీకి 2023-24 సంవత్సరానికి గానూ ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్‌లు ఫైలింగ్ చేసిన మూడు వారాల్లోనే ఆదాయ పన్ను డబ్బు వాపసు వచ్చింది. ఇంత వేగంగా, కచ్చితంగా పని జరగడం ఇంతకుముందు వినలేదు. ఆదాయ పన్ను శాఖ చూపుతున్న సామర్థ్యం, పారదర్శకత నమ్మలేనట్టుగా ఉంది. ఈ పనితీరు నచ్చింది. సంభ్రమం కలిగించింది.

– ఆర్. మాధవన్, నటుడు

తగని పని



'టైగర్ 3' సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్‌లో టపాకాయలను కాల్చినట్టుగా విన్నాను. అది ప్రమాదకరం. మనల్నీ ఇతరులనూ ప్రమాదంలోకి నెట్టకుండా సినిమాను ఎంజాయ్ చేద్దాం. సురక్షితంగా ఉండండి.

– సల్మాన్ ఖాన్, నటుడు

మంచి ఆటగాళ్లు



రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్), శ్రేయస్ అయ్యర్ (ఇండియా), మార్కోజాన్ సెన్ (దక్షిణాఫ్రికా), అజ్మతుల్లా ఒమర్జాయి (అఫ్గానిస్తాన్), దిల్‌శాన్ మదుశంకా (శ్రీలంక) – ప్రపంచ కప్‌లో కొత్తగా ఆడుతున్న ఈ ఐదుగురు క్రికెటర్లు నాకు ఎంతగానో నచ్చారు. వీళ్ల ఆటతీరు వీరిని ఎంతో ఎత్తుకు ఎదిగేలా చేస్తుంది. మీకు నచ్చిన ఐదుగురు ఎవరు?

– ఇర్ఫాన్ పఠాన్, మాజీ క్రికెటర్

సహించరా?



బక్రీద్ రోజున అనాలోచితంగా జంతువులను చంపడం గురించీ, మసీదుల్లో లౌడ్ స్పీకర్ల గురించీ, కొత్త సంవత్సరం రోజున అక్కర్లేని టపాకాయల గురించీ, ప్రేమికుల దినోత్సవం రోజున మద్యం, మాదక ద్రవ్యాల వాడకం గురించీ, ఖరీదైన పెళ్లిళ్లలో డబ్బులు, ఆహారం వృథా చేయడం గురించీ నేను వ్యాఖ్యానిస్తూనే ఉంటాను. కానీ ఎందుకో దీపావళి కాలుష్యం గురించి ఎత్తితే మాత్రం నేను హిందూ ద్వేషిని అయిపోతాను.

– యానా మీర్, యాంకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

పెద్దలకో విజ్ఞప్తి!

పెద్దలు ఎప్పుడూ పిల్లలకి బుద్ధులూ, సద్దిమూట సుద్దులూ చెబుతారే గానీ తాము వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మాత్రం పట్టించుకోరు. పిల్లల్ని చూస్తే రైతన్న దున్నగా విత్తడానికై సంసిద్ధంగా ఉన్న మెత్తటి నేలలు గుర్తొస్తాయి. 'యథా బీజం తథోత్పత్తిః' అన్నట్టుగా మనం ఏ బీజాలైతే చల్లుతామో, అవే మొలకెత్తుతాయి. వాటి ఫలాలే లభిస్తాయి. అంటే ఇక్కడ రైతన్న పాత్ర పోషించేది పెద్దలే. ఏమీ తెలియని వయసులో ఈ బాలలు పెద్దల చేతికి అందిన మట్టి ముద్దలు. ఇక్కడనే ఒక పెద్దగా మన బాధ్యత కాస్త గుర్తెరగాలి.

రోజువారీ యాంత్రిక జీవనంలో పిల్లల్ని పట్టించుకునే తీరిక ఎవరికీ ఉండడం లేదు. వారిని ఎవరికో ఒకరికి అప్పగించాల్సి వస్తోంది. ఎక్కువ కాలం పిల్లలతో గడిపేవారి ప్రభావాలే పిల్లలపై పడతాయనేది గమనార్హం. బడిలో చేర్పేస్తే చాలు పిల్లలు చక్కగా తయారైపోతారని అనుకుంటారు. కానీ ఇంటిల్లిపాదీ ఒక ప్రాక్టికల్ రంగస్థలం అని తెలుసుకోవాలి.

పిల్లవాని మనస్తత్వంపై ఆతడు చేసే సహవాసం అత్యంత ప్రభావం చూపుతుంది. అలాగే సెల్ ఫోన్, ట్యాబ్‌లు వంటివి చూపే ప్రభావం అంతా ఇంతా కాదు. పిల్లలందరూ లోతైన ఊర బావి లాంటి వారు. పిల్లలు దేవునితో సమానం అనే మాటను గుర్తు చేసుకొని, దైవారాధనకు ఎంత నిష్ఠగా కూర్చొంటామో, పిల్లల్ని సక్రమ పద్ధతిలో పెంచే పవిత్ర కార్యక్రమం కూడా అంతే శ్రద్ధగా పాటించాలి. పిల్లల్లోని సద్గుణాల్ని వ్యవసాయం చేసి వెలికి తీయాలని భగవద్గీత చెబుతూ ఉంది. పిల్లలు చేసే ప్రతీ పనినీ ప్రోత్సహించాలి. తప్పులుంటే వారిని అవమాన పరచి, వారిలోని జిజ్ఞాసను అణచి వేయగూడదు. వారిని దగ్గరకు పిలుచుకొని హక్కున చేర్చుకోవాలని ప్రభువు చెబుతాడు. పరలోకం చేరాలంటే మీరు పసిపిల్లల్లా కావాలని సూచిస్తాడు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు । విజయవాడ

బాలల వికాసం కోసం ఏం చేస్తున్నాం?

సందర్భం



వారాల ఆనంద్

పిల్లల మనో వికాసానికీ, సమగ్ర ఎదుగుదలలో సాహిత్య, సాంస్కృతిక అంశాల పాత్ర ఎంతో ఉంది. చదువు మేధస్సు ఎదుగుదలకూ, క్రీడలు శారీరక ఎదుగుదలకూ తోడ్పడితే సాంస్కృతిక విషయాలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. వారిలో సాటి మనిషిని ప్రేమించే తత్త్వాన్ని ఇస్తాయి. సాంస్కృతిక విషయాల్లో అధ్యయన అంశాలు, దృశ్య మాధ్యమాలు పిల్లల పైన అనితర సాధ్యమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. అయితే మనం నవంబర్ నెలలో నెహ్రూ జయంతి సందర్భంలో మాత్రమే పిల్లల గురించి మాట్లాడతాం. తర్వాత మరచిపోతాం. ఏ రాజకీయ పార్టీ కూడా బాలల కోసం ఏదయినా చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం ప్రకటించదు. అన్ని పథకాలూ ఓటర్ల కోసమే. బాలలు ఓటర్లు కాదు కనుక వాళ్ళకోసం ఎలాంటి ఆలోచనా లేదు, రాదు.

అంతేకాదు బాలల కోసం ప్రత్యేకంగా రాసేవాళ్ళు తక్కువ. రాసిన వాళ్ళకు ప్రోత్సాహకాలు తక్కువ. పిల్లల పుస్తకాలకు మార్కెట్ తక్కువ. పిల్లల్ని చేరే సాహిత్యం తక్కువ. కథలు లేదా కవితలు రాయడానికి పిల్లల్ని ప్రోత్సహించడం అరుదు. పిల్లల్ని మార్కుల వెంట పరుగెత్తిస్తాం. మెరిట్ అంటూ హింస పెడతాం. అంతేకాని పిల్లలను సాహిత్య పఠనం వైపుకానీ, రచన వైపుకానీ ప్రోత్సహించం. కేవలం బెంగాలీ, మలయాళం, కన్నడ, మరాఠీ భాషల్లో తప్ప మిగతా ఇతర భాషల్లో బాలసాహిత్యం తక్కువ.

ఇక 'బాలల సినిమాల'ది మరీ దారుణమయిన పరిస్థితి. మలయాళం, బెంగాలీ లాంటి కొన్ని భాషల్లో వేళ్ళ మీద లెక్కించే కొన్ని మంచి సినిమాలు మాత్రం తీశారు. ఇక ముంబై లోని బాలల చిత్ర సమితి (చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా) నిర్మించిన వందలాది పిల్లల సినిమాలు ప్రదర్శనకు నోచుకోకుండా ముంబైలో పడి ఉన్నాయి. ఈ సంస్థ ప్రథమ భారత ప్రధాని నెహ్రూ ఆలోచనల మేర నియమితమైన ఎస్.కె. పాటిల్ కమిటీ సూచనల ప్రకారం 1955లో ఏర్పాటయింది. చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ చురుగ్గా ఉన్నప్పుడు ముఖ్యంగా కేదార్ శర్మ, భీమ



సేన్, జయా బచ్చన్, సాయి పరంజపే, గుల్జార్ తదితరులు దానితో వున్నప్పుడు ఎన్నో గొప్ప సినిమాలు వచ్చాయి.


బాలల కోసం సినిమాలు నిర్మించడం, నిర్మాతలకు ఆర్థికంగా సహాయం చేయడం, రెండేండ్లకోసారి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు నిర్వహించడం ఈ సంస్థ ప్రధాన కర్తవ్యాలు. అందులో భాగంగానే దేశంలోని వివిధ నగరాల్లో 1979 నుంచి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్ని నిర్వహిస్తూ వస్తున్నది. 1995లో మొదటిసారిగా మన హైదరాబాద్‌లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు నిర్వహించారు. తర్వాత 1999లో మరోసారి నిర్వహించారు. అనంతరం బాలల చిత్రోత్సవాలకు ఒక శాశ్వత వేదిక ఉండాలని హైదరాబాద్‌ని ప్రతిపాదించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇతోధిక సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. చిల్డ్రన్స్ ఫిలిమ్ సొసైటీకి భూమి ఇస్తామని అన్నది. భూమి ఇచ్చినట్టే ఇచ్చారు కానీ అధీనం చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదేమీ జరగ లేదు. ఇంతలో కేసులు వగైరాలతో అది మూల బడింది. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం హైదరాబాద్‌లో టూరింగ్ ఫెస్టివల్ గానే మిగిలిపోయింది. చిల్డ్రన్ ఫిలిమ్ సొసైటీ అధికారులు రెండేండ్లకోసారి హైదారాబాద్ వచ్చి ఏదో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నిర్వహించాము అనిపించి, అది అయిపోగానే పెట్టి బేడా సర్దుకుని వెళ్ళి పోయే వాళ్లు. ఇప్పుడు అదీ లేదు.

అంతర్జాతీయ స్థాయిలో ఇరాన్, రష్యాల నుంచి వచ్చిన పిల్లల సినిమాలు అద్భుతంగానూ, భావస్ఫోరకంగానూ ఉంటాయి. అవి మొత్తం ప్రపంచాన్ని కట్టి పడేశాయి. ఇరాన్ సినిమాలకున్న నేపథ్యం మనకూ ఉన్నది. కావలసిందల్లా ఇరాన్‌లో లాగా ప్రభుత్వం తోడ్పాటును అందించాల్సి ఉన్నది. మన దర్శకులు కూడా రొడ్డకొట్టుడు నీతి బోధల సినిమాలు కాకుండా భిన్నంగా బాలల మనసుల్ని గెలుచుకునే సినిమాలు నిర్మించగలిగితే తెలంగాణ గొప్ప బాలల చిత్రాలకు వేదికయ్యే అవకాశం ఉన్నది. బాలల కోసం ప్రత్యేకంగా ఆలోచించాల్సి ఉంది. పిల్లల కోసం ఎవరయినా ఏ కొంత చేసినా ఎంతో చేసిన వాళ్ళవుతారు.

వ్యాసకర్త ప్రముఖ సినీ విశ్లేషకుడు
(నేడు బాలల దినోత్సవం)

భగవంతుడి సృష్టి

ఒక ఆశ్రమంలో గురువు శిష్యులకు ఒక కథ చెబుతున్నారు. ''అనగనగా ముగ్గురు సాధువులు ఉండేవారు. వారు పుణ్యం చేయడంతో దేవదూతలు స్వర్గానికి తీసుకుపోతున్నారు. అప్పుడు మార్గమధ్యంలో ఒక డేగ ఒక పాముని నోట కరచుకుని పోతుండటం సాధువులు చూశారు. అయితే ఆ సాధువులలో ఒకరు 'పాముని వేధించడం పాపం. కనుక దానిని విడిచి పెట్టు' అని డేగతో అన్నాడు. ఈ మాట విన్న దేవదూతలు ఆ సాధువుని వెంటనే నెట్టేశారు. దాంతో ఆ సాధువు భూలోకాన పడ్డాడు. ఇదంతా గమనించిన ఇంకొక సాధువు తనకూ అదే



జ్యోతిర్మయం

గతి పడుతుందేమోనని భావించి 'డేగా డేగా, పాములు ఈ ప్రపంచంలో బతకడం వల్ల మిగిలిన ప్రాణులకు ఎప్పటికైనా ప్రమాదమే, కనుక నువ్వు దాన్ని చంపడమే మంచిది' అన్నాడు. ఈ మాటలన్నీ విన్న దేవ దూతలు అతనిని కూడా భూలోకానికి నెట్టేశారు. అయితే మూడో సాధువు ఏమీ చెప్పకుండా జరిగినదంతా గమనిస్తూ మౌనంగా ఉండిపోయాడు. దేవ దూతలు అతనిని స్వర్గలోకానికి తీసుకుపోయారు' అని గురువుగారు కథ ముగించారు.

మొదటి ఇద్దరు సాధువులు ఎందుకు భూలోకానికీ, మూడో సాధువు స్వర్గానికీ పోవడానికి కారణమేమిటి అని ఆయన శిష్యులను ప్రశ్నించారు. గురువుగారి ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో శిష్యులకు తెలియలేదు. అందుకే గురువు గారినే విడమరిచి చెప్పమన్నారు.

'స్వర్గానికి వెళ్ళాలనుకున్నవారు భగవంతుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. భగవంతుడి సృష్టిలో ఫలానా ప్రాణి ఉండాలి అనీ, ఫలానా ప్రాణి ఉండకూడదనీ చెప్పే అర్హత సామాన్యుడైన మనిషికి లేద'ని వివరించారు గురువుగారు.

– యామిజాల జగదీశ్

విమానయానం ఫుల్ జోష్!

రాష్ట్రంలోని 6 విమానాశ్రయాల నుంచి ఆరు నెలల్లో 27.49 లక్షల మంది ప్రయాణం

- 17.22శాతం వృద్ధితో 4.04 లక్షలు పెరిగిన ప్రయాణికులు
- 30శాతం వృద్ధితో విశాఖ నుంచే 15.03 లక్షల మంది ప్రయాణం
- ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా గణాంకాల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విమానయానరంగం జోరుమీద కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల కాలంలో రాష్ట్రంలోని ఆరు విమానాశ్రయాల ద్వారా 27,49,835 మంది ప్రయాణించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఆరు నెలల కాలంతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్యలో 17.22శాతం వృద్ధి నమోదైంది. 2022–23 సంవత్సరంలో రాష్ట్రంలోని ఆరు విమానాశ్రయాల నుంచి 23,45,795 మంది ప్రయాణించగా, ఆ సంఖ్య ఈ ఏడాది 27,49,835కు చేరింది. రాష్ట్రంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా కొనసాగుతున్నాయన్న విషయాన్ని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.


విశాఖలో అత్యధిక వృద్ధి...

పరిపాలనా రాజధానిగా ప్రకటించిన విశాఖపట్నం విమానాశ్రయం అన్నిటికంటే అత్యధికంగా 30.5 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. గత ఏడాది విశాఖ నుంచి 11.50 లక్షల మంది ప్రయాణించగా, ఆ సంఖ్య ఈ ఏడాది ఏకంగా 15.03 లక్షలకు పెరిగింది. పరిపాలనా రాజధానిగా ప్రకటించినప్పటి నుంచి విశాఖకు విమాన ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, గత కొన్ని నెలలుగా నమోదవుతున్న గణాంకాలే దీనికి నిదర్శనమని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. విశాఖ తర్వాత గడిచిన ఆరు నెలల్లో విజయవాడ నుంచి 5.41 లక్షల మంది, తిరుపతి నుంచి 4.30 లక్షల మంది, రాజమండ్రి నుంచి 2.11 లక్షల మంది ప్రయాణించారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి 41,056 మంది, కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి 21,326 మంది ప్రయాణించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల విమానాలు రద్దు కావడంతో తిరుపతి, కర్నూలు విమానాశ్రయాల నుంచి ప్రయాణించేవారి సంఖ్యలో స్వల్ప తగ్గుదల నమోదైందని, రానున్నకాలంలో ఈ రెండు చోట్ల నుంచి కూడా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



‘భోగాపురం’తో డబుల్

ప్రస్తుతం నడుస్తున్న విశాఖపట్నం విమానాశ్రయం ఎయిర్‌ఫోర్స్ వారిది కావడంతో రాత్రి పూట అనేక ఆంక్షలు ఉన్నాయని, భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆంక్షలు తొలగిపోతాయని, ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో భోగాపురం విమానాశ్రయం నిర్మిస్తున్నారు. ఈ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ విమానాశ్రయం 2025 నాటికి అందుబాటులోకి రానుంది.



నేడు పైడితల్లి ఉయ్యాల కంబాల మహోత్సవం



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా మంగళవారం ఉయ్యాల కంబాల మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంతో పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ముగియనున్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. వీఐపీ, రూ.50 టికెట్లు, సాధారణ క్యూ కాంప్లెక్స్‌లను ఆలయానికి ఇరువైపులా ఏర్పాటుచేశారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటుచేశారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు ఉయ్యాలకంబాల ఉత్సవం నిర్వహించనున్నట్లు పైడితల్లి అమ్మవారి ఆలయ ఈవో కేఎల్ సుధారాణి తెలిపారు. ఉత్సవం ముగిసిన వెంటనే పైడితల్లి దీక్షాపరులు ఇరుముడి ధారణ చేస్తారని చెప్పారు. ఇరుముడి నెత్తిన పెట్టుకుని ఉత్సవ విగ్రహంతో బుధవారం ఉదయం చదురుగుడి నుంచి ఊరేగింపుగా వనంగుడి వద్దకు వెళతారని పేర్కొన్నారు. అక్కడ నిర్వహించే చండీయాగం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

క్లుప్తంగా...

హనుమంత వాహనంపై పద్మావతీ అమ్మవారు


హనుమంత వాహనంపై ఊరేగుతున్న అలమేలు మంగమ్మ

చంద్రగిరి: తిరుపతి జిల్లా శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన సోమవారం రాత్రి 8 గంటలకు అమ్మవారు హనుమంత వాహనంపై శ్రీరామ చంద్రమూర్తిగా మాడవీధుల్లో ఊరేగారు. అలాగే, ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో చర్నాకోలు, దండం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. జియ్యర్ల దివ్య ప్రబంధ పారాయణం, మంగళ వాయిద్యం, భజన బృందాల కోలాటం, సంప్రదాయ కళా బృందాల ప్రదర్శన, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. కాగా, ఆదివారం అమ్మవారు ముత్యపు పందిరి,సింహ వాహనాలను అధిష్ఠించి భక్తులను అనుగ్రహించారు.

రత్నగిరిపై జ్యోతిర్మయి సత్యదేవ వ్రతానికి అనుమతి

అన్నవరం: కాకినాడ జిల్లా రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో మరో విశిష్ట వ్రతం నిర్వహణకు మార్గం సుగమమైంది. రూ.10,116 రుసుముతో ‘జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం’ను నిర్వహించడానికి దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ అనుమతిచ్చినట్లు ఆలయ ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం తెలిపారు. రుసుము మొత్తంలో రూ.4,500 వ్రతంలో ఉపయోగించే పూజా సామగ్రికి, మిగిలిన రూ.5,616లో 40% పురోహితులకు పారితోషికంగా నిర్ణయించారు. ఈ వ్రతాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ వ్రతం నిర్వహణకు గాను రత్నగిరి రామాలయం పక్కన గల పాత అకౌంట్స్ కార్యాలయాన్ని జ్యోతిర్మయి సత్యదేవ వ్రత మండపంగా మారుస్తున్నారు. మొత్తం వ్రత మండపాన్ని ఏసీ చేయిస్తున్నట్లు ఈఓ తెలిపారు. అత్యంత మహిమాన్వితమైన ఈ వ్రతం ఆచరించేవారికి సకల కోరికలు నెరవేరతాయని దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ తెలిపారు.

నేటి నుంచి శ్రీపీఠంలో మహాశక్తి యాగం

- నెల పాటు రోజూ కుంకుమార్చన
- పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి



కాకినాడ రూరల్: కాకినాడలోని శ్రీపీఠంలో మంగళవారం నుంచి నెల పాటు మహాశక్తి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామిజీ తెలిపారు. శ్రీపీఠంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. యాగంలో మహిళలు దీక్షగా వంద కోట్ల కుంకుమార్చన చేస్తారని,. ఇందులో భాగంగా కోటి బగళాముఖి అనుస్థానం ఉంటుందన్నారు. బగళాముఖి అమ్మవారిని దేశంలో శక్తివంతమైన దేవతగా పరిగణిస్తారని చెప్పారు. కార్తీక మాసంలో అతిరుద్ర యాగాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహానక్షత్ర శాంతిగా 27 నక్షత్రాలకు మహాశాంతి ఉంటుందని తెలిపారు. 27 దేవతలకు తిథి నక్షత్రాలు పూజ ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 3,33,333 దీపాలను 30 రోజుల పాటు వెలిగించి కోటి దీపాలతో అమ్మవారికి, పరమేశ్వరుడికి హారతి ఇస్తామన్నారు. బగళాముఖి చేసేటప్పుడు అమ్మవారి అనుస్థానంలో 30 రోజుల పాటు ఆహారం స్వీకరించరాదని, ద్రవ పదార్థాలకు పరిమితమవ్వవచ్చన్నారు. దానికి తాను సిద్ధమయ్యానని చెప్పారు. కోవిడ్ తరువాత రెండేళ్లుగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నట్లు తాను గుర్తించానని చెప్పారు. మృతుల్లో 30–50 ఏళ్ల మధ్య ఉన్నవారే అధికమన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ల ప్రభావంతో 30 ఏళ్లకే నిస్సత్తువగా మారి గుండెపోటు, ఇతర వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ ప్రయత్నాలు సాధ్యపడనప్పుడు దైవ శక్తిపై ఆధారపడాలని సూచించారు. ఇలాంటి మార్గంలోనే మహర్షులు మహాశక్తి యాగాన్ని సూచించారన్నారు.

ఇది ఐదడుగుల ‘డ్రమ్‌స్టిక్కు’!



ఈ చిత్రంలో మీరు చూస్తున్నది మునక్కాయే. కడప నగరం ముత్యంజయకుంట దగ్గరలోని వేణుగోపాల్ ఇంటి ఆవరణలో ఉన్న మునగచెట్టుకు 5 అడుగుల 7 అంగుళాల మునక్కాయ కాసి చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇటీవల ఆ చెట్టుకు పశువుల ఎరువుతో పాటు రసాయనిక ఎరువులను వేయడంతో చెట్టుకు ఉన్న కాయలు ఏపుగా పెరిగినట్లు వేణుగోపాల్ చెప్పారు. – కడప అగ్రికల్చర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్
- కాకినాడ జిల్లాలో విషాదం


ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు

తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చిపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నలుగురు యువకులు బైక్‌పై యానాం నుంచి తాళ్లరేవుకు వేగంగా వస్తూ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తాళ్లరేవు రచ్చవారిపేటకు చెందిన ఓలేటి శ్రీను(26), వైదాడి రాజు(24), ఐ.పోలవరం మండలం ఎదుర్లంక జగనన్న కాలనీకి చెందిన పాలెపు ప్రసాద్(24) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రచ్చ శ్రీను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరంతా పెయింటింగ్ వర్కర్లు. ప్రమాదంలో మృతి చెందిన ఓలేటి శ్రీనుకు భార్య, కుమార్తె ఉన్నారు. మిగిలిన ముగ్గురు అవివాహితులు. కోరంగి ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో వేడుకగా దీపావళి ఆస్థానం


దీపావళి ఆస్థానంలో భూమన తదితరులు

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం దీపావళి ఆస్థానం వేడుకగా నిర్వహించారు. అర్చకులు, తిరుమల జీయంగార్లు, టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. ఆలయంలో మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించి రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేదించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనుంది. ఇందులో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, ఇంజినీరింగ్ పనుల పురోగతిపై బోర్డు సభ్యులు చర్చించి తీర్మానాలు చేయనున్నారు. డిసెంబర్ 23 నుంచి 10 రోజుల పాటు జరిగే వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు.

రాహుకేతు పూజ చేయించుకున్న రష్యా దేశస్థులు



శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని రష్యా దేశస్థులు 10 మంది సోమవారం దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. ముందుగా వారు రూ.500 టికెట్ తీసుకుని రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

23 నుంచి భవానీ మండల దీక్షలు

- డిసెంబర్ 13 నుంచి అర్ధమండల దీక్షల స్వీకరణ
- జనవరి 3 నుంచి 7 వరకు దీక్షల విరమణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ నుంచి భవానీ మండల దీక్షల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఈ నెల 27వ తేదీ వరకు భక్తులు దీక్షలు స్వీకరిస్తారు. డిసెంబర్ 13 నుంచి 17వ తేదీ వరకు భక్తులు అమ్మవారి అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. డిసెంబర్ 26వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి కలశజ్యోతి మహోత్సవాన్ని విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి దుర్గగుడి వరకు నిర్వహిస్తారు. దీక్షల విరమణ వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన ప్రారంభమవుతుంది. జనవరి 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించే పూర్ణాహుతితో దీక్షల విరమణ ముగుస్తుంది. ఇంద్రకీలాద్రిపై నిర్వహించే రెండో అతి పెద్ద ఉత్సవాలు భవానీ దీక్షలు కాగా, ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా నుంచి భక్తులు అమ్మవారి దీక్షల విరమణకు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


రేపు దుర్గమ్మకు గాజుల అలంకరణ

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ కార్తీక శుద్ధ విదియను పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన గాజుల అలంకరణతో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయాన్ని గాజులతో తీర్చిదిద్దేందుకు అవసరమైన గాజుల దండలను సేవా సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. అమ్మవారికి జరిగే గాజుల అలంకరణ నిమిత్తం నగరానికి చెందిన పలు భక్త బృందాలు, ఉభయదాతలు, భక్తులు పెద్ద ఎత్తున గాజులను విరాళాలుగా సమర్పిస్తున్నారు. అమ్మవారికి చిన్న సైజు గాజులతో వివిధ రూపాలలో అభరణాలుగా తీర్చిదిద్ది దేవస్థానానికి అందజేశారు. మహామండపం ఆరో అంతస్తులో భద్రపరిచిన గాజులను ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది దండలుగా సిద్ధం చేస్తున్నారు. ఉత్సవం అనంతరం అమ్మ వారికి, ఆలయానికి అలంకరించిన గాజులను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు.

ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి

- ఐదుగురిని రక్షించిన స్థానికులు..
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


సంతోష్‌కుమార్, దాని వినీష్, గణేష్(ఫైల్)

కంచికచర్ల: ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో సోమవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉద్యోగ, చదువు రీత్యా పలు ప్రాంతాల్లో ఉంటున్నారు. వారందరూ దీపావళి పండుగకు స్వగ్రామానికి వచ్చారు. వారిలో 11 మంది మిత్రులు సోమవారం సాయంత్రం కంచికచర్ల మండలం కీసర సమీపంలోని మున్నేటిలో సరదాగా గడిపేందుకు వెళ్లారు. మున్నేటి వద్దకు వెళ్లిన వారిలో 8 మంది ఈత కొట్టేందుకు నీటిలో దిగారు. దిగిన వారు మునుగుతుండటాన్ని గమనించిన మిత్రులు కేకలు వేయటంతో స్థానికులు వచ్చి.. ఐదుగురిని ఒడ్డుకు తీసుకురాగలిగారు. మిగిలిన ముగ్గురు యడవల్లి గణేష్(25), చేజర్ల దాని వినీష్(17), గాలి సంతోష్‌కుమార్ (22)లు ప్రాణాలు కోల్పోయారు. గణేష్ కీసర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్టు ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. దాని వినేష్ ఇంటర్, సంతోష్‌కుమార్ బీటెక్ చదువుతున్నారు. నీట మునిగి అస్వస్థతకు గురైన యడవల్లి సిద్ధూ, దండా రవికుమార్‌లను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. కాగా, మృతదేహాలను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం..

యువకులు మున్నేటిలో గల్లంతయిన సమాచారం తెలుసుకున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స సైతం ఎమ్మెల్యే నిర్వహించారు. యువకుల మృతి బాధాకరమని వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంతోష్‌కుమార్ తండ్రి రమేష్ విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. రమేష్‌కు కవల పిల్లలు కాగా వారిలో సంతోష్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి కడుపుకోత మిగిలింది. గణేష్ తండ్రి కృష్ణ ఇటీవలే మృతి చెందారు. అవినాష్ తండ్రి నరసింహారావు లారీ డ్రైవర్. ఒక్కడే సంతానం. చేతికి అందివచ్చిన కొడుకులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబ సభ్యుల వేదన అంతా ఇంతా కాదు.

ఆదర్శ్ టాలెంట్.. అదుర్స్!

రెండున్నరేళ్ల బాలుడికి కలాం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతికి చెందిన డాక్టర్ ఉమాపతి, డాక్టర్ సమతాప్రకాష్ దంపతుల రెండున్నరేళ్ల బాలుడు ఆదర్శ్.. కలాం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. చిన్నప్పటి నుంచే ఆదర్శ్ చురుగ్గా ఉండడాన్ని గమనించిన తల్లిదండ్రులు.. అనేక రకాల బొమ్మలను గుర్తించడం, ఫజిల్స్ సెట్ చేయడం, జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలు, వాహనాలు, శరీర భాగాలు, మానవ సంబంధాలు, రంగులు, ఆకృతులతో పాటు ఆంగ్ల అక్షరాలు నేర్పించారు. ఈ విషయాన్ని వారు కలాం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ దృష్టికి తీసుకెళ్లగా.. చిన్నారి ప్రతిభ, తెలివితేటలను పరిశీలించి ఈ మేరకు కలాం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు, పతకం, సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆ అవార్డు, సర్టిఫికెట్ ఈ నెల 11వ తేదీన వారికి అందాయి.

అంగన్‌వాడీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు


55,607 కేంద్రాలకు అందించిన రాష్ట్ర ప్రభుత్వం

- కిట్‌లో గతం కంటే ఎక్కువ రకాల మందులు
- స్వల్ప అనారోగ్యం, చిన్న చిన్న గాయాలకు తక్షణ వైద్యం
- ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పర్యవేక్షణ బాధ్యత

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణ వైద్య సేవలు అందించేలా మరో ముందడుగు వేసింది. చిన్నారులకు స్వల్ప అనారోగ్యం, చిన్న చిన్న గాయాలకు తక్షణ వైద్య సేవలు అందించేలా ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను అందించింది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అంగన్‌వాడీలకు చేరువ చేసి వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం ప్రాథమిక వైద్య సేవలు అందించేలా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి మరోమారు ఒక్కొక్కటి చొప్పున ఫస్ట్ ఎయిడ్ కిట్(ప్రాథమిక చికిత్స మందులు)ను సరఫరా చేసింది. గతంలో పంపిణీ చేసిన కిట్‌లలో కంటే ఎక్కువ మందులను ఈ కిట్‌లలో పొందుపర్చి అందించడం విశేషం. ఆటలాడేటప్పుడు తగిలే చిన్న చిన్న గాయాలు, కొద్దిపాటి జలుబు, ఇతర చిన్నపాటి అనారోగ్య సమస్యలకు ప్రథమ చికిత్స అందించేందుకు ఈ కిట్లలోని పది రకాలకుపైగా ఔషధాలు దోహదపడతాయి.

కిట్‌లో పొందుపర్చిన మందుల్లో కొన్ని..

అంగన్‌వాడీ మెడికల్ కిట్‌లో పారాసిటమాల్ సిరప్, ఐరన్ ట్యాబ్లెట్లు, అయోడిన్, సిల్వర్ సల్ఫాడైజీన్, క్లోరోఫినరామిన్ మాలియాట్, ఫురాజోలిడిన్, హ్యాండ్ శానిటైజర్, రోలర్ బ్యాండేజ్, నియోమైసిన్ ఆయింట్మెంట్, కాటన్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, బెంజయిల్ బెంజోయేట్‌తోపాటు మరికొన్ని సిరప్‌లు ఉన్నాయి. వీటిలో ఏయే మందులను ఎలా ఉపయోగించాలి అనేది సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరుతో సమాచారాన్ని కూడా పంపించారు. వీటి వినియోగంపై అవగాహన కల్పించారు. సద్వినియోగం అయ్యేలా అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు చేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని సచివాలయ ఆరోగ్య కార్యదర్శి, స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి పర్యవేక్షించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీల్లోని చిన్నారుల పెరుగుదల(ఎత్తు), బరువుపై పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందించాలి.



మందుల వినియోగం ఇలా..

జ్వరం: పారాసిటమాల్ సిరప్‌ను రెండు నెలలలోపు పిల్లలకు 1 మిల్లీలీటర్ చొప్పున రోజుకు రెండు సార్లు, ఏడాది లోపు పిల్లలకు ఐదు మిల్లీ లీటర్ల చొప్పున ఇవ్వాలి.

తెగిన, కాలిన, గీరుకొనే గాయాలు : ప్రమిసెటిన్ స్కిన్ క్రీమ్ ఆయింట్మెంట్‌ను గాయమైన చోట నీటితో శుభ్రంగా కడిగి రాయాలి. అవసరమైతే దూది(కాటన్) పెట్టి కట్టు కట్టాలి.

కళ్లు ఎర్రబడుట, చెవిపోటు : సిప్రోఫ్లాక్సాసిస్ చుక్కల మందును రెండు చుక్కలు చొప్పున రోజుకు రెండు నుంచి మూడు సార్లు వాడాలి.

డీహైడ్రేషన్ అవ్వకుండా : ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ రెండు సంవత్సరాలలోపు పిల్లలకు 50 నుంచి 100 మిల్లీ లీటర్లు, రెండు నుంచి పదేళ్లలోపు పిల్లలకు 100 నుంచి 200 మిల్లీ లీటర్లు చొప్పున ఇవ్వాలి.

గతం కంటే ఎక్కువ మందులు



రాష్ట్రంలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.485.37 విలువైన ఒక్కో కిట్‌ను తాజాగా ప్రభుత్వం అందించింది. గత ఏడాది కంటే ఎక్కువ మందులతో ఇచ్చిన ఈ కిట్‌లు ప్రాథమిక చికిత్సకు బాగా ఉపయోగపడతాయి. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.2,69,89,770లతో ప్రభుత్వం అందించింది. పిల్లల్లో వచ్చే సాధారణ వ్యాధులు, ప్రమాద గాయాలకు తక్షణ చికిత్సకు ఉపయోగపడేలా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకంలో వీటిని అందించారు.

–ఎం.జానకి, కమిషనర్, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ

అంగన్‌వాడీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. వాటికి సొంత భవనాలతోపాటు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆటపాటలతో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. మహిళా, శిశు సంక్షేమానికి ఇతోధికంగా నిధులు ఇవ్వడం ద్వారా కొత్త విధానాలతో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మేలు కలిగేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.

–కేవీ ఉషశ్రీ చరణ్, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి

15న అరకులో గవర్నర్ పర్యటన

అరకులోయటౌన్ (అల్లూరి సీతారామరాజు): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఈ నెల 15వ తేదీన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటించనున్నారు. ఈ మేరకు అరకు క్రీడా పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్ మైదానంలో ఏర్పాట్లను సోమవారం పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పరిశీలించారు. పీవో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జార్ఖండ్‌లో జనజాతీయ సేవ దివస్, వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని అరకులో గవర్నర్ ప్రారంభిస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు మూడు వాహనాలు జిల్లాలో ప్రచారం నిర్వహిస్తాయని, వాటిని అరకులోయలో గవర్నర్ జెండా ఊపి ప్రారంభిస్తారని వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, డీడీ ఐ.కొండలరావు, ఏఈఈ అభిషేక్, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింహాద్రిలో నెలన్నర పాటు విద్యుదుత్పత్తి నిలిపివేత

పరవాడ (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో మొదటి యూనిట్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి విద్యుదుత్పత్తిని అధికారులు నిలిపివేశారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో 45 రోజుల పాటు చేపట్టనున్న వార్షిక మరమ్మతుల నేపథ్యంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు. 2, 3, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయి.

కాగజ్‌నగర్‌లో ఉద్రిక్తత

కాగజ్‌నగర్ టౌన్: ఎన్నికల వేళ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఎస్పీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పట్టణంలోని విజయబస్తీ ఏరియాలో ఆదివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆ ఏరియాకు బీఆర్ఎస్ ప్రచార వాహనం రావడంతో సౌండ్ తగ్గించాలని బీఎస్పీ అభ్యర్థి, కార్యకర్తలు ప్రచార రథం డ్రైవర్ అలీంను కోరారు. ఈ క్రమంలోనే వాగ్వాదం చోటుచేసుకుని ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకున్నారు. గొడవకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేయాలని ప్రవీణ్‌కుమార్‌తోపాటు కార్యకర్తలు నాలుగు గంటలపాటు పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పతో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి లారీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ ప్రచార రథంపై దాడిచేసినట్లు డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బుద్దే స్వామి తెలిపారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కె.సురేశ్‌కుమార్‌ను తక్షణమే ఎన్నికల విధుల నుంచి తొలగించాలని ప్రవీణ్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. బీఎస్పీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం వెనుక కేసీఆర్, కేటీఆర్‌ల హస్తం ఉందని ఆయన ఆరోపించారు.

బ్రిటన్ మంత్రివర్గంలో కుదుపు

హోం మంత్రి బ్రేవర్మన్‌పై వేటు ప్రధాని రిషి సునాక్ నిర్ణయం విదేశాంగ మంత్రిగా కామెరాన్

- మాజీ ప్రధానికి కీలక బాధ్యతలు
- విదేశాంగం నుంచి హోంకు క్లెవర్లీ
- తప్పుకున్న మరో ఏడుగురు మంత్రులు

లండన్: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సోమవారం తన మంత్రివర్గంలో ఆకస్మిక మార్పుచేర్పులు చేశారు. కొంతకాలంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న భారత మూలాలున్న హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్‌ను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముందుగా నిర్ణయం తీసుకున్నారు. ఆ వెంటనే మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్‌ను విదేశాంగ మంత్రిగా నియమిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పటిదాకా విదేశాంగ మంత్రిగా ఉన్న జేమ్స్ క్లెవర్లీని బ్రేవర్మన్ స్థానంలో హోం మంత్రిగా నియమించారు. ప్రధాని సిఫార్సుల మేరకు వారిద్దరి నియామకాలకు రాజు చార్లెస్ ఆమోదముద్ర వేసినట్టు డౌనింగ్ స్ట్రీట్ ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు హౌజింగ్ మంత్రి రేచల్ మెక్లీన్‌ను కూడా సునాక్ పదవి నుంచి తప్పించారు.ఈ నేపథ్యంలో మరో ఆరుగురు జూనియర్ మంత్రులు కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు! థెరెసా కోఫీ, నిక్ గిబ్, నీల్ ఓబ్రియాన్, విల్ క్విన్స్, జెస్సీ నార్మన్ ఈ జాబితాలో ఉన్నారు.



డేవిడ్ కామెరాన్

కామెరాన్... అనూహ్య ఎంపిక

57 ఏళ్ల కామెరాన్‌కు రిషి విదేశాంగ బాధ్యతలు అప్పగించడం అనూహ్యమేనని చెప్పాలి. ఒక మాజీ ప్రధానిని ఇలా మంత్రివర్గంలోకి తీసుకోవడం బ్రిటన్‌లో చాలా అరుదు. పైగా ప్రధానిగా రాజీనామా చేశాక కామెరాన్ ఏడేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అంతేగాక ప్రస్తుతం ఎంపీ కూడా కాదు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోకి తీసుకున్నారు. బ్రిటన్లో ఇలా విదేశాంగ మంత్రి ఎగువ సభ్య సభ్యుడిగా ఉండటం 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1980ల్లో లార్డ్స్ సభ్యుడైన పీటర్ కారింగ్టన్ మార్గరెట్ థాచర్ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పని చేశారు. కష్టకాలంలో ప్రధానిగా రిషి పనితీరు గొప్పగా ఉందంటూ కామెరాన్ ఈ సందర్భంగా మెచ్చుకున్నారు. ''కొన్ని వ్యక్తిగత నిర్ణయాల విషయంలో రిషితో నేను గతంలో విభేదించ ఉండొచ్చు. కానీ ఆయన అత్యంత సమర్థుడైన ప్రధాని'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశ భద్రత, ప్రగతి తదితర కీలకాంశాల్లో ఆశించిన ఫలితాల సాధనలో రిషికి శక్తివంచన లేకుండా తోడ్పడతా. ఏడేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు కాస్త దూరంగా ఉన్నా కీలక సవాళ్లను దీటుగా ఎదుర్కోవడంలో రిషికి దన్నుగా నిలిచేందుకు నా రాజకీయ అనుభవమంతటినీ రంగరిస్తా'' అని చెప్పారు. 2010 నుంచి 2016 దాకా ఆరేళ్లపాటు ఆయన బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. బ్రిటన్ యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో కొనసాగాలని గట్టిగా వాదించారు. ఈ విషయమై 2016లో మూడు రెఫరెండాలు తెచ్చారు. కానీ ప్రజలు ఈయూ నుంచి వైదొలగేందుకు (బ్రెగ్జిట్)కే ఓటేయడంతో రాజీనామా చేశారు. సునాక్ కూడా బ్రెగ్జిట్‌కే మద్దతిచ్చారు. పైగా ఆ సమయంలో కామెరాన్ మంత్రివర్గంలో సునాక్ జూనియర్ మంత్రి కూడా కావడం విశేషం! విదేశాంగ మంత్రి జై శంకర్ ఐదు రోజుల పర్యటన నిమిత్తం ప్రస్తుతం ఇంగ్లండ్‌లో ఉన్నారు. ఆదివారం సునాక్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు కూడా. పర్యటనలో భాగంగా క్లెవర్లీతో జై శంకర్ సమావేశాలు జరపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా విదేశాంగ బాధ్యతలు స్వీకరించిన కామెరాన్‌తో జై శంకర్ చర్చలు ఎలా జరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

బ్రేవర్మన్.. రెండోసారి ఉద్వాసన

ఇక రిషి మంత్రివర్గంలో సీనియర్ సభ్యురాలైన 43 ఏళ్ల బ్రేవర్మన్ హోం శాఖ మంత్రిగా తప్పుకోవాల్సి రావడం ఇది రెండోసారి! ఈసారి ఆమెపై వేటు ఒక విధంగా ఊహిస్తున్నదే. గోవా మూలాలున్న ఆమె రెచ్చగొట్టే మాటలు, వివాదాస్పద వ్యాఖ్యలతో పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. ఇటీవల లండన్‌లో జరిగిన పాలస్తీనా మద్దతుదారుల ర్యాలీని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శిస్తూ ద టైమ్స్ పత్రికలో బ్రేవర్మన్ రాసిన వ్యాసంపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తాయి. హోం మంత్రిగా ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదంటూ విపక్షాలతో పాటు అధికార కన్సర్వేటివ్ పార్టీ సీనియర్ నాయకులు కూడా మండిపడ్డారు. వ్యాసంలోని సదరు విమర్శలను తొలగించాలని ప్రధాని కార్యాలయం ఆదేశించినా ఆమె బేఖాతరు చేసినట్టు తేలింది. ఈ నేపథ్యంలో బ్రేవర్మన్‌ను తప్పించడం ఖాయమని అంతా భావించారు. అంతకు ముందు లిజ్ ట్రస్ మంత్రివర్గం నుంచి కూడా ఆమె రాజీనామా చేయడం విశేషం. అప్పుడు కూడా మంత్రిగా పలుసార్లు వివాదాస్పద వ్యాఖ్యాలు చేశారు. పలు కీలకాంశాలపై ట్రస్ సర్కారు అయోమయంలో ఉందని ఆమె బాహాటంగా విమర్శించడం సంచలనం సృష్టించింది. వలసదారులపై ఆమె వ్యాఖ్యలూ దుమారమే రేపాయి. తర్వాత వలసలకు సంబంధించి అధికార పత్రాలను నిబంధనలకు విరుద్ధంగా సహచర పార్టీ ఎంపీకి చూపించిన అంశంలో రాజీనామా చేయాల్సి వచ్చింది. ట్రస్ స్థానంలో రిషి ప్రధాని అయ్యాక బ్రేవర్మన్‌ను అనూహ్యంగా మంత్రివర్గంలోకి తీసుకోవడమే గాక మళ్లీ కీలకమైన హోం శాఖ బాధ్యతలే అప్పగించారు. దీనిపై అప్పట్లోనే ఆశ్చర్యం వ్యక్తమైంది. తాజా వేటు నేపథ్యంలో సునాక్‌కు ఆమె కంట్లో నలుసుగా మారడం ఖాయమంటున్నారు. కన్సర్వేటివ్ పార్టీలోని తన మద్దతుదారుల దన్నుతో ప్రభుత్వానికి సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజీనామా అనంతరం విడుదల చేసిన సంక్షిప్త ప్రకటనలో ఆమె చేసిన వ్యాఖ్యలు కూడా దీన్ని బలపరిచేలానే ఉన్నాయి. ''ఇంతకాలం హోం మంత్రిగా పని చేయడం నాకు గొప్ప గౌరవం. సమయం వచ్చినప్పుడు చాలా సంగతులు చెప్తా'' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు!



సుయెల్లా బ్రేవర్మన్, జేమ్స్ క్లెవర్లీ

వివాదాస్పద వ్యాఖ్యలు

- బ్రిటన్లో వీసా కాల పరిమితి ముగిసినా దేశం వీడని వారిలో అత్యధికులు భారతీయులేనన్న బ్రేవర్మన్ వ్యాఖ్యలు దుమారం రేపాయి.
- భారత్‌తో ఓపెన్ మైగ్రేషన్ విధానాన్నీ ఆమె తప్పు బట్టారు.
- మరో సందర్భంలో బ్రిటన్లోని అక్రమ వలసదారులను ఆఫ్రికాలోని రువాండాకు తరలిస్తానన్నారు.
- బ్రిటన్లో ఎక్కడ పడితే అక్కడ వీధుల్లోనే నివసిస్తున్న వారు చాలావరకు అక్రమ వలసదారులేనన్నారు.
- శరణార్థుల తాకిడిని వలసదారుల దండయాత్రగా అభివర్ణించారు.
- అతి వేగంగా కారు నడిపిన కేసులో జరిమానా, ఫైన్ పడ్డ విషయాన్ని దాచేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఎదుర్కొన్నారు.

ఢిల్లీపై దీపావళి ఎఫెక్ట్..!

- దేశ రాజధానిలో పెరిగిన కాలుష్యం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని నగర ప్రాంతంలో వర్షాలతో కాస్తంత తగ్గుముఖం పట్టిన వాయు కాలుష్యం..దీపావళి పండుగతో మళ్లీ విజృంభించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం పక్కన పెట్టి మరీ ఢిల్లీ ప్రజలు టపాసులు కాల్చడంతో సోమవారం తెల్లవారుజాముకు వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ)500 పాయింట్లకు చేరుకుంది. టపాసుల పొగకు మంచు తోడవ్వడంతో ఢిల్లీలోని రోడ్లన్నీ కాలుష్యంతో చీకట్లు కమ్ముకున్నాయి. ఎదురుగా వస్తున్న సైతం వాహనాలు కనిపించని స్థాయికి వాయు కాలుష్యం చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హరియాణా, రాజస్థాన్, యూపీ, పంజాబ్ రాష్ట్రాల్లో పంట వ్యర్థాల కాల్చివేతల కారణంగా ఢిల్లీ నగరం కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది. పంట వ్యర్థాల దహనాన్ని ఆపేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఢిల్లీలో ఎటువంటి బాణసంచా కాల్చొద్దంటూ సూచనలు చేసింది. అయితే, ప్రజలు ఈ సూచనలను లెక్కచేయకుండా దీపావళి రోజు బాణసంచాను యథా ప్రకారంగా కాల్చేశారు. ఫలితంగా నగరంలోని చాలా చోట్ల వాయు నాణ్యత (ఏక్యూఐ) 500పైగా నమోదయింది. అక్కడక్కడా 900 వరకూ చేరడం గమనార్హం. సోమవారం ఉదయం 6 గంటలకు అత్యధికంగా లజ్‌పత్ నగర్‌లో 959, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతంలో 910, కరోల్ బాగ్ ప్రాంతంలో 779 వరకు నమోదైంది.

వాహనదారులపై 1, 93, 585 చలాన్ల జారీ

రాజధానిలో వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ఈనెల 7న ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతిరోజూ 3వేలకు పైగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 385 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నగర వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నట్లు వివరించింది. అక్టోబర్ 31వ తేదీ వరకు కాలుష్య ఉల్లంఘనలపై 1, 93, 585 చలాన్లు జారీ చేయగా..10 నుంచి 15ఏళ్ల నాటి 32 డీజిల్, పెట్రోల్ వాహనాలతోపాటు 15 ఏళ్ల కంటే పాతవైన మరో 14, 885 వాహనాలను సైతం సీజ్ చేసినట్లు న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో తాజాగా ఢిల్లీ ప్రభుత్వం పేర్కొంది.

క్లుప్తంగా...

ఖైదీల నుంచి కోట్లలో వసూళ్లకు పాల్పడ్డారు

ఢిల్లీ మాజీ మంత్రి జైన్‌పై సీబీఐ ఆరోపణలు

న్యూఢిల్లీ: జైలులో విలాసవంతమైన జీవితం గడిపేందుకు సుకేశ్ చంద్ర శేఖర్ వంటి హై ప్రొఫైల్ ఖైదీల నుంచి ఢిల్లీ జైళ్ల శాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్, ఆ శాఖ మాజీ డీజీ సందీప్ గోయెల్ కోట్లలో వసూళ్లకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపించింది. ఈ మేరకు వారిపై కేసు నమోదుకు అనుమతివ్వాల్సిందిగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాను కోరింది. సత్యేందర్ జైన్‌తోపాటు జైలు అధికారి రాజ్‌కుమార్‌లపై కేసు నమోదు కోసం లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాకు, సస్పెండైన ఐపీఎస్ అధికారి గోయెల్, రిటైర్డు ఐఏఎస్ ముకేశ్ ప్రసాద్‌లపై చర్యలకు కేంద్ర హోం శాఖకు వినతి పంపినట్లు సీబీఐ వివరించింది. వసూళ్లకు పాల్పడిన ఆరోపణలతో గత ఏడాది గోయెల్‌ను కేంద్ర హోం శాఖ సస్పెండ్ చేసింది. జైలులో విలాసవంతమైన జీవితం గడిపేందుకు మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్ 2018–21 సంవత్సరాల మధ్య సుమారు రూ.12.50 కోట్లను వేర్వేరు మార్గాల్లో వీరికి ముట్టజెప్పినట్లు తమకు సమాచారం ఉందని సీబీఐ అంటోంది.

మొయిత్రాకు తృణమూల్‌లో కొత్త బాధ్యత

కోల్‌కతా: డబ్బులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాకు పార్టీ కొత్త బాధ్యతలు అప్పగించింది. దీంతో 'నగదుకు ప్రశ్నలు' ఆరోపణలు ఎదుర్కొంటున్నా సరే తమ నేతకు అండగా ఉన్నామని టీఎంసీ పరోక్షంగా చెప్పినట్లయింది. మొయిత్రా ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గమైన కృష్ణానగర్ పరిధిలోని కృష్ణానగర్(నదియా నార్త్) జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా ఆమెను టీఎంసీ నియమించింది. ఈ మేరకు సోమవారం పార్టీ ఒక ప్రకటన చేసింది. డబ్బులు తీసుకొని ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలపై ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని వినోద్ సోంకార్ నేతృత్వంలోని లోక్‌సభ నైతిక విలువల కమిటీ.. స్పీకర్ బిర్లాకు సిఫార్సు చేయడం తెల్సిందే. తనకు కొత్త బాధ్యతలు అప్పగించడంపై మొయిత్రా తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో స్పందించారు. జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన పార్టీ చీఫ్ మమతా బెనర్జీకి కృతజ్ఞతలు తెలిపారు.

స్ఫూర్తిదాయక పని కోసం సెలవు

నైరోబీ: కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం కోసం జాతీయ సెలవు దినాన్ని ప్రకటించి కెన్యా తన సామాజిక స్పృహను చాటుకుంది. దేశంలోని వారంతా మొక్కలు నాటే కార్యక్రమంలో విధిగా పాల్గొనేందుకు వీలుగా నవంబర్ 13(సోమవారం) రోజున దేశవ్యాప్త సెలవు ప్రకటిస్తున్నట్లు ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే పది సంవత్సరాల్లో 1,500 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణ మార్పులు, అడవుల నరికివేత, వాయు కాలుష్యం సమస్యలతో సతమతమవుతున్న కెన్యాను కాపాడేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ప్రస్తుతం దేశ విస్తీర్ణంలో కేవలం ఏడు శాతంగా ఉన్న అడవులను 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. సోమవారం నాటి కార్యక్రమం కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా 15 కోట్లకుపైగా మొక్కలను ప్రభుత్వ నర్సరీల్లో పౌరుల కోసం అందుబాటులో ఉంచింది. వీటిని ప్రభుత్వ ఏజెన్సీ నిర్దేశించిన చోట్ల నాటాలి. ఇవిగాక 'ప్రతి కెన్యా పౌరుడు కనీసం రెండు మొక్కలు కొని నాటండి' అని పర్యావరణ మంత్రి సోపాన్ తుయా పిలుపునిచ్చారు.

యూఎస్ అధ్యక్ష రేసు నుంచి వైదొలిగిన టిమ్ స్కాట్

కొలంబియా(యూఎస్ఏ): 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, సౌత్ కరోలినా సెనేటర్ టిమ్ స్కాట్ ప్రకటించారు. మరో రెండు నెలల్లో అయోవాలో ఓటింగ్ ప్రారంభం కానున్న వేళ ఆదివారం అర్ధరాత్రి టిమ్ స్కాట్ చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్య పరిచింది. ఉపాధ్యక్ష పదవికి సిద్ధమేనా అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని ఆయన కొట్టిపారేశారు. రిపబ్లికన్ సెనేటర్లలో ఏకైక నల్లజాతీయుడైన స్కాట్ అందరి కంటే ముందుగా మేలోనే అధ్యక్ష పదవికి పోటీ పడనున్నట్లు తెలిపారు.

కాల్పుల్లో టీఎంసీ నేత మృతి.. మూక దాడిలో నిందితుడు హతం

జోయ్‌నగర్: పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా జోయ్‌నగర్‌లో సోమవారం టీఎంసీకి చెందిన స్థానిక నేత ఒకరు దుండగుల కాల్పుల్లో చనిపోయారు. నిందితుడిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి మూకదాడిలో ప్రాణాలు కోల్పోయాడు. బమున్‌గాచి ఏరియా టీఎంసీ అధ్యక్షుడు సైపుద్దీన్ లస్కర్(47) సోమవారం ఉదయం ప్రార్థనలకు బయటకు వచ్చారు. మాటువేసిన దుండగులు దగ్గర్నుంచి జరిపిన తుపాకీ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఘటనతో కోపోద్రిక్తులైన ఆయన మద్దతుదారులు నిందితులుగా భావిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. రెండో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లస్కర్ మద్దతుదారులు పొరుగునే ఉన్న దలువాఖలి గ్రామంలో లూటీకి పాల్పడ్డారు. ఈ ఘటనల నేపథ్యంలో ఆ ప్రాంతంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. లస్కర్ హత్యతో తమకెలాంటి సంబంధం లేదని సీపీఎం పేర్కొంది. అధికార యంత్రాంగం, పోలీసులు టీఎంసీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించింది.



కుప్పకూలిన 'ఉత్తర కాశీ' సొరంగం

ఉత్తరకాశీ(ఉత్తరాఖండ్): ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నిర్మాణంలోని ఒక సొరంగం ఒక్కసారిగా కుప్పకూలింది. సిల్‌క్యారాలోని ఈ సొరంగంలో కొంత భాగం కూలడంతో అందులో పనిచేస్తున్న దాదాపు 40 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. విషయం తెల్సుకున్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర విభాగాలు వారిని రక్షించేందుకు రంగంలోకి దిగాయి. రాష్ట్ర పోలీసులు, జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక దళం, 108 ఎమర్జెన్సీ, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల కార్పొరేషన్(ఎన్‌హెచ్ఐడీసీఎల్), ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)కి చెందిన 160కిపైగా సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఈ సహాయక చర్యల్లో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరకాశీలోని యమునోత్రి జాతీయ రహదారి కింద ఈ సొరంగం తవ్వుతున్నారు. సిల్‌క్యారాలో నాలుగున్నర కిలోమీటర్ల పొడవున ఈ సొరంగం నిర్మిస్తున్నారు. ఇందులో 150 మీటర్ల భాగం కూలినట్లు వెల్లడైంది. పైప్‌లైన్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. కార్మికులంతా సురక్షితమేనని చెప్పారు. వారు బయటపడే మార్గం ఏర్పరిచేందుకు డ్రెడ్జింగ్, డ్రిల్లింగ్ చేస్తున్నారు.

ఆర్థిక నేరగాళ్లకు బేడీలు వేయొద్దు

పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి బేడీలు వేయరాదని, హత్య, అత్యాచారం వంటి నేరాలకు పాల్పడిన వారితో కలిపి జైలులో ఉంచరాదని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. బేడీలు తీవ్రమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులు తప్పించుకోకుండా నిరోధించడానికి, అరెస్ట్ సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది భద్రత కోసమే పరిమితమని వివరించింది. అలాగే, నిందితులను అరెస్టయిన తర్వాత 15 రోజులకు మించి పోలీస్ కస్టడీలో ఉంచరాదన్న భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్)లో నిబంధనపై సవరణలను సూచించింది.

ఆ విరాళాల వివరాలు మాకివ్వండి: ఈసీ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందిన విరాళాల వివరాలను నవంబర్ 15 సాయంత్రంలోగా అందించాలని పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆదేశించింది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు అందిన విరాళాల వివరాలను సీల్డ్ కవర్‌లో నివేదించాలని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ఈనెల రెండో తేదీన ఆదేశించిన నేపథ్యంలో ఈసీ పై విధంగా స్పందించింది. '' ఒక్కో ఎలక్టోరల్ బాండ్ విలువ ఎంత? ఆ బాండ్ విలువలో ఎంత మొత్తాన్ని మీ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు? మొత్తం ఎన్ని బాండ్లు మీకు వచ్చాయి? మొత్తం బాండ్ల ద్వారా స్వీకరించిన విరాళాలు..' ఇలా ప్రతీదీ సవివరంగా పేర్కొంటూ జాబితాను డబుల్ సీల్డ్ కవర్‌లో సమర్పించండి'' అంటూ ఆయా పార్టీల చీఫ్‌లకు ఈసీ లేఖలు పంపింది.



దీపావళి సందర్భంగా ఆదివారం లండన్‌లో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ దంపతులతో విదేశాంగ మంత్రి జై శంకర్, ఆయన భార్య క్యోకో

అదే గాజా.. అదే దీన గాథ!

గాజా ఆస్పత్రుల్లో మరణమృదంగం

డెయిర్ అల్ బలాహ్/ఖాన్ యూనిస్ (గాజా): అదే కల్లోలం. అవే దారుణ దృశ్యాలు. అందరి కంటా నిస్సహాయంగా నీటి ధారలు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల ధాటికి గాజాలో మానవీయ సంక్షోభం తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా ఆస్పత్రుల్లో ఎటు చూసినా మరణమృదంగం ప్రతిధ్వనిస్తోంది. గాజాలోని దాదాపు అన్ని ఆస్పత్రులనూ ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టి రోజుల తరబడి దిగ్బంధించడం తెలిసిందే. దాంతో కరెంటుతో పాటు కనీస సౌకర్యాలన్నీ దూరమై అవి నరకం చవిచూస్తున్నాయి. ఐసీయూలు, ఇంక్యుబేటర్లకు కూడా కరెంటు, ఆక్సిజన్ రోజులు దాటింది. వాటిల్లోని రోగులు, నవజాత శిశువులు నిస్సహాయంగా మృత్యువు కోసం ఎదురు చూస్తున్నారు! ఇప్పటిదాకా అరచేతులు అడ్డుపెట్టి అతి కష్టమ్మీద వారి ప్రాణాలు నిలుపుతూ వచ్చిన వైద్యులు కూడా క్రమంగా చేతులెత్తేస్తున్నారు. గాజాలో అతి పెద్దదైన అల్ షిఫాతో పాటు అన్ని ఆస్పత్రుల్లోనూ ఇదే దుస్థితి! షిఫా ఇంకెంతమాత్రమూ ఆస్పత్రిగా మిగల్లేదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనోం గేబ్రెయేసస్ వాపోయారు. ''ఈ దారుణంపై ప్రపంచం మౌనం వీడాల్సిన సమయమిది. కాల్పుల విరమణ తక్షణావసరం'' అని పిలుపునిచ్చారు.

చిన్నారులను కాపాడేందుకు...

ఇంతటి విపత్కర పరిస్థితుల్లోనూ నవజాత శిశువులను కాపాడుకునేందుకు అల్ షిఫా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శాయశక్తులా ప్రయత్నిస్తున్న తీరు కంటతడి పెట్టిస్తున్నాయి. ఆక్సిజన్ సరఫరా తదితరాలన్నీ నిలిచిపోవడంతో చిన్నారులను ఇంక్యుబేటర్ల నుంచి తీసుకెళ్లి సిల్వర్ ఫాయిల్ తదితరాల్లో చుట్టబెట్టిన మంచాలపై ఒక్కచోటే పడుకోబెడుతున్నారు. పక్కన వేడినీటిని ఉంచి శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు.



గాజాలోని షిఫా ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పరిస్థితి ఇది. నెలలు నిండకుండానే జన్మించిన శిశువులను ఇంక్యుబేటర్‌కు బదులు ఇలా సిల్వర్ ఫాయిల్‌ను చుట్టబెట్టిన బెడ్‌లో ఉంచి కాపాడుతున్నారు.

ఇంధన రగడ

ఇంక్యుబేటర్లను నడిపి చిన్నారులను కాపాడేందుకు అల్ షిఫా ఆస్పత్రికి 300 లీటర్ల ఇంధనం అందజేస్తే హమాస్ ఉగ్రవాదులు అడ్డుకున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపించింది. కానీ అరగంటకు కూడా చాలని ఆ సాయంతో ఏం ప్రయోజనమని పాలస్తీనా ఆరోగ్య శాఖ మండిపడింది. ఇది క్రూర పరిహాసమంటూ దుయ్యబట్టింది.

అల్ రంటిసి, అల్ నస్ర్

ఉత్తర గాజాలోని ఈ ఆస్పత్రుల నుంచి రోగులు తదితరులను హుటాహుటిన ఖాళీ చేయిస్తున్నారు. శుక్రవారానికే కొద్దిమంది రోగులు, వైద్య సిబ్బంది మినహా ఇవి దాదాపుగా ఖాళీ అయిపోయాయి. అయితే వాటిలో సాధారణ పౌరులు వందలాదిగా తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్ సైన్యం వీటిని పూర్తిగా తమ అదుపులోకి తీసుకుని వారందరినీ అక్కడినుంచి పంపించేస్తోంది.

అల్ స్వెయిదీ

లోపల కొద్ది మంది రోగులు, వైద్య సిబ్బంది ఉన్నారు. 500 మందికి పైగా శరణార్థులు తలదాచుకుంటున్నారు. శనివారం నాటి రాకెట్ దాడి ఆస్పత్రిని దాదాపుగా నేలమట్టం చేసింది. ఆదివారం రాత్రికల్లా ఇజ్రాయెల్ సైనికులు ఆస్పత్రిలోకి ప్రవేశించారు. ఇంకా మిగిలిన ఉన్న వారందరినీ ఖాళీ చేయించి బుల్డోజర్లతో ఆస్పత్రిని నేలమట్టం చేయించారు.

అల్ షిఫా

700 పడకలతో గాజాలోనే అతి పెద్ద ఆస్పత్రి. కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ సైన్యం పూర్తిస్థాయిలో చుట్టుముట్టింది. దాంతో వైద్య సేవలన్నీ నిలిచిపోయాయి. కరెంటు లేదు. ఇంధనం, ఆహార సరఫరాలు తదితరాలన్నీ నిండుకున్నాయి. ఇక్కడ తలదాచుకున్న శరణార్థుల్లో అత్యధికులు పారిపోయారు. ఇంకో 2,500 మందికి పైగా ఆస్పత్రిలో ఉన్నట్టు సమాచారం. కానీ 20 వేలకు పైగా అక్కడ చిక్కుబడ్డట్టు పాలస్తీనా ఆరోగ్య శాఖ చెబుతోంది. 600 మందికి పైగా రోగులు, 500 మంది దాకా వైద్యులు, సిబ్బంది ఉన్నారు. వందలాది శవాలు ఆస్పత్రి ప్రాంగణంలో పడున్నట్టు చెబుతున్నారు! అది, సోమవారాల్లోనే 35 మంది రోగులు, ఐదుగురు చిన్నారులు చనిపోయినట్టు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 36 మంది చిన్నారులు ఏ క్షణమైనా తుది శ్వాస విడిచేలా ఉన్నట్టు వైద్య వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది.

అల్ ఖుద్స్

గాజాలో రెండో అతి పెద్ద ఆస్పత్రి. 500 మందికి పైగా రోగులు, 15 వేలకు పైగా శరణార్థులున్నారు. వీరిలో అత్యధికులు మహిళలే. ఆదివారానికే ఆస్పత్రిలో సేవలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. ఆహార నిల్వలన్నీ నిండుకున్నాయి. పరిసరాల్లోనే గాక ఆస్పత్రిపైకి కూడా భారీగా కాల్పులు జరుగుతున్నాయి. దాంతో ఇక్కడి ఐసీయూ వార్డు రోగులు ఒకట్రెండు రోజుల్లో నిస్సహాయంగా మృత్యువాత పడేలా ఉన్నారు! 6,000 మందికి పైగా శరణార్థులను ఇక్కణ్నుంచి దక్షిణాదికి పంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అల్ అక్సా

ఇక్కడ కూడా వందల సంఖ్యలో రోగులు, వైద్య సిబ్బంది, శరణార్థులున్నారు. రోగుల, ముఖ్యంగా 100 మందికి పైగా ఉన్న నవజాత శిశువుల సామూహిక మరణాలకు ఇంకెంతో సమయం పట్టదని సిబ్బంది చెబుతున్నారు. తూటాలు తరచూ ఆస్పత్రి లోనికి దూసుకొస్తున్నాయంటున్నారు. ఆస్పత్రిని సైన్యం చుట్టుముట్టింది.

మహిళపై ఐదుగురి గ్యాంగ్ రేప్

ఆగ్రా: పాతికేళ్ల వయసున్న మహిళా ఉద్యోగిపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి ఆగ్రాలో జరిగింది. ఈ ఘటనలో ఒక మహిళతోపాటు ఐదుగురు నిందితులను పోలీసుల అరెస్ట్‌చేశారు. కేసు వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. 'కాపాడండి అంటూ శనివారం రాత్రి ఒక హోమ్‌స్టే(పెయింగ్ గెస్ట్‌లకు ఆశ్రయమిచ్చే ఇల్లు) నుంచి ఫోన్‌కాల్ వస్తే వెళ్లాం. అక్కడ తలకు గాయంతో నిస్సహాయంగా పడి ఉన్న హోమ్‌స్టే ఉద్యోగినిని వెంటనే ఆస్పత్రికి తరలించాం. ఈ ఘటనతో సంబంధం ఉన్న మహిళను, ఐదుగురు నిందితులను అరెస్ట్‌చేశాం. బాధిత మహిళను గతంలో అభ్యంతరకరంగా వీడియో తీసిన నిందితులు ఆ వీడియోను బహిర్గతం చేస్తామని బెదిరించారు. శనివారం అర్ధరాత్రి హోమ్‌స్టేకు వచ్చి గ్యాంగ్‌రేప్‌కు ఒడిగట్టారు' అని పోలీసులు తెలిపారు.

లండన్లో ప్రవాసభారతీయుని ఇంట్లో మంటలు.. ఐదుగురు సజీవ దహనం

లండన్: లండన్‌లోని భారత సంతతి వ్యక్తికి చెందిన ఇంట్లో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సజీవ దహనమయ్యారు. ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు జరుపుకున్న కాసేపటికే ఈ విషాదం జరిగినట్టు తెలుస్తోంది. మంటలార్పిన అనంతరం ఫస్ట్ ఫ్లోర్‌లో ఐదు మృతదేహాలు పడి ఉండగా గుర్తించినట్టు చెప్పారు. కాగా, మాంచెస్టర్‌కు చెందిన దిలీప్ సింగ్(54) మాట్లాడుతూ..అది తన బావమరిది ఇల్లు కాగా, అందులో భార్య, ముగ్గురు పిల్లలతో ఆయన ఉంటున్నారన్నారు. మరో ఇద్దరు అతిథులు కూడా ఘటన సమయంలో ఉన్నట్టు తెలిపారు. ఆ కుటుంబం ఇటీవల బెల్జియం నుంచి లండన్‌లోని కొత్త ఇంటికి మకాం మార్చినట్టు చెబుతున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం, 14 నవంబర్ 2023

వడ్డీ వ్యాపారులపై దాడులు

కృష్ణరాజపురం: బెంగళూరులో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమ వడ్డీ వ్యాపారులపై సీసీబీ పోలీసులు దాడి సుమారు రూ. 42 లక్షల నగదు, బంగారం సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీసీబీ డీసీపీ శ్రీనివాస్‌గౌడ ఆధ్వర్యంలో బసవగడి, చామరాజపేటె, కామాక్షి పాళ్య, బసవేశ్వరనగర పరిధిలో దాడులు చేశారు. 10 నుంచి 15 శాతం వడ్డీతో అప్పులు ఇచ్చే 4 ఫైనాన్స్ ఆఫీసులు, యజమానుల ఇళ్లలో సోదాలు చేసి సుమారు 100కు పైగా సంతకం చేసి ఉన్న ఖాళీ చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారులు వీటిని రుణగ్రహీతల నుంచి సేకరించారు. రూ.42 లక్షల విలువైన బంగారు నగలు, నగదు, 6 రోలెక్స్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి ఫైనాన్షియర్లపై కేసులు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

నగరంలో కారు బీభత్సం

- ముగ్గురికి గాయాలు



డివైడరును ఢీకొని నిలిచిన కారు

బనశంకరి: కారు డ్రైవరు అదుపు తప్పడంతో చోటుచేసుకున్న వరుస ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. ఈఘటన నగరంలో హుళిమావు పరిధిలో జరిగింది. బన్నేరుఘట్ట నివాసి, కారు డ్రైవరు అగర్వాల్ ఆదివారం సాయంత్రం జిగిణి నుంచి బెంగళూరుకు కారులో బయలుదేరాడు. బన్నేరుఘట్ట రోడ్డు కాళేన అగ్రహార వద్ద ఓ వ్యక్తి ఆకస్మాత్తుగా అడ్డం రావడంతో బ్రేక్‌వేసే బదులు ఎక్సలేటర్ తొక్కాడు. దీంతో కారు వేగంగా దూసుకెళ్లి ముందు వెళుతున్న మూడు బైకులను ఢీకొట్టి రోడ్డు డివైడరును ఢీకొని నిలిచిపోయింది. ఈ దుర్ఘటనలో భర్తతో కలిసి బైక్‌పై వెళ్తున్న స్మిత అనే మహిళకు తీవ్ర గాయాలు, కిరణ్, మోమ్సిన్ అనే ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులు ఆస్పత్రిలో చేరారు. కారు డివైడర్‌లోకి చొచ్చుకుపోయినా డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. హుళిమావు ట్రాఫిక్ పోలీసులు అగర్వాల్ ను అదుపులోకి తీసుకున్నారు.

జైలులో చైత్రపై దౌర్జన్యం

బనశంకరి: డబ్బులు తీసుకుని అసెంబ్లీ టికెట్ ఇప్పిస్తానన్న కేసులో పరప్పన అగ్రహార జైలులో రిమాండులో ఉన్న చైత్ర కుందాపురపై ఆఫ్రికన్ మహిళాఖైదీలు దాడిచేశారు. సోమవారం మధ్యాహ్నం మహిళా విచారణ ఖైదీల బ్యారక్‌లో జాతీయ గీతం విషయంలో ఆఫ్రికన్ మహిళాఖైదీలు, చైత్రా మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో చైత్రతో పాటు ముగ్గురు స్థానిక ఖైదీలపై దాడికి పాల్పడ్డారు. జైలులో పోలీసులకు చైత్ర ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- తండ్రీ కొడుకులు మృతి



దొడ్డబళ్లాపురం: స్టీరింగ్ కట్ కావడంతో అదుపుతప్పిన కేఎస్ ఆర్టీసీ బస్సు స్కూటర్‌ని ఢీకొని తండ్రీ కొడుకు మృతిచెందిన సంఘటన చెన్నపట్టణ తాలూకా తిట్టమారనహళ్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. కోటమారనహళ్లికి చెందిన సిద్ధయ్య (60), అరుణ్ (27)లు సోమవారం ఉదయం స్కూటర్‌లో స్వగ్రామం నుంచి చెన్నపట్టణకు వెళ్తున్నారు. ఎదురుగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, సిద్ధయ్య ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. బస్సు స్టీరింగ్ కట్ కావడంతో అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. తరువాత బారికేడ్లను ఢీకొని నిలిచిపోయింది. లేదంటే బస్సు చెరువులోకి పడిపోయి ఉండేది. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురికి రూ.57 లక్షల టోపీ

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగం, అధిక లాభాల పేరుతో ముగ్గురికి రూ. 57.83 లక్షలకు టోపీ వేసిన సైబర్ దొంగల ఉదంతమిది. హోసూరు సమీపంలోని ఒన్నలవాడి గ్రామానికి చెందిన శీల (27) గత సెప్టెంబర్ 11వ తేదీ ఒక ఫోన్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి ద్వారా అధిక లాభం ఆర్జించవచ్చని ఫోన్ చేసిన వ్యక్తి నమ్మించాడు. అలా ఆమె నుంచి రూ. 19.33 లక్షలు ఖాతాలో వేయించుకుని ఫోన్ స్విచాఫ్ చేశారు.

- మత్తిగిరి టైటాన్ టౌన్‌షిప్‌కి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రామ్‌కుమార్ వద్ద రూ. 32.65 లక్షలు, చిన్నయలసగిరివాసి సుబ్బులక్ష్మి నుంచి రూ. 5.85 లక్షల మేర వసూలు చేసి వంచించారు.
- బాధితులు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

సిద్ధగంగ మఠంలో విజయేంద్ర



తుమకూరు: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు బీవై విజయేంద్ర సోమవారం తుమకూరు నగరంలోని సిద్ధగంగ మఠానికి వచ్చారు. శివకుమారస్వామీజీ సమాధికి ప్రత్యేక పూజల అనంతరం మఠాధ్యక్షుడు సిద్ధలింగస్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి ధ్యాన మందిరంలో పూజలు చేశారు. విజయేంద్ర విలేకరులతో మాట్లాడుతూ...ఈనెల 15న బెంగళూరు మల్లేశ్వరం పార్టీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

ఉడుపిలో నెత్తుటేర్లు

- తల్లి, ఇద్దరు కూతుళ్లు, కొడుకు హత్య
- ఆగంతకుని మారణకాండ
- హంతకుని కోసం ముమ్మర గాలింపు
- మిస్టరీగా మారిన ఘటన





హత్యాకాండ జరిగిన ఇంటిలో పోలీసుల తనిఖీల దృశ్యం

యశవంతపుర: అందమైన బీచ్‌లు, దేవస్థానాలతో ప్రశాంతంగా ఉండే ఉడుపి నగరంలో ఘోరం చోటుచేసుకుంది, ఆదివారం ఉదయం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్యకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి, ఇంటి యజమాని నూర్ మహమ్మద్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య హసీనా (45), కూతుళ్లు అఫ్నాన్ (23), అజ్నాన్ (21), కొడుకు అసీమ్ (14) ఉడుపిలో తృప్తినగరలో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కొడుకు అసాద్ బెంగళూరులో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో, అలాగే అఫ్నాన్ బెంగళూరులో ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పండుగ సెలవులు రావడంతో అఫ్నాన్ రెండు రోజుల కిందట ఉడుపిలోని ఇంటికి వచ్చింది. ఆదివారం ఉదయం 8:20 గంటల సమయంలో 45 ఏళ్ల మధ్యవయసుడు మూతికి మాస్క్ ధరించి సంతెకట్టెకు వచ్చాడు, అక్కడి నుంచి ఆటో ఎక్కి తనను తృప్తినగరకు తీసుకెళ్లాలని ఆటోడ్రైవర్ శ్యామ్‌కు సూచించాడు. ఆ మేరకు అతన్ని తృప్తినగరలో దించాడు.

నలుగురిని వెంటాడి పొడిచి

దుండగుడు వెంట తెచ్చుకున్న చాకుతో ఇంటిలోకి చొరబడి మారణహోమం సృష్టించాడు. ఎక్కడ ఉన్న వారిని అక్కడే పొడిచి, గొంతుకోసి హతమార్చాడు. వంట గది, బెడ్‌రూం, బాతురూం, హాల్‌లో ఒక్కొక్కరి శవాలు ఉండడమే దీనికి నిదర్శనం. హసీనా అత్తను వెంటాడగా ఆమె భయంతో బాతురూంలోకి వెళ్లి లాక్ చేసుకోవడంతో బతికి పోయింది. అసీమ్ సైకిల్ తొక్కుతూ ఇంటిలోకి వచ్చి దుండగున్ని చూసి కేకలు వేశాడు. దుండగుడు బాలున్ని హాల్‌లో పొడిచి చంపి పరారయ్యాడు.

15 నిమిషాల్లో దారుణం

కాగా హంతకుడు 15 నిముషాలలో పని ముగించుకొని మళ్లీ ఎవరో బైకులో వెళ్తుంటే సంతెకట్టకు డ్రాప్ తీసుకున్నాడు. సంతెకట్ట నుంచి ఎక్కడకు వెళ్లాడో జాడ లేదు. ఈ హత్యోదంతం క్షణాల్లోనే ఉడుపి అంతటా పాకిపోయింది. వందలాదిగా అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వచ్చి జాగిలాలు, వేలి ముద్రల నిపుణులు ఆధారాల కోసం గాలించారు.

బెంగళూరు యాసలో మాట్లాడాడు

- ఐదు పోలీసు బృందాలు మంగళూరు, శివమొగ్గ, కారవారకు వెళ్లాయి, రెండు బృందాలు ఉడుపిలో గాలిస్తున్నాయి.
- 45 ఏళ్ల వయసున్న హంతకుని సీసీ కెమెరా ఫొటోలు, వీడియోలను విడుదల చేశారు. నిందితుడు బెంగళూరు యాసలో కన్నడ మాట్లాడినట్లు ఆటో డ్రైవర్ శ్యామ్ చెప్పాడు.
- ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తున్న యువతిపై ద్వేషంతోనే హత్యాకాండకు పాల్పడి ఉండొచ్చని, లేదా పెద్ద కొడుకు పాత్ర ఉండవచ్చని అనుమానాలు ఉన్నాయి.
- పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు ఘటనాస్థలిని పరిశీలించారు.
- దుబైలో ఉన్న మొహమ్మద్, బెంగళూరులో పెద్దకొడుకు అసాద్ చేరుకోగా సోమవారం సాయంత్రం కోడిబెంగ్రె జామియా మసీదులో అంత్యక్రియలను జరిపారు.



హత్యకు గురైన తల్లి హసీనా, ఆమె పిల్లలు (ఫైల్)



హసీనా దంపతులు, పిల్లలు (ఫైల్)

పెద్దలను కలిసి, దీవెనలు పొంది..

శివాజీనగర: బీజేపీ రాష్ట్రాధ్యక్షునిగా ఎంపికైన శికారిపుర ఎమ్మెల్యే, మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు విజయేంద్రకు రాష్ట్ర ప్రభుత్వం భద్రతా వాహనం, పోలీస్ భద్రతను కల్పించింది. ఆదివారం నుంచి ముగ్గురు పోలీస్ సిబ్బంది ఉన్న ఎస్కార్టు వాహన వసతి ఏర్పాటైంది. బుధవారం పార్టీ కార్యాలయంలో విజయేంద్ర పదవీ బాధ్యతల స్వీకారం జరుగనుంది. ఆయన సోమవారం ఉదయం మాజీ సీఎం బసవరాజ బొమ్మై, మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడ ఇంటికి వెళ్లి ఆశీర్వాదం పొందారు. మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ ఇంటికి వెళ్లి కలిశారు. తన నియామకంతో రాష్ట్ర బీజేపీకి పెద్ద శక్తి వచ్చినట్లయిందని బొమ్మై చెప్పారన్నారు. సీనియర్‌లు అందరూ సహకరిస్తామని తెలిపారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలను కలసికట్టుగా ఎదుర్కోవాలి, బొమ్మై నేతృత్వంలో రాష్ట్రమంతటా పర్యటించి పార్టీకి శక్తి నింపే పని చేస్తామన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే : హైకోర్టు



శివాజీనగర: జీవిత సంధ్యాకాలంలో ఉన్న తల్లిదండ్రుల యోగక్షేమాలు చూసుకునే బాధ్యత చట్టం, ధర్మ, నైతికత ప్రకారం పిల్లలపై ఉంటుంది. తల్లిదండ్రుల నుంచి ఆస్తిని పిల్లలు బహుమతిగా పొందినపుడు ఈ బాధ్యత మరింత ఎక్కువ అని హైకోర్టు అభిప్రాయపడింది. తండ్రి నుంచి ఆస్తిని తీసుకుని, తరువాత ఇంటినుండి బయటికి గెంటేసిన కుమార్తె, అల్లుని కేసులో ప్రధాన న్యాయమూర్తి పీబీ వరాళె, జడ్జి కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం ఈ మేరకు స్పష్టంచేసింది. వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలపైన ఉటుంది, అంతేకానీ ఇది దయ-దానం కాదు అని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కొడుకు తీరు నేపథ్యంలో గతంలో తుమకూరు ఉన్నతాధికారులు ఆ ఆస్తి బదిలీని రద్దు చేసిన కేసు విచారణను డివిజన్ బెంచ్‌కు అప్పగించారు.

రెండో భార్య కూతురి పేరు.. కేసు కొట్టివేత

యశవంతపుర: జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామిపై దాఖలు చేసిన ప్రైవేట్ కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు రద్దు చేసింది. దీంతో కుమారస్వామికి పెద్ద ఊరట కలిగింది. ఆయన రెండో భార్య కూతురి పేరును ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదంటూ ఎస్.ఆనంద అనే వ్యక్తి కేసు వేశారు. మొదటి భార్య ఉండగా చేసుకున్న రెండో పెళ్లికి గుర్తింపులేదు. దీంతో ఎన్నికల అఫిడవిట్‌లో చూపాల్సిన అవసరం లేదని కుమార న్యాయవాదులు వాదించారు. ఈ నేపథ్యంలో జడ్జి జె.ప్రత్ కేసును కొట్టివేశారు.

పార్ట్ టైం ఉద్యోగమని రూ. 8 లక్షలు..



బనశంకరి: పార్ట్‌టైం ఉద్యోగం ఇస్తామని మహిళకు సైబర్ నేరగాళ్లు రూ.8.35 లక్షలు మోసగించారు. బెంగళూరు కనకపురరోడ్డు వాజరహళ్లి నివాసి లీనా (43) బాధితురాలు. లీనా మొబైల్‌కు పార్ట్‌టైం ఉద్యోగమని ఒక మెసేజ్, ఆపై లింక్ వచ్చాయి. లీనా లింక్‌పై నొక్కగానే మోసగాళ్లు సంప్రదించి టెలిగ్రాం గ్రూప్‌లో చేర్చారు. పెట్టుబడి పెడితే అధిక లాభం ఇస్తామని నమ్మించారు. లీనా వారి బ్యాంక్ అకౌంట్‌కు దశలవారీగా రూ.8.35 లక్షల నగదు జమ చేసింది. ఆ తరువాత కేటుగాళ్ల నుంచి స్పందన లేదు. మోసపోయినట్లు తెలుసుకుని దక్షిణ విభాగం సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కబ్బన్‌పార్క్ పీఎస్‌లో బదిలీల కుదుపు

శివాజీనగర: ఐటీ సిటీలో కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సుమారు 35 మంది సిబ్బంది సామూహిక బదిలీ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశారు. వీరిలో 12 మంది ఏఎస్ఐ, 23 మంది హెడ్ కానిస్టేబుల్‌లు ఉన్నారు. వేర్వేరు కారణాలతో బదిలీకి లేఖ రాసుకున్నా, స్టేషన్‌లోని సీఐ, ఇతర ఉన్నతాధికారుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది. ముఖ్యమైన అధికారి, సిబ్బంది మధ్య సఖ్యత లేదని, ఫలితంగా ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. లేఖ రాసినవారిలో కొందరిని బదిలీ చేశారు.



పాలస్తీనాపై ఇజ్రాయెల్ దండయాత్రను ఖండిస్తూ సోమవారం కలబుర్గిలో ముస్లింల ప్రదర్శనలో పాల్గొన్న బాలలు

మంగళూరులో మెడికో ఆత్మహత్య

యశవంతపుర: మంగళూరులోని ఏజే మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో హాస్టల్‌పై నుంచి ఎంబీబీఎస్ విద్యార్థిని దూకి ఆత్మహత్య చేసుకొంది. ప్రకృతి శెట్టి (20) ఇదే కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఏం జరిగిందో కానీ సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హాస్టల్‌పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో చనిపోయింది. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు డెత్‌నోట్ రాసినట్లు తెలిసింది. కద్రి పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

దీపావళి వెలుగుల్లో అపశ్రుతులు



ధార్వాడలో మహిళలు దీపాలు వెలగించి సంప్రదాయ రీతిలో సంబరాలు



బెంగళూరులో చిచ్చుబుడ్డి కాంతులు

- బెంగళూరులో 29 మందికి గాయాలు

బనశంకరి: రాష్ట్రమంతటా ఉత్సాహంగా జరుపుకొన్న వెలుగుల పండుగ దీపావళిలో కొన్ని అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. ఆదివారం బెంగళూరులో టపాసులు కాలుస్తూ 29 మంది గాయపడ్డారు. వీరిలో అత్యధికులు బాలలే. నారాయణ నేత్రాలయ ఆసుపత్రిలో 22 మంది, మింటో ఆసుపత్రిలో 7 మంది చికిత్స పొందుతున్నారు. చేతులు, కాళ్లకు గాయాలు తగిలినవారు పెద్దసంఖ్యలో స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందినట్లు తెలిసింది. కళ్లకు, అలాగే తీవ్రంగా కాలిన గాయాలైనవారు విక్టోరియా ఆసుపత్రిలో చేరారు. నేత్రాలయలో 22 కేసుల్లో 10 మందికి కళ్లకు శస్త్రచికిత్స అవసరం ఏర్పడింది. మింటో ఆసుపత్రిలో పదేళ్ల బాలిక, 18 ఏళ్ల యువకుని కళ్లకు ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. టపాసులు పేల్చే సమయంలో అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమని చెప్పారు.

ఉదయం నుంచి టపాసుల మోత

రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య టపాసులు కాల్చాలని పోలీస్ కమిషనర్ బీ దయానంద్ సూచించారు. కానీ ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన టపాసులు మోత అర్ధరాత్రి వరకు చెవులు దిమ్మెక్కించింది. గ్రీన్ టపాసులు కాల్చాలనే ప్రభుత్వ ఆదేశాలను ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం కూడా దీపావళి అమావాస్య కావడంతో ఐటీ నగరంలో జోరుగా పటాకులు కాల్చారు. మరోవైపు ధార్వాడ, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో మహిళలు దీపాలు చేబూని సంప్రదాయ రీతిలో ఆచరించారు.





బెంగళూరు మింటో ఆస్పత్రిలో టపాసుల బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు



పడవలు బూడిద





ఉడుపి జిల్లా కుందాపుర వద్ద గొంగొళ్లిలో చేపల రేవులో అగ్ని ప్రమాద దృశ్యం. సుమారు 9 పడవలు కాలిపోయాయి. లక్షలాది రూపాయలు నష్టపోయినట్లు జాలర్లు వాపోయారు

గుప్తనిధుల ముఠా అరెస్టు

గుర్రంకొండ: గుప్తనిధుల ముఠా సభ్యుల్ని చిత్తూరు జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్దనున్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దిలీప్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుర్రంకొండ పరిధిలోని ఎల్లుట్ల గ్రామం ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన మాలేటి శ్రీనివాసులు (44) మదనపల్లెలో నివాసముంటున్నాడు. అక్కడే ఇంటి నిర్మాణ పనుల్లో బేల్దారీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను మదనపల్లెకు చెందిన రచ్చా రవివర్మ (54)తో తమ ప్రాంతంలోని పురాతన ఆలయాలు, కొండల్లో గుప్తనిధుల ఉన్నాయని చెప్పాడు. ఎల్లుట్ల-నగరి పరిధిలో ఉన్న మూలలమ్మకొండల్లో పురాతన ఆలయాల దగ్గర గుప్తనిధులు ఉంటాయని, వాటిని తవ్వితీస్తే ఎంతో విలువైన సంపద బయటపడుతుందన్నారు. వీరిద్దరూ కలసి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన సింకి భాస్కర్ (43), కోలారు జిల్లా శ్రీనివాసపురానికి చెందిన మూరెళ్ల నాగరాజ (56), మదనపల్లెవాసి అంబటి రెడ్డిసునీల్ (39), వాల్మీకిపురం వాసి ఇడగొట్టి రెడ్డెప్ప (39), బి.కొత్తకోటకు చెందిన వెన్నముద్దల మహేంద్ర (39) కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 10వ తేదీన అందరూ నగరి సమీపంలోని మూలాలమ్మ కొండపైకి చేరుకొన్నారు. రాత్రిళ్ల అక్కడే మకాం వేసి ఏవేవో పూజలు నిర్వహించి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. 12న కొండపై నుంచి దిగి వస్తుండగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. తవ్వకాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

సాయి సన్నిధిలో దీపావళి



ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో దీపావళి వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనం నిర్వహించిన పిదప సత్యసాయియజుర్ మందిరం వద్ద సత్యసాయి చిత్రపటానికి ట్రస్టీలు పూజలు నిర్వహించారు. విద్యార్థులు, ట్రస్ట్ ఉద్యోగులు, భక్తులు టపాసులు కాల్చి దీపావళి నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుజరాత్ సంవత్సర శోభ

ప్రశాంతి నిలయంలో గుజరాతీ భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుజరాతీల నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సుమారు వెయ్యి మందికి పైగా గుజరాత్ సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. సోమవారం సాయంత్రం బాల భక్తులు సత్యసాయి మానవతా విలువలను వివరిస్తూ ప్రదర్శించిన నాటికలు ముగ్ధుల్ని చేశాయి.

సీఐపై కేంద్రమంత్రి గుస్సా

- మా కార్యకర్తలను వేధించారని ధ్వజం
- మిమ్మల్నీ కొట్టాలా? అని ఆగ్రహం


సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై మండిపడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: బీజేపీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడ వద్దని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ధార్వాడ టౌన్ సీఐ కాడదేవర మఠ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఆయన ఆదివారం ఇక్కడి మయూర ఎస్టేట్‌లోని జోషి నివాసం వద్ద కాంగ్రెస్ తరఫున పని చేస్తారా? అంటూ సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యకర్తలకు అనవసరంగా వేధించడం సరికాదన్నారు. ఇదే విధంగా కొనసాగితే స్టేషన్ ఎదుట వేలాది మందితో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. చట్టానికి వ్యతిరేకంగా జూదం ఆడుతున్న వారిని సాక్ష్యాలతో సహా పట్టుకొని తగిన చర్యలు తీసుకోండన్నారు. అయితే స్టేషన్‌కు పిలిపించి ఏ ఆధారం లేకుండా కొట్టారన్నారు. మిమ్మల్ని తాను నాలుగు దెబ్బలు కొడితే ఎలా ఉంటుంది? అని కన్నెర్ర చేశారు. ఈ విధంగా తమ పార్టీ కార్యకర్తలను కొట్టడం, అసభ్యంగా తిట్టడం, బెదిరించడం వంటి పనులకు పాల్పడితే మీ స్టేషన్ ఎదుటే తాను కార్యకర్తలతో కలిసి ధర్నా చేపడతానన్నారు.

ఏం జరిగిందంటే..

ఇంతకు అసలు విషయం ఏమిటంటే ధార్వాడ గొల్లర కాలనీలో రవి గొల్లర అనే వ్యక్తిపై నాలుగేళ్ల క్రితం కేసు నమోదు చేశారు. ఇటీవల అతడిపై రౌడీషీట్ తెరిచి రోజు సంతకం చేయాలని హెచ్చరించారు. శనివారం తిరిగి పోలీసులు రవిని స్టేషన్‌కు పిలిపించుకొని విచారణ చేసి అతడిని కొట్టారు. పైగా పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లి మరో కేసు పెట్టడానికి ప్రయత్నించారు. దీంతో బాధితుడు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఆశ్రయించినట్లు రవి సోదరుడు రాజేష్ గొల్లర తెలిపారు. కాగా ఒక పోలీస్ అధికారిని కేంద్ర మంత్రి ఇలా మందలించడం, హెచ్చరించడం తగదని కాంగ్రెస్ నేతలు స్పందించారు.

క్లుప్తంగా

మున్సిపల్ కౌన్సిలర్‌పై హత్యాయత్నం


తోరణగల్లులోని రైల్వేస్టేషన్ ప్రాంతం

సాక్షి బళ్లారి: తోరణగల్లు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని 11వ వార్డు ఘోర్పడే నగర్‌లో హెచ్ఎల్‌సీ కాలువ వద్ద మున్సిపల్ కౌన్సిలర్‌పై సోమవారం హత్యాయత్నం జరిగింది. ఉదయం కౌన్సిలర్ నాగరాజు నాయక్(32)అనే వ్యక్తిపై శివకుమార్ అనే వ్యక్తి కొడవలితో దాడి చేయడంతో తల, వీపు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని జిందాల్ సంజీవని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్ ఆస్పత్రికి తరలించారు. గతేడాది ఎన్నికల అనంతరం డ్రైనేజీ సమస్యపై వివాదం ఏర్పడటంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ విషయంపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. ప్రస్తుతం అదే వివాదానికి సంబంధించిన గొడవలో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై తోరణగల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లబ్ధిదారులకు హక్కుపత్రాల అందజేత


ఫారం-3 పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున

కంప్లి: హరపనహళ్లి పురసభ పరిధిలోని పలు ఎక్స్‌టెన్షన్లలో స్వంత స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి ఇంటింటికీ వెళ్లి ఫారం నెంబర్- 3 లను ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున అందజేశారు. అనేక కుటుంబాలు ఈ ఫారం-3 లబ్ధిని పొందాలన్నారు. కాగా తమవే ఈ ఇళ్లు అనుకున్న వారి కలలను నేటితో నిజం చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పురసభ సభ్యుడు ఎంపీ అంజినప్ప అభినందనలు తెలిపారు.

స్వామీజీకి తులాభారం


తులాభారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రాయచూరు రూరల్: తాలూకాలోని ముర్కిదొడ్డిలో స్వామీజీకి గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ 79వ తులాభారం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అవధూత అత్రికుల తిలక్ రామారావ్ బుడదిన్ని 39వ జయంతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో దానధర్మాలు ఉండడం వల్లే సమాజంలో శాంతి నెలకొందని స్వామీజీ అన్నారు. గ్రామీణాభివృద్ధికి ఆ భగవంతుడు మరింత శక్తిని ప్రసాదించాలని ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి


అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం

కంప్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మౌలానా అబుల్ కలాం సర్కిల్‌ను నిర్మించి విగ్రహం స్థాపించాలని మున్సిపల్ యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను అబుల్ కలాం ఆజాద్ ముస్లిం అభివృద్ధి సమితి అధ్యక్షుడు హొన్నూర్‌సాబ్ ఒత్తిడి చేశారు. ఉపాధ్యాయుడు బడిగేర్ జిలాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో హిందూ ముస్లింలను చైతన్యపరిచి వారిలో భావైక్యత, సమగ్రత, దేశభక్తిని నింపడంలో ప్రధాన పాత్ర వహించారన్నారు.

పర్యావరణ హిత టపాసులపైనే ఆసక్తి


గ్రీన్ టపాసులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

మైసూరు: సాధారణ టపాసుల కంటే అతి తక్కువ ఉద్గారాలను వెలువరించే పర్యావరణ హిత టపాసులపైనే నగర ప్రజలు ఆసక్తి చూపారు. ప్రతి ఏడాది మైసూరు నగరంలో మూడు రోజుల పాటు కోట్లాది రూపాయల బాణాసంచా పేలుస్తారు. అయితే వాతావరణం కాలుష్యంపై అవగాహన కల్పించడంతో ప్రతి ఒక్కరూ గ్రీన్ టపాసులనే ఎక్కువగా కొనుగోలు చేశారు. మరొవైపు టపాసుల వ్యాపారులు మాత్రం గత ఏడాది కంటే వ్యాపారాలు బాగా తగ్గాయని చెబుతున్నారు.

వాగులో మొసలి ప్రత్యక్షం


నీటిలో తిరుగుతున్న మొసలి(వృత్తంలో)

కంప్లి: ఎమ్మిగనూరు గ్రామంలోని జడెసిద్దేశ్వర వంతెన సమీపంలోని వాగు నీటిలో సుమారు 12 అడుగుల పొడవైన మొసలి ప్రత్యక్షమైంది. దీంతో వంకను ఆనుకొని ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు వాగు నీటిని దాటాలంటే అర చేతిలో ప్రాణాలు పట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. రైతాంగం రేయింబవళ్లు పొలాల్లో నీరు పారించుకునేందుకు వెళ్లడానికి భయపడుతున్నారు. కొంత మంది పంప్‌సెట్ రైతులు మొసలి దాడిలో కళ్లు మూసి తెరిచే లోగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డ దాఖలాలు ఉన్నాయి. ఒకే రోజు ఈ వంకలో మూడు కంటే ఎక్కువ మొసళ్లు కనిపించాయి. దీంతో మొసలి పిల్లలను పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. వంక పక్కన మేస్తున్న కొన్ని గొర్రెలు, మేకలు కూడా మొసలి నోటికి బలయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఇకనైనా స్పందించి మొసళ్లను పట్టి తమకు విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి సహకార ఉత్సవాలు


మాట్లాడుతున్న కేఓఎఫ్ అధ్యక్షుడు నాడగౌడ

రాయచూరు రూరల్: వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు 70వ అఖిల భారత రాష్ట్ర స్థాయి సహకార ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, కేఓఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ నాడగౌడ, జిల్లా కేంద్ర సహకార(ఆర్‌డీసీసీ) బ్యాంక్ అధ్యక్షుడు విశ్వనాథ్ పాటిల్ తోరణదిన్ని వెల్లడించారు. సోమవారం బ్యాంక్ సభాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సహకార శాఖా మంత్రి రాజణ్ణ, వైద్యవిద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ ధ్వజారోహణ, న్యాయ శాఖా మంత్రి హెచ్.కే.పాటిల్ వస్తు ప్రదర్శనను, చిన్న నీటిపారుదల, విజ్ఞాన సాంకేతిక శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సఫల్ నీటి పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. బ్యాంక్‌కు ప్రభుత్వం నుంచి రూ.224 కోట్లు విడుదలైందన్నారు. ఆర్‌ఏపీఎంసీ అధ్యక్షుడు జయంత్ రావ్ పతంగి, సహకార మహా మండలి అధ్యక్షుడు విజయ్ కుమార్ పాటిల్‌లున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం


ప్రమాదానికి కారణమైన క్రూజర్, పక్కన గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

హుబ్లీ: దీపాల పండుగ దీపావళి మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. క్రూజర్ వాహనం బైక్‌ని ఢీకొనడంతో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా 14 మందికి పైగా గాయపడిన ఘటన శివళ్లి మారడి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. హెబ్బాళ గ్రామ యల్లప్ప గంటి(55), బసవరాజ్ కురహట్టి(45), ధార్వాడ గొల్లర వీధి నివాసి రోహన్ అంగడి(25) మృతులు. నవలగుంద నుంచి ధార్వాడకు బాణాసంచా కొనుగోలు కోసం బయలుదేరారు. ఈ క్రమంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనం ఢీకొంది. ధార్వాడలో పని ముగించుకొని తిరిగి ఇంటి వైపు 20కి పైగా మందితో వెళుతున్న క్రూజర్ బైక్‌ను ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా, 15 మందికి పైగా స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యల్లప్ప, బసవరాజ్ ఆదివారమే చనిపోగా రోహన్ అంగడి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుల కుటుంబాలను నవలగుంద ఎమ్మెల్యే ఎంహెచ్ కోనరెడ్డి పరామర్శించారు.

15 నుంచి ముద్దేనహళ్లిలో సంగీత సమ్మేళనం


మాట్లాడుతున్న నరసింహమూర్తి

చిక్కబళ్లాపురం: గానకళా పరిషత్, శ్రీ సత్యసాయి మానవ అభ్యుదయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి గ్రామం ముద్దేనహళ్లిలో ఈనెల 15 నుండి 19 వరకు రాష్ట్ర స్థాయి సంగీత సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు సత్యసాయి ట్రస్ట్ ప్రశాంతి బాల మందిరం అధ్యక్షుడు బీఎస్ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఐదు రోజుల పాటు గానకళా పరిషత్ అధ్యక్షుడు పద్మనాభన్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. గానకళా పరిషత్ అధ్యక్షుడు పద్మనాభ మాట్లాడుతూ.. ఈనెల 23న సత్యసాయి మానవ అభ్యుదయ పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో ట్రస్ట్ ప్రముఖులు శివసుబ్రహ్మణ్యం, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

శిబిరంలో ఏనుగుకు గాయం

శివమొగ్గ: శివమొగ్గ సమీపంలోని సక్రెబెలు ఏనుగుల శిబిరంలో ఉన్న ఓ ఏనుగు తోకకు తీవ్ర గాయమైంది. ఇదిలా ఉంటే ఏనుగు గాయపడిన విషయాన్ని ఇద్దరు కావలాదారులు దాచి ఉంచిన విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు వారిద్దరిని సస్పెండ్ చేశారు. గతనెల 17న బాణామతి అనే ఏనుగు అడవిలో ఆహారం కోసం వచ్చిన సమయంలో తోకభాగంలో ఎవరో కొడవలితో కొట్టడంతో తోకభాగం కొంత తెగి ఉంది. చాలా రోజుల నుంచి గాయం అలాగే ఉండటంతో పాటు విషయాన్ని వైద్యులకు, ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకురాకపోవడంతో వారిద్దరిని సస్పెండ్ చేశారు.

తేనెటీగల దాడి, నలుగురికి తీవ్ర గాయాలు

తేనెటీగలు దాడి చేయడంతో నలుగురు వ్యక్తులతో పాటు పది ఆవులు తీవ్రంగా గాయపడిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీకోటె తాలూకా హ్యాండ్‌పోస్టు సమీపంలో చోటుచేసుకుంది. రైతు సంఘం నేత నవీన్‌గౌడకు చెందిన తోటలో ఉన్న తేనెటీగలు హఠాత్తుగా పైకి లేచి అక్కడే ఉన్న నవీన్‌తో పాటు ఇద్దరు పిల్లలు, ఒక మహిళను తీవ్రంగా కుట్టాయి. అదే విధంగా కొట్టంలో ఉన్న ఆవులను కూడా గాయపరిచాయి. బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఆవులకు పశువైద్యుడు చికిత్స చేశారు.

తోటలో గంజాయి సాగు

మడకశిర: గుడిబండ మండలంలో గంజాయి సాగు కలకలం సృష్టించింది. మండలంలోని సీసీగిరిలో యంజారప్ప అనే వ్యక్తికి చెందిన తోటపై సోమవారం కర్ణాటక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తోటలో సాగు చేసిన గంజాయి చెట్లను గుర్తించారు. వివరాల్లోకి వెళితే... తుమకూరు జిల్లా పట్టనాయకనహళ్ళిలో తేజస్‌గౌడ్ అనే వ్యక్తి ప్రతి నిత్యం గంజాయి సేవించేవాడు. అతనిని పోలీసులు పట్టుకుని విచారించగా, రొళ్ళ మండలం రత్నగిరికి చెందిన చంద్రశేఖర్ ద్వారా గంజాయి అందుతోందని పోలీసులు గుర్తించారు. వీరిద్దరికీ సీసీగిరి గ్రామానికి చెందిన యంజారప్ప తోటలో 7 గంజాయి చెట్ల నుంచి గంజాయిని పంపుతున్నట్లు తేలింది. పోలీసులు చెట్లను నాశనం చేశారు. మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

యువతికి వేధింపులు

బనశంకరి: బెంగళూరు నగర దక్షిణ విభాగ డీసీపీ కార్యాలయం సమీపంలో ఓ యువకుడు యువతిని వేధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బైకులో వచ్చిన యువకుడు ఒంటరిగా వస్తున్న యువతిని లైంగికంగా వేధించి అక్కడి నుంచి ఉడాయించాడు. ఈనెల 6వ తేదీ రాత్రి 10.40 సమయంలో యువతి విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఆ యువకుడు బైక్‌లో వెంబడించి సౌతెండ్ సర్కిల్లోని డీసీపీ కార్యాలయం ముందు భాగంలో యువతిని అడ్డగించి దుస్తులు లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం అక్కడి నుంచి ఉడాయించాడు. బాధిత యువతి జయనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడి కోసం గాలిస్తున్నారు.

నరేగ పనులతో కూలీలకు ఉపాధి


పనులు చేస్తున్న కూలీలు

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల ఉపాధికి నరేగ పనులు సహాయకారిగా మారాయని కర్ణాటక ప్రాంత రైతు సంఘం అధ్యక్షుడు కరియప్ప హచ్చొళ్లి పేర్కొన్నారు. సోమవారం కల్మలలో వ్యవసాయ కూలీలు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(నరేగ) పథకం కింద చేపట్టిన పనులను ఆయన పరిశీలించి తెలిపారు.

కోతుల దాడిలో వ్యక్తి మృతి

యశవంతపుర: దావణగెరె జిల్లా హొన్నాళి తాలూకా అరకెరె గ్రామంలో కోతుల దాడిలో పీఎల్‌డీ బ్యాంక్ ఉపాధ్యక్షుడు మృతి చెందారు. గ్రామంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్తున్న గుత్తప్పన (60)పై కోతులు దాడి చేశాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన గుత్తప్పనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ మంత్రి రేణుకాచార్య సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో ఎలుగుబంట్లు, చిరుతలు, కోతుల దాడులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ మంత్రికి వివరించారు.

వైద్యుడి తల్లి నేత్రదానం

రాయచూరు రూరల్: నగరంలోని హృద్రోగ వైద్యుడు సురేష్ సగరద్ తల్లి కమలాక్షమ్మ(72) ఆదివారం మరణించారు. సోమవారం జాతీయ దేహంగ దాన సమితి, లయన్స్‌క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో రాయచూరు ప్రభుత్వ వైద్యవిజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాలకు నేత్రదానం చేశారు. నేత్ర బ్యాంక్ అధిపతి సిద్దేష్, వైద్యులు రాకేష్, నీరజ్ ఆమె నేత్రాలను స్వీకరించి భద్రపరిచారు.

సీఐకి సన్మానం


సీఐ మంజునాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బనశంకరి: జిగిణి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్‌ను జిగిణి హుబ్లీ పీజీ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం సీఐ మంజునాథ్‌ను సంఘం పూలమాల, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పీ.లక్ష్మీరంగారెడ్డి, పొట్టి శ్రీరాములు తెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర నారాయణ, పాణ్యంబాష, కాశీంపీరా, బైరెడ్డి పుల్లారెడ్డి, ఎస్.మురళిమోహన్‌రెడ్డి, జీ.సుధాకర్‌రెడ్డి, వీ.వినోద్‌కుమార్‌రెడ్డి, పాలక శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి బస్సు బోల్తా

- 10 మంది ప్రయాణికులకు గాయాలు


బోల్తాపడ్డ బస్సు

దొడ్డబళ్లాపురం: టైరు పేలిపోవడంతో అదుపుతప్పిన బస్సు బోల్తా పడి 10 మందిపైగా ప్రయాణికులు గాయపడ్డ సంఘటన ఆదివారం రాత్రి మాగడి తాలూకా చిక్కతొరెపాళ్య వంతెన వద్ద చోటుచేసుకుంది. మాగడి పట్టణం నుండి బెంగళూరు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు టైర్ బ్లాస్ట్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న లోతైన గుంతలోకి బోల్తాకొట్టింది. 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లోకాయుక్తకు చిక్కిన అధికారి


నవీన్ కుమార్

కృష్ణరాజపురం: లంచం తీసుకుంటూ బెస్కాం అధికారి లోకాయుక్తకు చిక్కిన ఘటన నాగవార బెస్కాం కార్యాలయంలో చోటు చేసుకుంది. బెస్కాం అసిస్టెంట్ అధికారి నవీన్‌కుమార్ పట్టుబడిన వ్యక్తి. వివరాలు... మరో విభాగంలో పనిచేస్తున్న లెక్కాధికారి దీపక్ అనే వ్యక్తి మీటరులో పేరు మార్పు కోసం దరఖాస్తు చేశాడు. పేరు మార్పు చేయడానికి నవీన్‌కుమార్ రూ. 50 వేలు డిమాండ్ చేశాడు. రూ. 40 వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. బాధితుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. లోకాయుక్త సూచన మేరకు బాధితుడు నగదు ఇస్తుండగా అధికారులు దాడి చేసి నవీన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కఠినంగా శిక్షించాలి

మండ్య: మండ్య జిల్లా మద్దూరులో దళిత బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు సోమవారం నగరంలో ధర్నా నిర్వహించారు. మండ్య నగరంలోని జేసీ సర్కిల్‌కు చేరుకున్న కార్యకర్తలు అక్కడి నుంచి జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని అక్కడ వినతిపత్రం అందజేశారు. ఈనెల 4న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారం చేసిన విషయం తెల్సిందే.

కోలారు వార్తలు...

నేటి నుంచి అఖిల భారత సహకార సప్తాహ


మాట్లాడుతున్న పెమ్మశెట్టిహళ్లి సురేష్

కోలారు: జిల్లా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో 70వ అఖిల భారత సహకార సప్తాహను ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార సమాఖ్య అధ్యక్షుడు పెమ్మశెట్టిహళ్లి సురేష్ తెలిపారు. సోమవారం నగరంలోని సహకార సమాఖ్య సభాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసారి సహకార సప్తాహను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికత సాధనలో సహకార సంస్థల పాత్ర అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సహకార సమాఖ్య సభాంగణంలో కోలారు చిక్కబళ్లాపుర డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు గోవిందగౌడ ధ్వజారోహణం చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇఫ్కోటోకియో అధ్యక్షుడు కె శ్రీనివాసగౌడ జ్యోతి వెలిగిస్తారన్నారు. సహకార యూనియన్ ఉపాధ్యక్షుడు టీకే బైరేగౌడ, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మూరాండహళ్లి గోపాల్, ఉరిగిలి రుద్రస్వామి, పీఎన్ కృష్ణారెడ్డి, అణ్ణిహళ్లి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే తీవ్ర నిర్లక్ష్యం


మాట్లాడుతున్న జ్యోతిబసు

కేజీఎఫ్: నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే రూపా శశిధర్‌కు ఏమాత్రం అవగాహన లేదని, ఆమె నియోజకవర్గాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ నాయకుడు జ్యోతిబసు తీవ్రంగా ఆరోపించారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో అనేక సమస్యలు తాండవిస్తున్నా ఎమ్మెల్యే వారానికోసారి నగరానికి పిక్నిక్‌కు వచ్చినట్లు వచ్చి వెళుతుండడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రజలు తమ గోడును చెప్పుకోడానికి ఎమ్మెల్యే అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం నగర ప్రజల నుంచి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు స్వీకరించినా నగరసభ వెబ్‌సైట్‌లో ఒక్క అర్జీ కూడా నమోదు కాలేదన్నారు. రాజీవ్ గాంధీ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ నుంచి సర్వే చేసి నగరంలో 16 వేల కుటుంబాలు నివేశన రహితంగా ఉన్నారన్నారు. వీరికి ఇంతవరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. కట్టడ, కూలికార్మికుల పిల్లలకు కార్మిక శాఖ నుంచి లభిస్తున్న సహాయ ధనం, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, కార్మికుల పిల్లలకు వివాహ సహాయ ధనం నిధులను ప్రభుత్వం తన గ్యారెంటీల అమలు కోసం ఉపయోగించుకుంటోందన్నారు. దీంతో కార్మికులకు సౌకర్యాలు అందక వీధిన పడాల్సి వస్తోందన్నారు.

రక్షిత తాగునీరు 7 శాతం మాత్రమే


మాట్లాడుతున్న ఏఈఈ శివకుమార్

కేజీఎఫ్: భూమిపై అందరికీ అవసరమైన నీరు 70 శాతం ఆవరించి ఉన్నా రక్షిత తాగునీరు మాత్రం కేవలం 7 శాతం మాత్రమే అందుబాటులో ఉందని జలమండలి ఏఈఈ శివకుమార్ తెలిపారు. నగరసభ ఆధ్వర్యంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా జల్‌దీపావళి పథకం కింద 30 మంది మహిళలకు రక్షిత తాగునీటి పథకం గురించి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేతమంగలలో 1903లో నీటి శుద్ధీకరణ యూనిట్ ప్రారంభమైందన్నారు. ఇక్కడ శుద్ధీకరించిన రక్షిత తాగునీటిని బీజీఎంఎల్ అధికారులు బెమెల్ ఫ్యాక్టరీకి, నగరానికి కూడా సరఫరా చేస్తుండేవారన్నారు. మహిళలకు నీటి పొదుపుపై అధికారులు సమాచారం అందించారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా ఇళ్లలో పొదుపు పాటించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు జల్ దీపావళి కిట్, గ్యాస్ నీటి బాటిల్‌ను అందించారు. నగరసభ మేనేజర్ శశికుమార్, గోవిందమూర్తి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సంబరాల రవళి..సంతోషాల దీపావళి


తొట్లిలో కేదారేశ్వరవ్రతం ఆచరిస్తున్న మహిళలు


కోలారులో కజ్జికాయలు పంచుకున్న గ్రామపెద్దలు


మాలూరులో లక్ష్మీపూజ నిర్వహిస్తున్న మహిళలు

కోలారు: నగరంతో పాటు తాలూకా వ్యాప్తంగా దీపావళి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగ సందర్భంగా మహిళలు ఇళ్లలో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కజ్జికాయలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఇంటి ముంగిట తోరణాలు కట్టి అలంకరించారు. పండుగ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

మాలూరు: పట్టణంతో పాటు తాలూకాలో దీపావళి సందర్భంగా మహిళలు ఇళ్లలో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి నోముదారాలు కట్టుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని రాజపురోహితుడు నాగరాజ్ స్వామి ఇంటి ఆవరణలో ప్రతిష్ఠించిన లక్ష్మీదేవిని మహిళలు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. పట్టణంలోని మారికాంబ, ముత్యాలమ్మ, వీరాంజనేయ స్వామి, లక్ష్మీ నరసింహస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలను జరిపారు.

పర్యావరణ రక్షణపై జాగృతి భేష్


మొక్కను నాటుతున్న జిల్లాధికారి తదితరులు

కోలారు: బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద పర్యావరణ రక్షణపై జాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం హర్షణీయమని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. సోమవారం నగరంలో దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా మానండి- మొక్కను నాటండి అభియాన్‌లో భాగంగా ఉచితంగా మొక్కలను అందించి, నాటి మాట్లాడారు. సీనియర్ న్యాయవాది కేవీ శంకరప్ప మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణాన్ని రక్షించే కార్యక్రమాన్ని చేపట్టడం శ్లాఘనీయమన్నారు. బాణాసంచా కాల్చితే పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. తహసీల్దార్ హర్షవర్ధన్, ఆర్ఐ రాజేంద్రకుమార్, స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓబవ్వ ధైర్యసాహసాలు అపారం



శివశంకర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ఒణకె ఓబవ్వ నేటి యువతకు ఆదర్శమని, ఆమె ధైర్య సాహసం చరిత్ర పుటలలో శాశ్వతంగా నిలిచి పోయిందని మాజీ మంత్రి ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి అన్నారు. ఆదివారం హెచ్‌ఎన్ కళాభవనంలో జరిగిన ఓబవ్వ జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మాతృభూమి పట్ల ఆమెకున్న అభిమానం అపారమని, కోటలో నికి చొరబడుతున్న హైదరాలి సైన్యాన్ని రోకలినే ఆయుధంగా చేసుకుని హతమార్చిందని వివరించారు. కార్యక్రమంలో కళాకారుడు రామకష్ణ, కమిషనర్ గీత, డా కెవి ప్రకాశ్, నాగరాజు, గొట్లగుంటె వెంకట రమణప్ప పాల్గొన్నారు.

కన్నడ భాష, సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను వితరణ చేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: విద్యార్థులు కన్నడ భాష, సంస్కృతి, చరిత్రపట్ల అవగాహన పెంచుకోవాలని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షులు నంజుండప్ప తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్‌ఎస్‌ఇఎ (మునిసిపల్) ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా సాహిత్య పరిషత్తు, విద్యాశాఖ, యువజన అక్షరాస్యత శాఖ వారిచే శనివారం జరిగిన రాత పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసా పత్రాలను వితరణ చేసి మాట్లాడారు. విద్యార్థులలో కన్నడ భాషా పరంగా జాగృతి పరచాల్సిన అవసరాన్ని తెలిపారు. తీర్థ ఎడ్యుకేషన్ ట్రస్ట్ డా కెవి ప్రకాశ్ మాట్లాడుతూ... విద్యార్థులు పాఠ్యేతర పరీక్షలు, కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు వారిలో సృజనాత్మకమైన నైపుణ్యత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జివి శ్రీనివాస్, బాలప్ప, ప్రవీణ్‌కుమార్, పద్మ, లోకేశ్, కళావిద రామకృష్ణ, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనంతకుమార్ సేవలు మరచిపోలేము



కాగడా ర్యాలీలో విజయేంద్ర తదితరులు

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో బీజేపీకి దివంగత కేంద్రమంత్రి అనంతకుమార్ చేసిన సేవలు మరిచిపోలేమని ఆ పార్టీ నూతన అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. అనంతకుమార్ 4వ వర్ధంతి సందర్భంగా స్మృతి నడక కాగడాల ర్యాలీ ఊరేగింపులో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం యడియూరప్ప, అనంతకుమార్ ఇద్దరు పార్టీని రాష్ట్రంలో కంచుకోటగా మార్చారని అన్నారు. నేడు అనంతకుమార్ మన ముందు లేకపోవడం బాధాకరమన్నారు.

అగ్ని ప్రమాదం, ఏడుబోట్లు దగ్ధం

యశవంతపుర: ఉడుపి జిల్లా బైందూరు తాలూకా గంగొళ్లి బందర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఏడు మత్స్యకారుల బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మరో 15 బోట్ల వరకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మత్స్యకారుల కళ్ల ముందే కోట్ల విలువైన బోట్లు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కరావళి కావలు దళం కేసు నమోదు చేశారు.

బస్సులో మంటలు



నడిరోడ్డుపై బస్సులో మంటలు

దొడ్డబళ్లాపురం: వెళ్తున్న బస్సులో మంటలు చెలరేగిన సంఘటన నెలమంగల పరిధిలో చోటుచేసుకుంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదం తప్పింది. బెంగళూరు ఉత్తర తాలూకా దాసనపుర డిపో నుండి నెలమంగ పట్టణానికి వస్తున్న బస్సు జేపీ ఆస్పత్రి వద్దకు రాగానే బస్సులో మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేసి బస్సులో నుండి దింపేసాడు. మంటలు చూసిన చుట్టుపక్కల జనం దూరంగా పరుగులు తీసారు. వెనుక వచ్చిన బస్సులో ఉన్న అగ్నిమాపక సాధనంతో మంటలు ఆర్పేసారు. నెలమంగల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంటల్లో ఐదంతస్తుల భవనం



భవనంలో మంటలు ఎగసిపడుతున్న దృశ్యం



ఇటీవల వీరభద్రనగరలో బస్ గ్యారేజ్‌లో అగ్నిప్రమాదం

- ఫర్నిచర్ షాపు, కోచింగ్ సెంటర్, ఐటీ సంస్థ బుగ్గి
- బెంగళూరులో మరో ఘోర ప్రమాదం

బనశంకరి: బెంగళూరు నగరంలో వరుస అగ్ని ప్రమాదాలు ప్రజలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పాలికె ఆఫీసులో మంటలు లేచి పాలికె అధికారులు చనిపోవడం, కోరమంగళలో రెస్టారెంట్ కమ్ పబ్‌లో భారీ అగ్ని ప్రమాదం, అగరొత్తుల కంపెనీలో మంటలు, ఇటీవల వీరభద్రనగరలో గ్యారేజ్‌లో మంటలు రేగి 30 బస్సులు ఆహుతి కావడం మరువక ముందే ఆదివారం అర్ధరాత్రి ఐదు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం సంభవించి కట్టడం మొత్తం కాలిపోయింది. ఈ ఘటన రామమూర్తినగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ రింగ్ రోడ్డులో చోటుచేసుకుంది.

ఒక్కసారిగా మంటలు

వివరాలు.. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఫర్నిచర్స్, రెండో అంతస్తులో కామెడ్ కోచింగ్‌సెంటర్, 3, 4 అంతస్తుల్లో బ్రేక్స్ కంట్రోల్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. అర్ధరాత్రి 12.30 సమయంలో మంటలు లేచి భవనం మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఆ సమయంలో భవనంలో ఎవరూ లేరు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులు పరుగులు తీసి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.

సమస్తం బుగ్గి

తక్షణం అగ్నిమాపకసిబ్బంది చేరుకుని అతికష్టం మీద మంటలను ఆర్పివేశారు. అప్పటికే మంటల ధాటికి ఐటీ కంపెనీ, ఫర్నిచర్ షాప్, కోచింగ్ సెంటర్‌లోని కంప్యూటర్లు, ఇతర సామగ్రి బూడిదై కోట్లాది రూపాయల నష్టం సంభవించింది. ఏ అంతస్తులోని ఆఫీసు కూడా మిగల్లేదు. ఫర్నిచర్ షాపులోని చెక్క, ప్లాస్టిక్ సామగ్రి అంటుకుని మంటలు మరింత ఉజ్వలంగా ఎగిశాయి. షార్ట్ సర్క్యూట్ కారణమని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీపావళి టపాసులు పేలి కూడా మంటలు వచ్చి ఉండవచ్చని అనుమానాలున్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు. భవన యజమాని శంకర్ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి భవనాన్ని లీజుకు ఇచ్చాను, అగ్ని ప్రమాదం వల్ల నాకు రూ.7 కోట్ల వరకూ నష్టం వచ్చిందని వాపోయాడు. మంటల వల్ల భవనం పనికి రాకుండా పోయింది. మిగతా మూడు సంస్థల నష్టం కలిపితే మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా.

బోనులో చిక్కిన చిరుత



తుమకూరు: మూడు రోజుల క్రితం ఓ బాలికపై దాడి చేసి గాయపరచిన చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. వివరాలు... తుమకూరు తాలూకా చిక్కబెళ్లావిలో ఇంటి ముందు ఆడుకుంటున్న బేబినా అనే బాలికపై చిరుత దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి రాగానే చిరుత పారిపోయింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు చిరుత కోసం బోను ఏర్పాటు చేశారు. ఆహారం కోసం వచ్చిన బోనులో చిక్కింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పట్టుబడిన మరో చిరుత

మైసూరు: మైసూరు జిల్లా కేఆర్ నగర తాలూకా అటవీ సమీపంలోని అత్తికుప్పె గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. గ్రామ పరిసరాల్లో తిరుగుతూ గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది బోను ఏర్పాటు చేయగా ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది.

నేడు బన్నేరుఘట్ట జూ పార్కుకు సెలవు లేదు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని ప్రసిద్ధి బన్నేరుఘట్ట ఉద్యానవనం నేడు మంగళవారం కూడా తెరిచి ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం బన్నేరుఘట్ట ఉద్యానవనం సాధారణ సెలవు ఉంటుంది. అయితే దీపావళి సందర్భంగా శనివారం నుంచి వరుస సెలవులు ఉండటంతో బన్నేరుఘట్ట జూకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో మంగళవారం సెలవు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మరుసటి రోజు బుధవారం ఉద్యానవనానికి సెలవు ప్రకటించారు.

మట్టి ప్రమిదలకు భారీ డిమాండ్



తుమకూరు: వెలుగు పూల పండుగ దీపావళి సందర్భంగా మట్టి ప్రమిదలకు భారీ డిమాండ్ ఏర్పడింది. తుమకూరు నగరంలోని హొరపేటె, నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న మార్కెట్లలో పెద్ద ఎత్తున మహిళలు మట్టి దీపాలు కొనుగోలు చేశారు.

బనశంకరి సన్నిధిలో దీపోత్సవం





ప్రత్యేక అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్, ఆలయంలో దీపాల వెలుగులు

బనశంకరి: వెలుగు పూల పండుగ దీపావళి సందర్భంగా బనశంకరీదేవి సన్నిధిలో దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీపావళి పండుగ నేపథ్యంలో ఆదివారం వేకువ జామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీ దేవికి అర్చనలు, అభిషేకం చేపట్టి అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. దీపోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్, ఆలయ ఈఓ లక్ష్మీ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీపోత్సవంతో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక శోభ సంతరించుకుంది.

దొడ్డలో బీజేపీ కరువు అధ్యయనం



పంటలను పరిశీలిస్తున్న బీజేపీ కరువు అధ్యయన బృందం

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో బీజేపీ ఆధ్వర్యంలో కరువు అధ్యయనం బృందం పర్యటించింది. సోమవారం తాలూకాలోని హారోహళ్లి, చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించిన బీజేపీ కరువు అధ్యయన బృందం పంటలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షాభావం, పంటలు ఎండిపోయి ఎంతమేర నష్టం జరిగిందో రైతులు వివరించారు. ఎమ్మెల్సీ కోటా శ్రీనివాసపూజారి ఆధ్వర్యంలోని కరువు అధ్యయన బృందం చివరగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సంబంధిత అధికారులతో కరువుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించి రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి అరికెరె వార్డు మైకో లేఔట్‌లో బెంగళూరు నగర జల మండలి ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పురుషోత్తం (రవి), నగరసభ మాజీ సభ్యుడు మురళీధర్, స్థానిక బీజేపీ నాయకులు, మైకోలేఔట్ అసోషియేషన్ సభ్యులు, జల మండలి అధికారులు, ఇంజనీరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిరాతకం

- ఫొటోలు తీసి వాట్సాప్‌లో పంపలేదని యువకుడి హత్య
- డాబా వద్ద యువకుల దారుణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మల్లికార్జున



హతుడు సూరి

దొడ్డబళ్లాపురం: డాబా వద్ద యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఒక యువకుడు కత్తి పోట్లకు గురై మృతి చెందిన ఘటన దొడ్డ తాలూకా రామేశ్వరగేట్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దొడ్డ పట్టణ పరిధిలోని కచేరి పాళ్యకు చెందిన సూరి ఆలియాస్ సూర్య (21) హత్యకు గురైన యువకుడు. హతుడు కొడిగేహళ్లిలోని ఆర్‌ఎల్ జాలప్ప కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. ఫోటోగ్రఫీ ప్రవృత్తిగా చేసుకుంటున్న సూరి ఆదివారం ఒక ప్రీవెడ్డింగ్ షూట్ చేసి సాయంత్రం స్నేహితులతో కలిసి దాబస్‌పేట హైవే పక్కన రామేశ్వరగేట్ వద్ద ఉన్న ఏ డార్క్ ఫ్యామిలీ డాబాకు వచ్చాడు. డాబా బయట స్నేహితులకు ఫొటోలు తీస్తుండగా దొడ్డ తాలూకా కుంటనహళ్లికి చెందిన దిలీప్, అతడి స్నేహితులు అప్పుడే పీకల దాకా మద్యం తాగి డాబాలో నుండి బయటకు వచ్చారు. తమకూ ఫోటోలు తీయమని బెదిరించారు. ఫోటోలు తీయగా వెంటనే తమ మొబైళ్లకు వాట్సాప్ చేయాలని కోరారు. అయితే కెమెరా నుండి పంపించడం సాధ్య కాదని సూరి చెప్పడంతో గొడవపడ్డారు. కెమెరా లాక్కుని దాడికి పాల్పడ్డారు. క్రమంలో పరస్పరం దాడి చేసుకోగా మద్యం మత్తులో ఉన్న దిలీప్ తన వద్ద ఉన్న కత్తితో సూరి గుండెల్లో పొడిచాడు. వెంటనే సూరిని ఆస్పత్రికి తరలించినప్పటికీ అధిక రక్తస్రావంతో మృతి చెందాడు. ఘటనకు సంబంధించి దిలీప్‌పై దొడ్డబెళవంగల పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. సంఘటన జరిగిన డాబాను ఎస్పీ మల్లికార్జున పరిశీలించారు.

పాతకక్షలతో యువకుడి హత్య



హత్యకు గురైన పూజారి (ఫైల్)

యశవంతపుర: పాతకక్షలతో యువకుడిని హత్య చేసిన ఘటన ఆదివారం రాత్రి బెళగావి జిల్లా గోకాక్ నగరంలో జరిగింది. గోకాక్ పట్టణం ఆది జాంబవ నగరలో నివాసం ఉంటున్న శానూరు పూజారి (27) హత్యకు గురయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన యువకుడి ఇంటిపై మృతుడి బంధువులు రాళ్ల దాడి చేసి బైకు, కారును ధ్వంసం చేశారు. ఒక్కసారిగా కాలనీలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గోకాక్ పోలీసులు భద్రత కల్పించారు.

వ్యక్తి అరెస్ట్

విద్యార్థులకు ఎండిఎంఎని అమ్ముతున్న వ్యక్తిని మంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉళ్లాల తాలూకా హరేకళకు చెందిన హసైనార్ అలియాస్ అచ్చు (32)ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళూరు నగరంలోని పడీల్ ప్రాంతాలలో ఎండీఎంఎ అమ్ముతున్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి 12 గ్రాముల ఎండీఎంఎ, రూ.60 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. మంగళూరు దక్షిణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పర్షియన్ పిల్లి అపహరణ, కేసు నమోదు

శివాజీనగర: బెంగళూరు కోరమంగలలో పిల్లి అపహరణపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 6న రాత్రి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి తన ఇంటిలో ఉన్న పర్షియన్ జాతికి చెందిన పిల్లిని దొంగలించారని 8వ బ్లాక్ నివాసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిల్లి ఆచూకీ కనుగొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ సీ.కే బాబా తెలిపారు.

కన్నుల పండువగా కేదారేశ్వర వ్రతం



కేదారేశ్వర వ్రతం గురించి వివరిస్తున్న అర్చకులు

బనశంకరి: యలహంక చౌడేశ్వరిదేవి సన్నిధిలో కేదారేశ్వరవ్రతం కన్నుల పండువగా ఆచరించారు. దీపావళి సందర్భంగా సోమవారం యలహంకలోని చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో యలహంక వాసులు కేదారేశ్వరవ్రతం (నోములు పండుగ)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం వ్రతం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పదాధికారులు పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హోసూరు వార్తలు..

ఏనుగును చంపిన కేసులో మరో వ్యక్తి అరెస్ట్

కెలమంగలం: జవళగిరి అటవీ ప్రాంతంలో నాటు తుపాకీతో ఏనుగును చంపిన ఘటనలో పరారీలో ఉన్న మరో నిందితున్ని తళి పోలీసులు అరెస్ట్ చేశారు. జవళగిరి సమీపంలోని షణ్మాళం అటవీ ప్రాంతంలో గత నెల 29వ తేదీ ఏనుగును కాల్చి చంపినట్లు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీ సిబ్బంది, తళి పోలీసులు, పశువైద్యులతో ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన ఏనుగు కళేబరానికి పరీక్షలు నిర్వహించి అక్కడే ఖననం చేశారు. తళి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేయగా షణ్మాళం గ్రామానికి చెందిన రైతు ముత్తుమల్లేష్, కర్ణాటక రాష్ట్రం కనకపుర తాలూకా కాడుశివనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసమూర్తి కలిసి రాగి పంటలపై దాడి చేస్తున్న ఏనుగును నాటుతుపాకీతో కాల్చిచంపినట్లు తెలిసింది. ముత్తు మల్లేష్‌ను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న శ్రీనివాసమూర్తిని ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు.

కందషష్టి ఉత్సవం ప్రారంభం



విశేష అలంకరణతో వేల్‌మురుగన్ మూలవిరాట్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధి పెరియార్ నగర్‌లో వెలసిన ప్రసిద్ధి పొందిన వేల్‌మురుగన్ ఆలయంలో సోమవారం నుంచి కందషష్టి ఉత్సావాలు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో సోమవారం ఉదయం కలశ స్థాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబ్రమణ్య సహస్ర నామం, నవయాగశాల పూజలు, పూర్ణాహుతి, దీపారాధన తదితర కార్యక్రమాలను ఆరు రోజుల పాటు అనుసరిస్తున్నట్లు, సూరసంహారంతో కార్యక్రమం ముగుస్తుందని ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం ప్రారంభమైన కార్యక్రమంలో మురుగన్ మూలవిరాట్‌ను అభిషేకించి విశేష పూజలు జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు కానుకలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ బహుమతులను అందజేశారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ, కలుషితాలను తొలగించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక్క పారిశుధ్య కార్మికుల వల్లనే సాధ్యమని ప్రశంసించారు. హోసూరు జనాభా పెరగడం వల్ల పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఎన్.ఐఎస్.మాదేశ్వరన్, రవి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో మహిళ మృతి



మృతురాలు మాదేవమ్మ (ఫైల్)

హోసూరు: హోసూరు సమీపంలో పట్టా భూమిని ప్రభుత్వం స్వాధీనపరుచుకొని ఆదిద్రావిడ కుటుంబాలకు ఇండ్ల స్థలాలు అందించడాన్ని వ్యతిరేకిస్తూ పురుగుల మందు తాగిన ముగ్గురిలో మహిళ మృతి చెందగా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు సూళగిరి తాలూకా శానమావు గ్రామానికి చెందిన కరియప్పకు చెందిన పట్టా భూమిని గత కొన్ని సంవత్సరాల క్రితం అధికారులు స్వాధీనపరుచుకొని గిరిజన ప్రజలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. తమ భూమిని పంచడాన్ని వ్యతిరేకిస్తూ కరియప్ప కొడుకులు మురుగేష్ (38), మంజునాథ్ (34), కూతురు మాదేవమ్మ (32)లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మరోవైపు గత 8వ తేదీ గిరిజన సంక్షేమ శాఖాధికారి, రెవెన్యూ శాఖాధికార్లు, సర్వేయర్లతో ఘటనా స్థలానికి చేరుకొని గిరిజనులకు అందజేసిన స్థలాలను సర్వేచేయడానికి యత్నించగా వారు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఉద్దనపల్లి పోలీసులు వీరిని చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. చికిత్స ఫలితంలేక సోమవారం మాదేవమ్మ మృతి చెందింది. మంజునాథ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత బంధువులు ఆందోళన చేపట్టారు.

భారీగా పోలీసు భద్రత

క్రిష్ణగిరి: బంధువులు హోసూరు- రాయకోట రోడ్డు శ్యానమావు వద్ద రోడ్డుపై శవాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. దీంతో శ్యానమావు గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో సూళగిరి డీఎస్పీ మురళి నేతృత్వంలో పెద్దసంఖ్యలో పోలీసులు చేరుకొన్నారు. ప్రభుత్వ అధికార్ల నిర్లక్ష్యం వల్ల ఆస్తిని పోగొట్టుకోవడంతో పాటు ఆత్మహత్యలు చేసుకోవలసిన దుస్థితి దాపురించిందని బంధువులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గొడవలు జరగకుండా గ్రామంలో పోలీసులు మోహరించారు. స్థానిక కౌన్సిలర్ సంపంగి ఆందోళన కారులతో మృతదేహాన్ని తీయించారు.



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు



గ్రామంలో పోలీసులు

గొర్రెల అపహరణ

హోసూరు: డెంకణీకోట తాలూకా తళి సమీపంలో కొట్టంలో కట్టేసిన 30 గొర్రెలను గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటనపై బాధితుడు తళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... తళి సమీపంలోని ఆచుబాళం గ్రామానికి చెందిన సంపంగి(50), అమరావతి (42) దంపతులు పశువులు, గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. నివాసముంటున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇంటిని తొలగించి నిర్మాణ పనులు చేపడుతున్నారు. సాకుతున్న గొర్రెలను బంధువుకు చెందిన కొట్టంలో ఉంచుతున్నారు. ఆదివారం మేతకు తీసుకెళ్లి తిరిగి కొట్టంలో ఉంచారు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా గొర్రెలు కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు.

ఏనుగుల వలసలు ప్రారంభం

- అటవీ ప్రాంత గ్రామాల్లో గుబులు



డెంకణీకోట అటవీ ప్రాంతంలో ఏనుగులు (ఫైల్)

కెలమంగలం: బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి డెంకణీకోట అటవీ ప్రాంతానికి 30 వలస ఏనుగులు చేరుకోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి జవళగిరి అడవులకు 150కి పైగా ఏనుగులు డెంకణీకోట, ఉడేదుర్గం, శ్యానమావు, ఏ.శెట్టిపల్లి అటవీ ప్రాంతాల మీదుగా వస్తాయి. మాలూరు, ఆంధ్ర సరిహద్దు కుప్పం ప్రాంతాలకు వరకూ వలస వెళ్తాయి. అందులో భాగంగా ఈ ఏడు 30 ఏనుగులు రెండు గుంపులుగా విడిపోయి డెంకణీకోట అటవీ ప్రాంతంలో 10 ఏనుగులు, ఉడేదుర్గం అటవీ ప్రాంతంలో 20 ఏనుగులు మకాం వేశాయి. ఈసారి సక్రమంగా వర్షాలు లేక పంటలు అరకొరగా పెరిగాయి. పొలాల్లో రాగి, జొన్న, కంది తదితర పంటలు ఉన్నాయి, ఏనుగులు ఆ పంటపొలాలపై దాడులు చేస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. ఏనుగులను అటవీశాఖాధికారులు దూరంగా మళ్లించాలని కోరారు.

క్లుప్తంగా...

నేడు అల్పపీడనం!

- 16న వాయుగుండంగా మారే అవకాశం
- నేడు, రేపు సీమ, దక్షిణ కోస్తాలకు భారీ వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 16వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే రాష్ట్రంపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. కాగా.. మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అలాగే బుధవారం తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు, కూలీలు, పశువుల కాపరులు, రైతులు ఆరు బయట ఉండరాదని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల వా రు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది.

లంక భూములు గట్టెక్కాయి

((బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు నుంచి సాక్షి ప్రతినిధి బి.ఫణికుమార్))

ఇది నిన్న, మొన్నటిది కాదు.. కొన్ని దశాబ్దాలు, తరాల సమస్య. గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతాల్లో లంక భూములను సాగు చేసుకుంటున్న రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఏడాదికి మూడు పంటలు పండే ఈ భూములు ఎంతో విలువైనవి. అయితే వాటికి కాగితాలు, పాస్ బుక్‌లు లేకపోవడంతో రైతులు చాలా కష్టాలు ఎదుర్కొన్నారు. వ్యవసాయ రుణాలు, రైతులకు అందే ఇతర ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు లభించేవి కావు. తమ సమస్యను పరిష్కరించాలని రైతులు దశాబ్దాల నుంచి ప్రజాప్రతినిధులను, అధికారులను కలుస్తూనే ఉన్నారు. అయితే ప్రయోజనం శూన్యం. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక లంక రైతుల సమస్యపై దృష్టి సారించింది. మొత్తం 8 జిల్లాల్లో ఏకంగా 9,062 ఎకరాలకు పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ప్రభుత్వ నిర్ణయంతో 17,768 మంది లబ్ధిదారుల కుటుంబాల్లో వెలుగులు ప్రసరించనున్నాయి. వీరు సాగుచేసుకుంటున్న భూములకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ నెల 17న పట్టాలివ్వనున్నారు. సాక్షి బృందం బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని దోనేపూడి, జువ్వలపాలెం, సుగ్గునలంక, చింతల్లంక, చిలుమూరు లంక, వెల్లటూరు, పెదపులివర్రు, పెదలంక, ఓలేరు తదితర లంక గ్రామాల్లో పర్యటించినప్పుడు అక్కడి రైతులు ఇన్నేళ్లుగా తాము పడిన బాధలను పంచుకున్నారు. తమ జీవితకాలంలో ఈ సమస్య పరిష్కారమవుతుందని అనుకోలేదని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దీన్ని సులువుగా పరిష్కరించారని కొనియాడారు. ఆయన మేలును మరిచిపోలేమని భావోద్వేగానికి గురయ్యారు. దళితులంటే ఆయనకు ఎంత అభిమానమో లంక భూముల సమస్య పరిష్కారంలోనే అర్థమవుతోందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా ఒక్క కొల్లూరు మండలంలోనే 710 మంది రైతులకు 295 ఎకరాలకు సంబంధించి సీఎం వైఎస్ జగన్ పట్టాలు అందించనున్నారు.

జిల్లాలవారీగా పట్టాలిచ్చే లంక భూములు, లబ్ధిదారుల వివరాలు..

జిల్లా	పట్టాలిచ్చే భూములు	లబ్ధిదారులు (ఎకరాల్లో)
కృష్ణా	3,570.80	6,163
బాపట్ల	1,010.18	1,401
ఎన్టీఆర్ డా. బీఆర్ అంబేడ్కర్	985.26	1,333
కోనసీమ	984.41	3,003
తూర్పుగోదావరి	919.90	3,172
పశ్చిమగోదావరి	836.16	1,181
పల్నాడు	507.80	1,116
గుంటూరు	247.88	399
మొత్తం	9,062.39	17,768



చింతల్లంక గ్రామంలోని లంక భూములు

లంక భూముల కథ ఇది..

కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో ఒండ్రు మట్టి ఒక చోటకు చేరడంతో ఏర్పడ్డ సారవంతమైన భూములే.. లంక భూములు. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో తరతరాలుగా రైతులు వాటిని సాగు చేసుకుంటున్నారు. అయితే ఈ భూములకు సంబంధించి వేలాది మంది రైతులకు పట్టాలు లేవు. తమకు పట్టాలు ఇవ్వాలని కొన్ని దశాబ్దాలుగా అక్కడి రైతులు ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం శూన్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు సిద్ధమైంది. వివాదాల్లేకుండా సాగు చేసుకుంటున్న అర్హులకు పట్టాలు ఇచ్చేందుకు వీలుగా లంక భూముల అసైన్డ్ నిబంధనలు సవరించింది. ఈ భూములను మూడు కేటగిరీలుగా గతంలోనే విభజించింది. గట్టుకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఏ కేటగిరీగా, ఏ కేటగిరీకి ఆనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి కేటగిరీగా, ఏ, బీ కేటగిరీకి ఆనుకుని వరదలు వస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సీ కేటగిరీగా వర్గీకరించింది. ఏ, బీ కేటగిరీ భూములకు పట్టాలు, సీ కేటగిరీ భూములకు లీజు పట్టాలు ఇవ్వనుంది.

మా ఇంటికి వెలుగు తెచ్చారు..



50 ఏళ్లకు ముందు నుంచి ఎకరం భూమిని లంకలో సాగు చేసుకుంటున్నాం. కానీ కాగితాల్లో మాత్రం అది మా భూమి కాదని ఉంది. దానిపై కనీసం బ్యాంకు రుణం ఇమ్మన్నా ఇచ్చేవారు కాదు. ప్రజాప్రతినిధులను, అధికారులను ఎన్నోసార్లు కలిసి న్యాయం చేయాలని అడిగినా పట్టించుకోలేదు. ఇప్పుడు జగనన్న వచ్చాక మా ఇంటికి వెలుగు తెచ్చారు. మా భూమికి పట్టా ఇస్తున్నారు.

– తోదేటి రత్నాకరరావు, చింతల్లంక, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా

నాలాంటి ఎంతోమంది కష్టాలను తీర్చారు..



నాకున్న ఎకరం భూమికి కాగితాలు, పాస్‌బుక్‌లు ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు జగనన్న నా భూమికి పట్టా ఇస్తున్నారు.. ఎంతో ఆనందంగా ఉంది. లంకల్లో నాలాంటి ఎంతో మంది కష్టాలను తీరుస్తున్నారు. ఆయన మేలు మర్చిపోలేం

– ఈపూరి ఏబేలు, చింతల్లంక, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా

ఎప్పటికీ మా బాధ తీరదనుకున్నాం..



మేం సాగు చేసుకుంటున్న లంక భూములంటే అందరూ చిన్నచూపు చూసేవారు. ఎంతో విలువైన భూమి ఉన్నా దానికి కాగితాలు లేవు. ఎప్పటికీ మా బాధ తీరదనుకున్నాం. జగన్ సీఎం అయ్యాకే లంక భూముల సమస్యపై దృష్టి పెట్టారు. ఆయన వచ్చినప్పటి నుంచి మా సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకం ఉండేది. మేం ఆశించినట్లుగానే ఎవరూ చేయని పనిని ఆయన చేసి మాకు న్యాయం చేశారు.

– బొజ్జా రమేశ్, వెల్లటూరు, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

పేదల దేవుడినని నిరూపించారు..



మేం జీవించి ఉండగా ఈ సమస్య పరిష్కారమవుతుందని అనుకోలేదు. ఇంత క్లిష్టమైన సమస్యను సీఎం జగన్ చాలా తేలిగ్గా పరిష్కరించారు. లంక భూములకు దారి చూపించి తాను పేదల దేవుడినని నిరూపించారు.

– ఏలూరి శేషగిరిరావు, వెల్లటూరు, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

అమెరికా చదువుల్లో అగ్రపథం

సాక్షి, అమరావతి: అమెరికా చదువుల్లో భారతీయ విద్యార్థులు సరికొత్త రికార్డ్ నెలకొల్పారు. గ్రాడ్యుయేషన్ కోసం అగ్రరాజ్యం వెళుతున్న విదేశీయుల్లో భారతీయ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అమెరికా విద్యా సంస్థల్లో చేరిన విదేశీయుల్లో మన విద్యార్థులు తొలిసారిగా చైనాను అధిగమించారు. 2022 – 23లో ఏకంగా 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికా విద్యా సంస్థల్లో చేరడం విశేషం. గతేడాది కంటే 35 శాతం అధికంగా ప్రవేశాలు పొందారు. ఈమేరకు అమెరికా విద్య, సాంస్కృతిక శాఖకు చెందిన 'ఓపెన్ డోర్స్' విదేశీ విద్యార్థుల గణాంకాలతో సోమవారం విడుదల చేసిన 2022-23 నివేదికలో ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది.

25 శాతానికిపైగా మన స్టూడెంట్లే

- 2021-22లో భారతీయ విద్యార్థులు 1,99,182 మంది అమెరికా విద్యా సంస్థల్లో చేరారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 16 శాతం మంది, గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 62.6 శాతం మంది, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ) కోర్సుల్లో 1.3 శాతం మంది విద్యార్థులు అధికంగా అక్కడ ప్రవేశాలు పొందారు.
- 2022-23లో అమెరికా విద్యా సంస్థల్లో చేరిన విదేశీ విద్యార్థుల్లో 25 శాతానికి పైగా భారతీయులే కావడం విశేషం.
- ఈ ఏడాది అమెరికా విద్యా సంస్థల్లో పది లక్షల మంది విదేశీ విద్యార్థులు చేరగా వారిలో 2.68 లక్షల మంది భారతీయ విద్యార్థులే ఉన్నారు.
- 2009-10 తరువాత తొలిసారిగా 2022-23లో చైనా కంటే భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు.
- 2009-10లో పోలిస్తే అమెరికాలో భారతీయ విద్యార్థులు 65 శాతం పెరిగారు.

హైదరాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం

▶ మొదటి పేజీ తరువాయి

అగ్నిమాపక సిబ్బంది కాపాడారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో హార్డ్‌వేర్ గోదాం

బజార్ ఘాట్‌కు చెందిన రమేష్ జైశ్వాల్‌కు స్థానికంగా బాలాజీ రెసిడెన్సీ పేరుతో అపార్ట్‌మెంట్ ఉంది. నగర శివార్లలో ప్లాస్టిక్ పరిశ్రమ ఉన్న రమేష్ జైస్వాల్ నీలోఫర్ ఆస్పత్రి రోడ్డులో బాలాజీ హార్డ్‌వేర్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. తన పరిశ్రమకు, దుకాణానికి సంబంధించిన రసాయనాలు, వస్తువులను నిల్వ చేయడానికి బాలాజీ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్‌ను గోదాముగా మార్చుకున్నాడు. ఇందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఇందులో ఫైబర్ ఎయిర్ కూలర్ల బాడీలు తయారీకి వినియోగించే బెంజైల్ నైట్రేట్ (మిథైల్ బెంజిన్) టిన్నులు, గేట్లకు వాడే ప్లాస్టిక్ షీట్లు (పాలీ షీట్లు), ప్లాస్టిక్ కార్పెట్లతో పాటు వీటిని అతికించడానికి ఉపకరించే రెజిన్ రసాయనం డ్రమ్ములు నిల్వ ఉంచాడు. వీటితో పాటు ప్రింటింగ్ ప్రెస్‌లకు సరఫరా చేసే సామగ్రి కూడా దాచాడు. సమీపంలోని ఇంకో అపార్ట్‌మెంట్ వద్ద కూడా ఇలాంటిదే మరో గోదాం ఉంది. ఉదయం 9.15 సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. నిప్పు రవ్వలు పాలీ షీట్లపై పడటంతో మంటలు చెలరేగాయి. తర్వాత రసాయనాలకు సైతం అంటుకోవడంతో పెద్దఎత్తున మంటలతో పాటు పొగ, విష వాయువులు వెలువడ్డాయి. మంటలు రోడ్డుపై ఉన్న వాహనాలకు అంటుకున్నాయి.

రెండు, మూడు అంతస్తుల్లో ప్రాణ నష్టం

మొదటి అంతస్తులో నివసిస్తున్న కుటుంబాలు మంటలు గమనించి అప్రమత్తమై కిందికి వచ్చేశాయి. కొద్దిసేపటికే మంటలు, పొగ రెండు, మూడు, నాలుగు అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో నాలుగో అంతస్తులో ఎవరూ లేరు. రెండో అంతస్తులో నివసించే మహ్మద్ ఆజం (58), ఆయన భార్య రెహానా సుల్తానా (50), కుమారుడు హసీబ్ ఉర్ రెహ్మాన్ (32), చిన్న కుమార్తె ఫైజా సమీన్ (26), పెద్ద కుమార్తె తహోరా ఫరీన్ (35), ఈమె కుమార్తెలు తోబా (6), తరోబాలతో (13) పాటు మూడో అంతస్తులో నివసించే మహ్మద్ జకీర్ హుస్సేన్ (66), ఆయన భార్య నిఖత్ సుల్తానా (55) పొగ పీల్చడంతో అపస్మారక స్థితికి చేరుకుని మంటలు అంటుకోవడంతో మరణించారు. మరో 21 మందిని అగ్నిమాపక శాఖ అధికారులు రక్షించారు. వీరిలో కొందరికి కాలిన గాయాలయ్యాయని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెబుతున్నారు. తల్హా (19) అనే యువతి 75 శాతం కాలిన గాయాలతో ఉస్మానియాలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, తలసాని, మహమూద్ అలీ తదితరులు సందర్శించారు.

ఓట్ల కోసం బంగారు కోట కూడా కట్టిస్తామంటారు

కాంగ్రెస్ అంతటి హామీలు ఇవ్వగలదు • ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ఎద్దేవా



బర్వానీ/ముంగేలీ/మహాసాముండ్: మధ్యప్రదేశ్‌లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతటి అసాధ్యమైన హామీలనైనా గుప్పించగలదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. రాజస్తాన్‌లో 2022లో ఉదయ్‌పూర్ పట్టణంలో దర్జీ కన్హయ్య లాల్‌ను దుండగులు తల నరికిన ఘటనను ప్రధాని గుర్తుచేశారు. ''తల తీసేయండి అనే దారుణ నినాదాలు దేశంలో ఏనాడైనా విన్నామా? రాజస్తాన్‌లో కాంగ్రెస్ అసమర్థ పరిపాలన వల్లే ఇలాంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో హింస, లూటీలు పెరిగాయి. అక్కాచెల్లెళ్లు, కూతుళ్లపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. మధ్యప్రదేశ్‌లోనూ అంతే. బీజేపీ వచ్చాకే ఇవన్నీ ఆగిపోయాయి. గతంలో చక్కగా ఉన్న రాష్ట్రాలు సైతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రభను కోల్పోయాయి''అని మోదీ ఆరోపించారు. 'ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పెద్దలు బంగారంతో కోట కట్టిస్తామని కూడా హామీ ఇస్తాగలరు. బంగాళాదుంపల నుంచి తీసిన బంగారంతోనే ఈ కోట కట్టామంటారు'అని మోదీ ఎద్దేవాచేశారు. 'బంగాళాదుంపల నుంచీ అతి స్వల్పమొత్తంలో బంగారాన్ని తీయొచ్చు'అని 2017లో రాహుల్ గాంధీ అన్న మాటలను మోదీ ఉటంకించారు.

బఘేల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది..

ఛత్తీస్‌గఢ్‌లోని ముంగేలీ, మహాసాముండ్ జిల్లాల్లోనూ మోదీ ప్రచారం చేశారు. 'ఛత్తీస్‌గఢ్‌ను లూటీ చేసి తమ ఖజానాతో నింపుకోవడమే కాంగ్రెస్ పని. ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కంటే కూడా ఆయన కుమారుడు, ఇతర ఉన్నతాధికారులు 'సూపర్ సీఎం'గా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని నాశనం చేశారు. టీఎస్ సింగ్ దేవ్‌కూ సీఎం పదవి కట్టబెడతామని పార్టీ మాటిచ్చి మోసం చేసింది. రాష్ట్ర ప్రజల్నీ అలాగే మోసగిస్తుంది. ఈసారి పఠాన్ నియోజకవర్గంలో స్వయంగా సీఎం ఓడిపోతారని నా ఢిల్లీ స్నేహితులు చెప్పారు. ఇక్కడ తమ పని అయిపోయిందని కాంగ్రెస్‌కు తెలుసు''అని మోదీ వ్యాఖ్యానించారు.

రోడ్లు లేక, అభ్యర్థులు రాలేక.. ఆ ఊళ్లో ఎన్నికల సందడే లేదు!

అలిరాజ్‌పూర్: మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల సందడి పీక్స్‌కు చేరింది. పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. తమకే ఓటేయాలంటూ అభ్యర్థులు జనంలో కలియదిరుగుతున్నారు. పోలింగ్‌కు మరో ఐదు రోజులే ఉంది. కానీ అలిరాజ్‌పూర్ జిల్లాలోని జందానా గ్రామంలో మాత్రం అసలు ఎన్నికల సందడే కనిపించడం లేదు! ఎందుకంటే ఈ ఊరు దూరంగా విసిరేసినట్లు మారుమూలన ఉంటుంది. ఇక్కడికి చేరాలంటే నాటు పడవలే దిక్కు. జిల్లా కేంద్రమైన అలిరాజ్‌పూర్ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జందానాలో 763 మంది ఓటర్లున్నారు. అంతా గిరిజనులే. భిలీ భాష మాట్లాడుతారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలంటే ఏమిటో కూడా వారికి తెలియదు. నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ డ్యామ్ వెనకతట్టు జలాల్లో జందానా ఉంటుంది. డ్యామ్ రాకతో ఊరు చాలావరకు మునిగిపోయింది. గిరిజనులు తప్ప ఇతరులంతా వలస వెళ్లారు. ఇక్కడ ఎన్నికలు నిర్వహించాలంటే పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రి చేతబట్టి పడవల్లో, కాలినడకన రావాల్సిందే. పైగా దారంతా రాళ్లు రప్పలే. అందుకే అభ్యర్థులెవరూ ఇక్కడ ప్రచారానికి రావడమే లేదు. జందానా విలేజ్ ఎస్టీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానమైన అలిరాజ్‌పూర్ పరిధిలోకి వస్తుంది. బీజేపీ నుంచి నాగర్‌సింగ్ చౌహాన్, కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముకేశ్ పటేల్ పోటీ చేస్తున్నారు. తమ గ్రామానికి కనీసం రోడ్డు వేయాలని దశాబ్దాలుగా వేడుకుంటున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని జందానావాసులు వాపోతున్నారు.

పంచతంత్రం

కుల గణితంలో... హస్తవ్యస్తమే..!

- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు దూరమైన అగ్రకులాలు
- బీజేపీ వైపే బ్రాహ్మణ, రాజ్‌పుత్, క్షత్రియ వర్గాలు
- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు
- ఆ వర్గాల్లోనూ బీజేపీకి గట్టి ఓటు బ్యాంకు



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ అసెంబ్లీ ఎన్నికల పోరు సాగుతున్న మధ్యప్రదేశ్‌లో కులాల కుంపట్లు హస్తం పార్టీకి ప్రతికూలంగా మారేలా కన్పిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగల అగ్రకులాలు అండగా లేకపోవడం కాంగ్రెస్‌కు ఈసారీ నష్టం చేస్తుందంటున్నారు. వారి మద్దతు కూడగట్టుకునేందుకు పార్టీపరంగా పెద్దగా ప్రయత్నాలు కూడా జరగడం లేదు. దాంతో ఈసారి కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనే ప్రధానంగా ఆధారపడాల్సిన పరిస్థితి! సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా బీజేపీలోకి ఫిరాయించిన తర్వాత ఉన్నత వర్గాలను ఆకట్టుకునేలా చర్యలేవీ లేకపోవడం కూడా కాంగ్రెస్ విజయావకాశాలను ప్రభావితం చేసేలా కన్పిస్తోంది...

అగ్రకులాలు.. గట్టి శక్తే

- మధ్యప్రదేశ్ జనాభాలో అగ్ర కులాలు 14 శాతం వరకు ఉన్నాయి.
- వీరిలో 6 శాతం బ్రాహ్మణులు, 5.8 శాతం రాజపుత్రులు 2.5 బనియాలున్నారు.
- రాష్ట్రంలో 10కి పైగా జిల్లాల్లో ఏకంగా 80కి పైగా అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను అగ్రవర్ణాల ఓట్లు గట్టిగా ప్రభావితం చేయగలవు.
- గ్వాలియర్, నర్సింగఢ్, రేవా, సారన్‌గఢ్, కంకేర్ ప్రాంతాల్లో అగ్రకులాలదే ఆధిపత్యం.
- ఇక మధ్యప్రదేశ్‌లో ఓబీసీలు 42 శాతం, ఎస్టీలు 21 శాతం, ఎస్సీలు 14 శాతం దాకా ఉన్నారు.

క్రమంగా దూరం...

- మధ్యప్రదేశ్‌లో అగ్రవర్ణాలన్నీ నిజానికి 2003 వరకు కాంగ్రెస్‌తోనే సాగాయి. ఆ తర్వాత నుంచి పలు కారణాలతో క్రమంగా పార్టీకి దూరమవుతూ వస్తున్నారు...
- రాష్ట్రంలో బీజేపీ హవా పెరుగుతున్న కొద్దీ కాంగ్రెస్‌కు అగ్ర కుల ఓట్లు బాగా తగ్గుతూ వచ్చాయి.

- 1990 వరకు అగ్రకుల ఓట్లలో కాంగ్రెస్ 40 శాతం దాకా రాబడుతూ వచ్చింది.
- 2003 నాటికి ఇది సుమారు 37 శాతానికి పరిమితమైంది.
- 2008లో అగ్రవర్ణ ఓటర్లలో కేవలం 19 శాతం మంది మాత్రమే కాంగ్రెస్‌కు ఓటేశారు. దాదాపు 45 శాతం మందికి పైగా బీజేపీకి జై కొట్టారు.
- 2013లో అగ్ర కుల ఓట్లలో బీజేపీకి 59 శాతం, కాంగ్రెస్‌కు 24 శాతం దక్కాయి.
- 2018లో కాంగ్రెస్ కాస్త మెరుగైన ఫలితాలే సాధించింది. అగ్రవర్ణ ఓట్లలో కాంగ్రెస్ 33 శాతం సాధించింది! అయితే బీజేపీకి ఏకంగా 58 శాతం ఓట్లు పడ్డాయి.

సింధియా నిష్క్రమణతో...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు 15 నెలలకే షాక్ తగిలింది. తనను కాదని కమల్‌నాథ్‌ను సీఎం చేయడంపై ముందునుంచీ తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా అదను చూసి దెబ్బ కొట్టారు. 2020లో ఏకంగా 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరిపోయారు! దాంతో కమల్‌నాథ్ సర్కారు కుప్పకూలడం, శివరాజ్‌సింగ్ చౌహాన్ సీఎంగా బీజేపీ అధికార పగ్గాలు చేపట్టడం చకచకా జరిగిపోయాయి. సింధియా నిష్క్రమణతో అగ్ర వర్ణాలతో కాంగ్రెస్‌కు దూరం మరింత పెరిగింది. వారిని పార్టీకి దగ్గర చేసేందుకు సీనియర్ నాయకుడు దిగ్విజయ్‌సింగ్ చొరవ చూపినా పెద్దగా లాభం లేకపోయింది. ఆయన ప్రయత్నాలకు పార్టీ అధిష్టానం నుంచి పెద్దగా సహకారం కూడా లభించలేదంటారు.

ఆ కులాల మీదే దృష్టి!


- రాష్ట్రంలో 42 శాతానికి పైగా ఉన్న ఓబీసీలు, 35 శాతం దాకా ఉన్న ఎస్సీ, ఎస్టీల ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంటూ వస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ చీఫ్ కమల్ నాథ్ తదితరులు కూడా తమ ఎన్నికల వ్యూహాల్లో అదే చెబుతూ వస్తున్నారు. ఈ సామాజిక వర్గాల ఓట్లమీదే ప్రధానంగా దృష్టి పెట్టాలని అభ్యర్థులకు పదేపదే నొక్కిచెబుతూ వచ్చారు...
- అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బిహార్ తరహాలో కులగణన జరుపుతామని ఇప్పటికే ప్రకటించారు.
- ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చారు.
- ఈసారి ఎన్నికల్లో ఓబీసీలకు 62 టికెట్లు, ఎస్టీలకు 34, ఎస్సీలకు 18 టికెట్లు కాంగ్రెస్ కేటాయించింది.

ఓబీసీల్లోనూ ఈజీ కాదు...!

- అయితే కేవలం ఓబీసీ, ఇతర కులాల దన్నుతో గత ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఓట్లను అధిగమించడం కాంగ్రెస్‌కు అంత సులువు కాదని గణాంకాలు చెబుతున్నాయి...
- 2008 అసెంబ్లీ ఎన్నికల్లో ఓబీసీల్లో బీజేపీ 41% శాతం ఓట్లను సాధించింది. కాంగ్రెస్‌కు దక్కింది 27 శాతమే.
- 2013 ఎన్నికల్లోనూ ఓబీసీ ఓట్లలో కాంగ్రెస్‌కు 35 శాతం రాగా బీజేపీ 44 శాతం ఓట్లు సాధించింది.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి 48 శాతం ఓబీసీ ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 41శాతం వచ్చాయి.
- ఇక ఎస్సీ, ఎస్టీ ఓట్లలోనూ కాస్త అటూ ఇటుగా ఇదే ధోరణి ప్రతిఫలించి.
- ఈ నేపథ్యంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లతోనే గట్టెక్కాలనుకోవడం సాహసమేనని కాంగ్రెస్ వర్గాలే అంటున్నాయి!

అది అవినీతి రాజధాని

బీజేపీపాలిత మధ్యప్రదేశ్‌పై రాహుల్ గాంధీ ఆరోపణ



నీమచ్/హర్దా: ఏళ్లకేళ్లు మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పాలిస్తూ బీజేపీ సర్కార్ ఈ రాష్ట్రాన్ని అవినీతి రాజధానిగా మార్చేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుమ్మెత్తిపోశారు. సోమవారం ఆయన రాష్ట్రంలోని నీమచ్, హర్దా జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ అవినీతికి అంతేలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ' ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయం. మేం గెలిచాక రాష్ట్రంలో కులగణన చేపడతాం' అని వ్యాఖ్యానించారు. 'రూ.500కే ఎల్పీజీ సిలిండర్ సరఫరా చేస్తాం. రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ అమలుచేస్తాం. గోధుమలకు ఇస్తున్న కనీస మద్దతు ధరను రూ.3,000కు పెంచుతాం. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తాం' అని రాహుల్ హామీ ఇచ్చారు. ' 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ బడా పారిశ్రామికవేత్తలతో కలిసి కుట్రతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల పక్షపాత కాంగ్రెస్‌ను పక్కకునెట్టి బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంది' అని ఆరోపించారు.

దోచుకోవడంలో పోటీపడుతున్నారు

వందలకోట్ల నగదు లావాదేవీలపై కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పెద్దకుమారుడు దేవేంద్ర ప్రతాప్ మాట్లాడినట్లు చెబుతున్న రెండు వీడియో క్లిప్‌లపై రాహుల్ స్పందించారు. ' కూర్చున్న చోట నుంచే కోట్లాది రూపాయలు ఎలా దోచేస్తున్నారో తోమర్ కుమారుడి వీడియో చూస్తే ఇట్టే తెలుస్తోంది. దేవేంద్రపై మోదీగానీ, ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు విచారణకు ఆదేశించారా? ఏమైనా చర్యలు తీసుకున్నారా?' అని ప్రశ్నించారు. 'బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులు తక్కువేం కాదు. రైతులు, కార్మికుల సొమ్ము దోచేసేందుకు పోటీపడుతున్నారు' అని అన్నారు. ' అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసేందుకే పెద్ద నోట్లను రద్దుచేశారు. కానీ ఏం సాధించారు? సంపన్నులే బాగుపడ్డారు. నిజానికి పెద్ద పారిశ్రామికవేత్తల కన్నా సమాజంలో చిన్న వ్యాపారులు, వర్తకులే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తారు' అని రాహుల్ అన్నారు. 'మధ్యప్రదేశ్‌లో 500 కర్మాగారాలు కొత్తగా పెట్టామని మోదీ బహిరంగంగా అబద్ధాలు చెబుతున్నారు. నాకైతే నీమచ్ జిల్లాలో ఒక్కటి కూడా కొత్త కర్మాగారం కనిపించలేదు' అని రాహుల్ వివరించారు.

మోదీ చెప్పేది అబద్ధం

'దేశంలో కులం అనేది లేదు. పేదరికం అనే కులం ఒక్కటే దేశాన్ని ఇబ్బందిపెడుతోందని మోదీ పదేపదే అబద్ధాలాడుతున్నారు. కేంద్రస్థాయిలో 93 మంది 'ఉన్నతాధికారులు' ఉంటే వారిలో ఓబీసీ వారు కేవలం 3 శాతమే. ఇక మధ్యప్రదేశ్‌లో అలాంటి 'అధికారులు' 53 మంది ఉంటే అందులో ఓబీసీ వ్యక్తి ఒక్కరే ఉన్నారు. ఇలాంటి అన్యాయాలకు అడ్డుకట్ట వేసి కులగణన చేపట్టి సరైన న్యాయం చేస్తాం'' అని రాహుల్ హామీ ఇచ్చారు.

నేడు చిల్డ్రన్స్ డే

విద్య

బడి రెక్కలతో మళ్లీ బాల్యంలోకి...


● మళ్లీ బడి పిల్లలమై...

ఆ క్లాసురూమ్‌లో చిన్న శబ్దం కూడా పెద్దగా వినిపించేంత నిశ్శబ్దం. స్కూల్ యూనిఫామ్‌లో మెరిసిపోతున్న విద్యార్థులు టీచర్ చెప్పే పాఠాన్ని శ్రద్ధగా వింటున్నారు. పాఠం పూర్తయిన తరువాత 'ఏమైనా డౌట్స్ ఉన్నాయా?' అని టీచర్ అడిగితే ఒక్కొక్కరు తమ డౌట్స్‌ను అడగడం మొదలు పెట్టారు...'ఈ దృశ్యంలో విశేషం ఏముంది... అన్ని స్కూళ్లలో కనిపించేదే కదా' అనే డౌటు రావచ్చు. అయితే ఈ క్లాస్‌రూమ్‌లో కూర్చున్న విద్యార్థులు పిల్లలు కాదు. ముప్పై నుంచి డెబ్బై ఏళ్ల వయసు వరకు ఉన్న మహిళలు. ఏవో కారణాల వల్ల చదువును మధ్యలోనే మానేసిన వీరు 'బ్యాక్-టు-స్కూల్' ప్రోగ్రామ్‌తో మళ్లీ బడిపిల్లలయ్యారు....

దేశంలోనే పెద్దదైన స్వయం సహాయక బృందం 'కుదుంబశ్రీ మిషన్' చదువును మధ్యలోనే మానేసిన మహిళలను తిరిగి స్కూల్‌కు తీసుకువచ్చే విధంగా రెండు నెలల పాటు విస్తృత ప్రచారం చేసింది.

మెసేజ్‌లు, పోస్టర్లు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలోనూ ప్రచారం నిర్వహించింది. వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసింది.

కేరళలోని 14 జిల్లాలలోని రెండువేలకు పైగా స్కూల్స్‌లో తిరిగే స్కూల్ లిల్ (బ్యాక్ టు స్కూల్) కార్యక్రమంలో భాగంగా వందలాది మంది మహిళలు వీకెండ్ క్లాస్‌లకు హాజరవుతున్నారు.

'నా వయసు యాభై సంవత్సరాలు దాటింది. పెళ్లివల్ల పదవతరగతి పూర్తి కాకుండానే చదువు మానేయవలసి వచ్చింది. బ్యాక్ టు స్కూల్ కార్యక్రమంలో భాగంగా వీకెండ్ క్లాస్‌కు హాజరయ్యే ముందు అందరూ నవ్వుతారేమో అనిపించింది. నవ్వడానికి నేను చేస్తున్న తప్పేమిటి? అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఈ క్లాసులకు హాజరవడానికి ముందు మామూలు సెల్‌ఫోన్‌ను ఆపరేట్ చేయడం ఎలాగో నాకు తెలియదు. ఇప్పుడు మాత్రం


● బడిలో 100 సంవత్సరాలు దాటిన బామ్మ... రేహేల్ (మధ్యలో)

డిజిటల్‌కు సంబంధించి చాలా విషయాలు నేర్చుకున్నాను. బ్యాంకు వ్యవహారాల్లో నేర్పు సంపాదించాను. ఒకప్పుడు ఇతరులు ఎవరైనా నాతో వస్తేనే బ్యాంకుకు వెళ్లేదాన్ని. ఇప్పుడు మాత్రం సొంతంగా బ్యాంకింగ్ వ్యవహారాలను చక్కబెడుతున్నాను. సొంతంగా వ్యాపారం మొదలు పెట్టడానికి రెడీ అవుతున్నాను. స్కూల్ ద్వారా ఎన్నో విలువైన సలహాలు తీసుకున్నాను' అంటుంది కొట్టాయం జిల్లాకు చెందిన నీల.

'బ్యాక్ టు స్కూల్' వీకెండ్ క్లాస్‌లు అకడమిక్ పాఠాలకే పరిమితం కావడం లేదు. సుపరిపాలన, స్త్రీ సాధికారత, కష్టాల్లో ఉన్న వారికి కలిసికట్టుగా సహాయం చేయడం... ఇలా ఎన్నో సామాజిక, సేవా సంబంధిత చర్చలు క్లాస్‌రూమ్‌లో జరుగుతుంటాయి. ఈ చర్చలేవీ వృథా పోలేదు అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ఈ క్లాసులకు హాజరవుతున్న ఒక మహిళ భర్తకు కిడ్నీ మార్పిడి చేయాల్సి వచ్చింది. ఇందుకోసం మహిళలు అందరూ కలిసి ఇందుకు అవసరమైన డబ్బును సేకరించారు.

'తరగతులకు హాజరు కావడం ద్వారా ఆర్థిక స్వతంత్రత, డిజిటల్ అక్షరాస్యత, వ్యాపారదక్షత ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. ఎంతోమంది సొంతంగా వ్యాపారం ప్రారంభించారు' అంటుంది శ్రీష్మ అనే ట్రైనర్.

'యాభై దాటిన వారు స్కూల్‌కు రారేమో అనుకున్నాం. అయితే యాభై నుంచి అరవైఏళ్ల మధ్య వయసు ఉన్నవాళ్లే ఎక్కువ సంఖ్యలో ఉండడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. వారి ఉత్సాహం చూస్తుంటే ముచ్చటేస్తుంది' అంటుంది హసీనా అనే టీచర్.

స్కూల్‌కు హాజరవుతున్న వాళ్లలో భిన్నమైన సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన వాళ్లు, భిన్నమైన ప్రతిభాపాటవాలు ఉన్న మహిళలు ఉన్నారు.

పాలక్కాడ్ జిల్లా పుదుక్కోడ్ గ్రామానికి చెందిన రాధ రెండున్నర సంవత్సరాలుగా క్యాంటీన్ నడుపుతోంది. వీకెండ్ క్లాసులకు క్రమం తప్పకుండా హాజరవుతుంది.


'ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోగలిగాను అనేది ఒక సంతోషం అయితే, నేర్చుకున్న వాటి ద్వారా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడం మరో సంతోషం' అంటుంది రాధ.

'ఫైనాన్సియల్ ప్లానింగ్, మహిళకు కొత్త జీవనోపాధి అవకాశాలు పరిచయం చేయడం, డిజిటల్ అక్షరాస్యత, సామాజిక ఐక్యత మొదలైన అంశాలకు సంబంధించి మాడ్యుల్ తయారు చేశాం' అంటున్నాడు కుదుంబశ్రీ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నిషాద్.

'డిజైనింగ్‌కు సంబంధించి ఎన్నో క్లాసులు తీసుకున్నాను. క్లాసుకు హాజరవుతున్న మహిళల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే వారు భవిష్యత్‌లో తప్పకుండా విజయం సాధిస్తారనే నమ్మకం కలుగుతుంది' అంటుంది మనప్పదం గ్రామానికి చెందిన పుష్పలత. ఫ్యాషన్ డిజైనింగ్ యూనిట్‌ను నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోంది పుష్పలత.

శాస్త్రం

● పన్నెండు సంవత్సరాల వయసులోనే
ఫైర్-డిటెక్షన్ డివైజ్ ఆవిష్కరణ


● ఫైర్ డిటెక్షన్ డివైజ్
● శణ్య గిల్

సైన్స్ పాఠాలను కూడా చందమామ కథల్లా ఆసక్తిగా వింటుంది శణ్య గిల్. ఆ ఆసక్తి వృథా పోలేదు. చిన్నవయసులోనే ఆవిష్కర్తను చేసింది. థర్మో ఫిషర్ సైంటిఫిక్ జూనియర్ ఇన్వెంటర్స్ ఛాలెంజ్-2023లో పన్నెండు సంవత్సరాల శణ్య గిల్ తయారు చేసిన ఫైర్-డిటెక్షన్ డివైజ్ ప్రథమ స్థానంలో నిలిచింది...

కాలిఫోర్నియా(యూఎస్)లో సిక్స్-గ్రేడ్ చదువుతుంది శణ్య. సైన్స్, సైంటిస్ట్‌లు తనకు బాగా ఇష్టం. సైన్స్‌లో కొత్త ఆవిష్కరణల గురించి తెలుసుకోవడం అంటే ఆసక్తి. శణ్య గిల్ ఇంటికి సమీపంలోని ఒక రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం జరిగి భారీ నష్టం సంభవించింది. ఇంటా బయటా ఈ ప్రమాదానికి సంబంధించిన రకరకాల మాటలు ఎక్కడో ఒక చోట వినేది శణ్య గిల్. అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఒక పరికరం తయారు చేయాలనుకుంది.

రకరకాల ప్రయోగాలు చేసింది. ఆ ప్రయోగాలు వృథా పోలేదు.

కంప్యూటర్‌కు అనుసంధానించిన థర్మల్ కెమెరాను ఉపయోగించి సమర్థవంతమైన ఫైర్-డిటెక్షన్ సిస్టమ్‌ను రూపొందించింది శణ్య.

శణ్య తయారు చేసిన ఫైర్-డిటెక్షన్ డివైజ్ సాధారణ సంప్రదాయ స్మోక్ డిటెక్టర్ కంటే చాలా వేగంగా పనిచేస్తుంది. నష్టం జరగకుండా అప్రమత్తం చేస్తుంది.

'రెస్టారెంట్ అగ్నిప్రమాదం ప్రభావంతో అమ్మ రకరకాలుగా భయపడేది. కిచెన్‌లోని స్టవ్ ఆఫ్ అయిందో లేదో అమ్మ ఒకటికి రెండుసార్లు చెక్ చేసేది. ఎన్నో జాగ్రత్తలు తీసుకునేది. మరోవైపు ఎక్కడ చూసినా ఆ అగ్నిప్రమాదానికి సంబంధించే మాట్లాడుకునేవారు. ఇదంతా చూసిన తరువాత అగ్నిప్రమాదాలను నివారించే పరికరాన్ని తయారు చేయాలనుకున్నాను. నేను తయారు చేసిన ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ద్వారా ఎంతో మందిని అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కాపాడవచ్చు' అంటుంది శణ్య గిల్.

శణ్యకు సైన్స్‌తోపాటు ఆటలు, క్రాఫ్టింగ్, కోడింగ్ అంటే ఇష్టం. జూనియర్‌లకు పాఠాలు చెప్పడం అంటే ఇష్టం. బయో మెడికల్ ఇంజనీర్ కావాలనేది శణ్య గిల్ లక్ష్యం.

కళ

మనసైన మరో ప్రపంచంలోకి...

ప్రకృతి అనేది మనిషికి అతి పెద్ద పాఠశాల. జలపాతాల నుంచి పంటచేల వరకు ప్రతిదీ ఏదో ఒక పాఠం చెబుతూనే ఉంటుంది. అందుకే ప్రకృతి పిల్లలకు నచ్చిన ప్రపంచం. 'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్' అంశంపై రిజు వేసిన పెయింటింగ్... పిల్లలకూ ప్రకృతి ప్రపంచానికి మధ్య ఉండే అనుబంధానికి అద్దం పడుతుంది. ఈ పెయింటింగ్ చిల్డ్రన్స్ డే స్పెషల్ స్టాంప్ కోసం ఎంపికైంది...


● రిజు

కేరళ స్టేట్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ ప్రతి సంవత్సరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేస్తుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా అయిదు నుంచి పదకొండవ తరగతి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారు.

ఈ స్టాంపుల అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని పిల్లల సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగిస్తుంటారు.

ఈ సంవత్సరం రిజు వేసిన పెయింటింగ్ చిల్డ్రన్స్ డే స్టాంప్ కోసం ఎంపికైంది.

'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్ థీమ్ నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. ప్రకృతి కూడా గురువులాంటిదే అనే ఐడియాతో ఈ బొమ్మ వేశాను. ప్రకృతి, విద్యాప్రపంచం రెండూ కలిసిపోయి కనిపించేలా బొమ్మ వేశాను' అంటుంది కొచిలోని సెయింట్ థామస్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న రిజు. 'రిజు పెయింటింగ్ అద్భుతమైన ఊహతో భావగర్భితంగా ఉంది' అని జ్యూరీ ప్రశంసించింది. 'నిజంగా చెప్పాలంటే బహుమతి వస్తుంది అనుకోలేదు. నేనే కాదు నా తల్లిదండ్రులు, టీచర్‌లు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ పోటీలో పాల్గొనడంలో భాగంగా రకరకాల స్కెచ్‌లు వేశాను. అయితే అవేమీ నాకు నచ్చలేదు. ఆలోచిస్తున్న కొద్దీ కొత్త కొత్త ఆలోచనలు వచ్చేవి. ఆలోచిస్తున్న క్రమంలో ప్రకృతి ప్రపంచాన్ని పుస్తకంగా అనుకున్నాను. ఆ పుస్తకం తెరుచుకున్నప్పుడు ఆ దారుల్లో పిల్లలు ఉత్సాహంగా పరుగులు తీస్తుంటారు. ఈ ఊహతో పెయింటింగ్ వేసినప్పుడు చాలా సంతృప్తిగా అనిపించింది. నేను వేసిన పెయింటింగ్ స్టాంప్‌గా ఎంపిక కావడం, స్టాంప్‌లు నాన్న వృత్తిలో భాగం కావడం ఆనందంగా ఉంది ' అంటుంది రిజు.


● స్టాంప్‌కు ఎన్నికైన రిజు పెయింటింగ్

రిజు తండ్రి రాజేష్ పరక్కాడవు పోస్ట్ ఆఫీసులో పోస్ట్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. 'రోజూ తప్పకుండా ఏదో ఒక పెయింటింగ్ వేస్తుంటుంది రిజు. చిత్రకళకు సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటుంది. తన పెయింటింగ్ స్టాంప్‌గా ఎంపిక కావడం రిజూకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో ఆర్టిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నాను' అంటున్నారు రిజు తండ్రి రాజేష్. బాలల దినోత్సవం సందర్భంగా తిరువనంతపురంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ సమక్షంలో 'చిల్డ్రన్-ఫ్రెండ్లీ వరల్డ్' స్టాంప్‌ను అధికారికంగా విడుదల చేస్తారు.

● పశు వ్యాధులకు హోమియో మందులతో చికిత్స ఎంతో మేలు
ఖర్చు తక్కువ... వెంటనే ఫలితం..!



పాడి పశువులు రోగాల బారిన పడినప్పుడు రైతులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ఖర్చుల కన్నా చికిత్స ఖర్చులు భారంగా మారుతుండటంతో పాడి రైతుల ఆదాయం తగ్గిపోతోంది. ఈ సమస్యకు సరైన పరిష్కారం హోమియో చికిత్సా విధానం. ఇది తక్కువ ఖర్చుతో వెంటనే ఫలితాన్ని ఇచ్చేదే కాకుండా సహజమైన, మానవీయమైన, సమర్థవంతమైన చికిత్సా పద్ధతి కూడా అంటున్నారు పశువైద్యాధికారి డాక్టర్.జి.రాంబాబు. కడపలోని పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో సేవలందిస్తున్న ఆయన హోమియో పశువైద్యంలో తన అనుభవాలను 'సాక్షి సాగుబడి'తో పంచుకున్నారు..

సహజ రోగ నిరోధక శక్తికి ప్రేరణ కలిగించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే హోమియో వైద్య విధానం లక్షణం. హోమియో విధానంలో వాడే ఔషధాలన్నీ కూడా సహజమైన మొక్కలు, లవణాలతో తయారు చేసినవే. ఈ వైద్య విధానానికి 200 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా యూరోపియన్, ఆసియా దేశాల్లో పశువ్యాధుల చికిత్సలో హోమియోపతి మందులు వాడుతున్నారు. మన దేశంలోనూ అక్కడక్కడా ఈ ప్రయత్నాలు జరుగుతుండటం ఆహ్వానించదగిన విషయం.

పశువులకు హోమియో ప్రయోజనాలేమిటి?

- ఖర్చు తక్కువ. ఒక మందు ఖరీదు కేవలం రూ. 10 లోపే. అల్లోపతిలో ఈ ధరకు ఏ మందూ రాదు.
- సైడ్ ఎఫెక్ట్స్ /దుష్ప్రభావాలు ఉండవు. పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసే వరకు మందులు వాడకుండా ఉండాల్సిన పని లేదు. రోగ లక్షణాన్ని బట్టి చికిత్స చేస్తే చాలు.
- ఒకసారి పశువులకు, దూడలకు, ముఖ్యంగా శునకాలకు హోమియో (తీపి) మాత్రలు ఒకసారి ఇస్తే మళ్లీ అవే వచ్చి మందు అడుగుతాయి.
- హోమియో మందులు త్వరితగతిన పనిచేస్తాయి. ఇవి నెమ్మదిగా పనిచేస్తాయని చాలా మంది అనుకుంటారు. అది అపోహ మాత్రమే.
- ఇతర వైద్య పద్ధతుల్లో మందుల మాదిరిగా భరించలేని వాసన ఈ మందులకు ఉండదు.
- డోసు కొద్దిగా ఎక్కువయినా ఇబ్బంది లేదు. అది మిగతా వైద్య పద్ధతుల్లో ఇది సాధ్యం కాదు. కాబట్టి, అవగాహన పెంచుకున్న రైతులు పశువులకు ఇంటి దగ్గరే ఈ వైద్యం చేసుకోవచ్చు.
- కొన్ని వ్యాధులకు అల్లోపతిలో లేని వైద్యం కూడా హోమియోపతిలో ఉండటం విశేషం.
- ఈ మందుల వల్ల పర్యావరణం కలుషితం కాదు.

హోమియో మందులతో పొదుగువాపు మాయం!

రాధి ఆవు ఇది. రాజస్తాన్‌కు చెందిన జాతి. స్థానిక రైతు అక్కడి నుంచి కడప జిల్లాకు చూడి ఆవును తీసుకువచ్చారు. వారం తరువాత ఈనిన ఆవు కోడె దూడకు జన్మనిచ్చింది. పాలు ఇచ్చిన 5వ రోజు నుంచి రెండు చన్నుల నుంచి పాలతో పాటు రక్తం వచ్చింది. పశువైద్యునిగా పొదుగువాపును గుర్తించి యాంటి బయోటిక్ మందులతో చికిత్స ఇచ్చాను. 5 రోజులకు తగ్గింది. 7వ రోజు నుంచి మళ్లీ పొదుగువాపు వచ్చింది. ఆవు నుంచి తీసిన రక్తంతో కూడిన పాలను యాంటి బయోటిక్ సెన్సిటివిటి పరీక్షకు ప్రయోగశాలకు పంపించాం. పరీక్ష ఫలితాలు 3వ రోజున వస్తాయి. ఈ లోపు మళ్లీ కొత్త అల్లోపతి మందులు ఇవ్వడం కన్నా ఆయుర్వేద లేదా హోమియో మందులు వాడుతుంటాం. ఈ ఆవుకు హోమియో మందులు వాడితే.. రెండు విధాలుగా ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. మొదటిది: పాల పరీక్ష ఫలితాల్లో మొత్తం 13 యాంటీ బయోటిక్ మందులకు నిరోధకత వచ్చింది. అంటే, ఆ ఆవుపై ఇక ఏ యాంటి బయోటిక్ మందూ పనిచేయదని అర్థం. రెండోది: ఈ లోగా హోమియో మందులు వాడటం వల్ల 3 రోజుల్లోనే పొదుగువాపు తగ్గిపోయింది. అల్లోపతి మందులకు దాదాపుగా రూ. 2,200 ఖర్చు చేశాం. హోమియో మందుల ఖర్చు కేవలం రూ. 50 మాత్రమే. పొదుగువాపు తగ్గించడానికి ఫైటో లక్క, కొనియం, బెల్లడోన, ఫెర్రం ఫాస్ అనే హోమియో మందులను వినియోగించాం.



● పచ్చి మేతలో కలిపి హోమియో మాత్రలు ఇలా తినిపించవచ్చు

రెండు వారాలైనా తగ్గనిది.. హోమియోతో 2 రోజుల్లో తగ్గింది!

ఒక హోటల్ యజమాని ఒంగోలు ఆవును కొన్నారు. మంచిదని హోటల్ దగ్గరే ఆవును కట్టేస్తున్నారు. గడ్డి తక్కువ వేస్తూ ఎక్కువ మొత్తంలో కూరగాయలు మేపేవారట. కొద్ది రోజులకే ఆవుకు సుస్తీ చేసింది. మేత తినటం దాదాపుగా ఆపేసింది. ఆకలి పెంచేందుకు పౌడర్లు, బీకాంప్లెక్స్ ఇంజక్షన్లు, లివర్ టానిక్‌లు, కసురు తాగించినా ఫలితం లేక పోవటంతో కడప పశువుల ఆసుపత్రికి తీసుకువచ్చారు. అల్లోపతి మందులతో దాదాపు 2 వారాల పాటు వైద్యం అందించినా, కొద్దిగా కూడా ఫలితం కనిపించ లేదు. ఆ దశలో నక్స్ వామిక, రుస్ టాక్స్ అనే హోమియో మందులు రెండు రోజులు ఇచ్చాం. 3వ రోజుకు సమస్య పూర్తిగా తగ్గిపోయింది.


● నాలుకపై ఇలా వేయొచ్చు..

(పశువైద్యులు డాక్టర్ జి. రాంబాబును 94945 88885 నంబరులో సంప్రదించవచ్చు)

ఏ వ్యాధికి ఏయే హోమియో మందులు?

పశువుల వ్యాధులకు హోమియోపతి మందులను శువు వయసును బట్టి, వ్యాధి లక్షణాల తీవ్రతను బట్టి ఎంత పొటెన్సీ కలిగిన మందు ఇవ్వాలో నిర్ణయించాలి. వయసులో చిన్న పశువులకు 30 పొటెన్సీలో ఇవ్వాలి. పెద్ద పశువులకు 200 పొటెన్సీలో 5 నుండి 10 మాత్రలు ఇవ్వాలి. పశువైద్యులు హోమియోపతి వైద్య విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలిగితే తమ ప్రాంతంలోని రైతులకు మంచి సలహాలు అందించగలుగుతారు. పశుపోషణపై మక్కువ కలిగిన రైతులు హోమియోపై అవగాహన పెంచుకోవాలి. తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా, వెంటనే బాగా ఉపయోగపడుతుందని గ్రహించాలి.



నొప్పి నివారణకు - ఆర్నిక
జ్వరం - బెల్లడోన
చెవి నుంచి చీము - మెర్క్ సాల్
కాలిన బొబ్బలు - కేంతారిస్
పుండ్లకు - క్యాలెండుల
చర్మ వ్యాధులకు - సల్ఫర్
విరిగిన ఎముకలకు - సిం ఫైటం
పొదుగువాపు- ఫైటో లక్క
పాము కాటు - నాజా
తేనెటీగ/కందిరీగ కరిస్తే - ఎపిస్
తేలు కాటు - లేడం పాల్
దగ్గు - బాసిలినం
నోటి పుండ్ల నివారణకు - బోరాక్స్
గడ్డల కరుగుదలకు - ఆరం మూర్ నైట్రికం
వాపు, గడ్డలు తగ్గటానికి - బ్రయోనియ
పాలు పెరుగుదలకు - కాల్కేరియ కార్బ్
క్యాల్షియం లోపానికి - కాల్కేరియ ఫాస్
డీవార్మింగ్/ నట్టల నివారణకు - సినా / చైనా
కడుపులో గ్యాస్ - కొల్చికం
కడుపులో నొప్పి- కోలో సింథసిస్
అండాశయంలో ఫాలికల్ పెరుగుదలకు-ఆరం అయోడం
ఎద లక్షణాలు రావడానికి - ఆగ్నస్ కాస్టాస్
కంటి పొరల ఎరుపు - యుఫ్రేసియ
రక్త వృద్ధి - ఫెర్రం మెట్, ఫెర్రం ఫాస్
చీముతో కూడిన ఇన్ఫెక్షన్ - గన్ పౌడర్
రక్తస్రావం తగ్గించడానికి - హిమామిలిస్
నరాల చివర గాయం వద్ద నొప్పి నివారణ - హైపెరీకం
పాలలో రక్తం - ఇపెకాక్
ఎడిమ/ ఎక్కడయినా నీరు చేరే ఉబ్బు - నాట్రం సల్ఫ్
ఆకలి పెరగడానికి - నక్స్ వామిక
గర్భాశయ ద్వారం తెరుచుకోవడానికి - కాలోఫయలం
ఎఖినేసియ -రక్తశుద్ధి, రోగనిరోధక శక్తి
మెయ్య దిగడం - సీపియ
పడ్డ దూడలు ఎదకు రాకపోతే - పల్సటిల్ల
చీము బాగా ఉంటే - పైరోజినం
రుమేన్/ పశు పొట్ట కదలికలకు - రాఫనస్
కీళ్ళ నొప్పులు - రుస్ టాక్స్
గర్భస్రావం కాకుండా - సబీనా
గర్భాశయ కండరాల కదలికలకు - సీకల్ కోర్నోటం


సాగుబడి
విశాఖ కార్తె: నవంబర్ 20 వరకు

➡ 20 సెంట్లలో 20 రకాల పంటల ప్రకృతి సేద్యం
➡ నిరంతర ఆదాయం.. 2 నెలల్లోనే రూ. పది వేల ఆదాయం

పంట చేసే ఏటీఎం!


● ఏటీఎం చేలో పృథ్వీరాజ్

ప్రకృతి వ్యవసాయంలో సరికొత్త అధ్యాయం ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) నమూనా. కొద్ది సెంట్ల భూమిలోనే ఏడాది పొడవునా రకరకాల కూరగాయ పంటల సాగు ద్వారా రైతుకు నిరంతర ఆదాయం ఇస్తున్న పంటల నమూనా ఇది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ ద్వారా క్షేత్రస్థాయిలో రైతులూ ఏటీఎం సాగును చేపట్టి అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారు. కౌలు రైతు దూసరి పృథ్వీరాజ్ ఇందుకో నిదర్శనం. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలంలోని తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెం పృథ్వీరాజ్ నివాసం. కౌలుకు తీసుకున్న ఎకరం 20 సెంట్ల రేగడి భూమిలో ఏటీఎం మోడల్‌ను గత రెండు నెలలుగా సాగు చేస్తున్నారు. నాలుగు అడుగుల వెడల్పుతో ఎత్తుమడులను ఏర్పాటు చేసుకొని పైన డిజైన్‌లో చూపిన విధంగా 20 కూరగాయ పంటలు వేశారు. ఘనజీవామృతం, జీవామృతం 15 రోజులకోసారి ఇస్తున్నారు. జిల్లాలో 40 మంది రైతులతో ఏటీఎం మోడల్‌ను ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నామని డీపీఎం రాజకుమారి తెలిపారు.



– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

రెండు నెలల్లో రూ. పది వేల ఆదాయం

2 నెలల క్రితం 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం ఏటీఎం మోడల్‌లో పంటలు సాగు చేస్తున్నాను. 4 అడుగుల వెడల్పుండే 8 బెడ్స్‌లో 20 రకాల పంటలు వేశాం. గోంగూర, రెడ్ తోటకూర, పాలకూర, చుక్కకూర 20 రోజులకోసారి కోతకు వస్తున్నాయి. మరో ఐదారు బెడ్లలో ఆకుకూరలు కోయాల్సి ఉంది. బెండ, వంగ, బీర, గోరు చిక్కుడు, అనుములు, చెట్టుచిక్కుడు కోతకు వచ్చాయి. అన్నీ కలిపి ఇప్పటికి రూ. 10 వేల ఆదాయం వచ్చింది. చేలో ఒకే ఒక పంట వేసి చేతికొచ్చేవరకు ఆగకుండా రకరకాల పంటలను సాగు చేయటం ద్వారా ఎప్పటి కప్పుడు అధికాదాయం పొందుతున్నాం. ఏడాదికి 20 సెంట్లలో రూ. లక్షన్నర వరకు ఆదాయం వస్తుందనుకుంటున్నాం. భార్యాభర్తలు ఇద్దరం పంటలను కనిపెట్టుకుంటూ పనులను మేమే చేసుకుంటున్నాం. రసాయనాల్లేని ఆహారం తీసుకుంటూ తగిన ఆదాయం పొందుతున్నాం.

– డి. పృథ్వీరాజ్ (63058 37151), క్రిస్టియన్‌పాలెం, గుంటూరు జిల్లా

9 ఒకే ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 9 మ్యాచ్‌ల్లో గెలుపొందడం ఇదే తొలిసారి. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 8 మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఆస్ట్రేలియా జట్టు 2003, 2007 ప్రపంచకప్‌లలో వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచి చాంపియన్‌గా నిలిచింది.

7 వన్డేల్లో 400 అంత కంటే ఎక్కువ స్కోరు చేయడం భారత్‌కిది ఏడోసారి. దక్షిణాఫ్రికా జట్టు అత్యధికంగా 8 సార్లు ఈ మైలురాయిని దాటింది.

9 ప్రపంచకప్ మ్యాచ్‌లో తొలిసారి భారత్ తొమ్మిది మంది బౌలర్లతో బౌలింగ్ వేయించింది. గతంలో ఇంగ్లండ్ (1987లో శ్రీలంకపై), న్యూజిలాండ్ (1992లో పాకిస్తాన్‌పై) జట్లు మాత్రమే తొమ్మిది మంది బౌలర్లకు అవకాశం ఇచ్చింది.

24 ఈ ఏడాది వన్డేల్లో భారత్ సాధించిన విజయాలు. 1998లోనూ భారత్ అత్యధికంగా 24 వన్డేల్లో గెలిచింది.

60 ఒకే ఏడాది వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ (60) నిలిచాడు. 2015లో ఏబి డివిలియర్స్ 58 సిక్స్‌లు కొట్టాడు.

215 ఈ ఏడాది భారత జట్టు 30 వన్డేలు ఆడి కొట్టిన సిక్స్‌లు. 2019లో వెస్టిండీస్ అత్యధికంగా 209 సిక్స్‌లు కొట్టింది.

‘హాల్ ఆఫ్ ఫేమ్’లో సెహ్వాగ్, ఎడుల్జీ

అరవింద డిసిల్వాకు కూడా చోటు





దుబాయ్: భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ, మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో చోటు దక్కించుకున్నారు. ఈ ఇద్దరు భారత క్రికెటర్లతో పాటు శ్రీలంక దిగ్గజం అరవింద డిసిల్వాను కూడా తాజాగా ఐసీసీ ఈ విశిష్ట క్రికెటర్ల జాబితాలో చేర్చింది. భారత్ నుంచి ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో ఇప్పటి వరకు తొమ్మిది మందికి చోటు లభించగా... ఎడుల్జీ ఈ జాబితాలో చోటు దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్ కావడం విశేషం. ఆయా జట్లకు అందించిన సేవలు, నడిపించిన తీరు, గెలిపించిన ఘనతలు అన్నీ పరిగణించే ఐసీసీ ‘హాల్ ఆఫ్ ఫేమ్’లోకి ఎంపిక చేస్తారు.

దయానా ఎడుల్జీ: భారత్‌లో అమ్మాయిల క్రికెట్‌వైపు కన్నెత్తి చూడని రోజుల్లోనే క్రికెటరై తర్వాత సారథిగా ఎదిగింది. 1976 నుంచి 1993 వరకు భారత జట్టుకు ఆడి స్పిన్ ఆల్‌రౌండర్‌గా రాణించింది. 20 టెస్టులాడి 63 వికెట్లు తీసి, 404 పరుగులు చేసింది. 34 వన్డేల్లో 211 పరుగులు సాధించి 46 వికెట్లు పడగొట్టింది.

సెహ్వాగ్: భారత టెస్టు క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా సెహ్వాగ్ రికార్డుల్లోకెక్కాడు. భారత్ 2007 టి20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ సాధించడంలో తనవంతు పాత్ర పోషించాడు. సెహ్వాగ్ 104 టెస్టులు ఆడి 8586 పరుగులు సాధించాడు. 23 సెంచరీలు చేశాడు. 40 వికెట్లు తీశాడు. 251 వన్డేలాడి 8273 పరుగులు, 15 సెంచరీలు సాధించాడు. 96 వికెట్లు కూడా తీశాడు. 19 టి20లు ఆడి 393 పరుగులు సాధించాడు.

అరవింద డిసిల్వా: ఆస్ట్రేలియాతో జరిగిన 1996 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో డిసిల్వా వీరోచిత సెంచరీతో జట్టును విశ్వవిజేతగా నిలిపాడు. 308 వన్డేల్లో 9284 పరుగులు చేశాడు. 106 వికెట్లు పడగొట్టాడు. 93 టెస్టుల్లో 6361 పరుగులు సాధించాడు.

6 బంతుల్లో 6 వికెట్లు

ఆస్ట్రేలియా క్లబ్ క్రికెట్‌లో ఘనత


గారెత్ మోర్గాన్

గోల్డ్‌కోస్ట్: ఆస్ట్రేలియా క్లబ్ క్రికెట్‌లో ఒక అరుదైన రికార్డు నమోదైంది. గోల్డ్‌కోస్ట్ ప్రీమియర్ లీగ్ డివిజన్-3 పోటీల్లో ఒక బౌలర్ ఓవర్‌లోని ఆరు బంతుల్లో ఆరు వికెట్లు పడగొట్టడం విశేషం. ముద్గీరబ నేరంగ్ అండ్ డిస్ట్రిక్ట్స్ క్లబ్ కెప్టెన్ గారెత్ మోర్గాన్ ఈ ఘనత సాధించి చరిత్రకెక్కాడు. సర్ఫర్స్ ప్యారడైజ్ సీసీ జట్టుపై అతను ఈ రికార్డు సృష్టించాడు. 40 ఓవర్ల మ్యాచ్‌లో 179 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ఫర్స్ క్లబ్ 39 ఓవర్లలో 174/4 వద్ద నిలిచింది. చివరి ఓవర్లో మరో 5 పరుగులు చేస్తే చాలు. అయితే గారెత్ ఆరు బంతుల్లో ఆరు వికెట్లు తీసి సంచలనం సృష్టించడంతో 4 పరుగుల తేడాతో గెలుపు ముద్గీరబ జట్టు సొంతమైంది. అంతకుముందే ఈ ఇన్నింగ్స్‌లో మరో వికెట్ తీసిన గారెత్ మొత్తంగా 7/16తో ముగించాడు. గతంలో ప్రొఫెషనల్ క్రికెట్‌లో నీల్ వాగ్నర్ (న్యూజిలాండ్), అల్ అమీన్ (బంగ్లాదేశ్), అభిమన్యు మిథున్ (భారత్) ఒకే ఓవర్లో ఐదు వికెట్లు పడగొట్టారు.

ఎనిమిదోసారి ‘టాప్’ ర్యాంక్‌తో...


సీజన్ ముగింపు నంబర్‌వన్ ర్యాంక్ ట్రోఫీతో జొకోవిచ్

టురిన్ (ఇటలీ): సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రికార్డుస్థాయిలో ఎనిమిదోసారి ఏడాదిని నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనున్నాడు. సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్ తొలి లీగ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 7-6 (7/4), 6-7 (1/7) 6-3తో హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి 2023 సీజన్ ముగింపు ‘టాప్’ ర్యాంక్‌ను ఖరారు చేసుకున్నాడు. 36 ఏళ్ల జొకోవిచ్ రెండేళ్ల క్రితమే ఏడోసారి సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించి సంప్రాస్ (అమెరికా; 6 సార్లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. జొకోవిచ్ 2011, 2012, 2014, 2015, 2018, 2020, 2021లలో నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించాడు. ఏటీపీ ఫైనల్స్ ముగిశాక జొకోవిచ్ ఓవరాల్‌గా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 400 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందనున్నాడు.

భారత్ 9/9

లీగ్ దశను అజేయంగా ముగించిన టీమిండియా

- చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై 160 పరుగుల తేడాతో ఘనవిజయం
- శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ శతకాలు
- రోహిత్, గిల్, కోహ్లి అర్ధ సెంచరీలు
- రేపు ముంబైలో న్యూజిలాండ్‌తో భారత్ సెమీఫైనల్ పోరు

సంపూర్ణం... లీగ్ దశలో భారత్ జైత్రయాత్ర! నెదర్లాండ్స్ జట్టుతో మిగిలిన లాంఛనాన్ని ఫుల్ ప్రాక్టీస్‌తో టీమిండియా ముగించింది. టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి ఫిఫ్టీలతో.. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్; కేఎల్ రాహుల్ సెంచరీలతో డచ్ బౌలర్లను నెట్ ప్రాక్టీస్‌లో ఆడుకున్నంత ఈజీగా ఆడేశారు. అనంతరం ఏకంగా 9 మంది భారత బౌలర్లు నెదర్లాండ్స్ బ్యాటర్లకు పరీక్ష పెట్టారు. చివరకు భారీ విజయం సాధించిన రోహిత్ శర్మ బృందం అజేయంగా లీగ్ దశను పూర్తిచేసి బుధవారం న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ పోరుకు సై అంటోంది.


శ్రేయస్ అయ్యర్


కేఎల్ రాహుల్

బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో భారత్ వంద శాతం అంకితభావంతో తొమ్మిదికి తొమ్మిది విజయాలతో లీగ్ దశను అజేయంగా దాటింది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 160 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై జయభేరి మోగించింది. క్రికెట్ కూనపై టాస్ గెలవగానే బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 410 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 102; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకాన్ని... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శ్రేయస్ అయ్యర్ (94 బంతుల్లో 128 నాటౌట్; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీని సాధించారు. రోహిత్ శర్మ (54 బంతుల్లో 61; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (32 బంతుల్లో 51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), కోహ్లి (56 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం నెదర్లాండ్స్ 47.5 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. తేజ నిడమనూరు (39 బంతుల్లో 54; 1 ఫోర్, 6 సిక్స్‌లు) మెరిపించాడు. బౌలర్లలో బుమ్రా, సిరాజ్, కుల్దీప్, జడేజా తలా 2 వికెట్లు తీస్తే... కోహ్లి, రోహిత్ శర్మ చెరో వికెట్ పడగొట్టారు. బుధవారం ముంబైలో జరిగే తొలి సెమీఫైనల్లో గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌తో భారత్ ఆడుతుంది.

ఐదుగురూ చితగ్గొట్టారు...

ఓపెనర్లు రోహిత్ బౌండరీలతో... శుబ్‌మన్ సిక్సర్లతో భారత్ 10 ఓవర్లలోనే 91/0 స్కోరు చేసింది. 30 బంతుల్లోనే గిల్ ఫిఫ్టీ పూర్తవగానే నిష్క్రమించాడు. 100 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లి వచ్చాక కెప్టెన్ రోహిత్ 44 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. కాసేపటికే అతనూ పెవిలియన్ చేరాడు. కోహ్లి, అయ్యర్ జోడీ కూడా పాతుకుపోవడంతో డచ్ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. కోహ్లి 53 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకోగా, భారత్ స్కోరు 29వ ఓవర్లో 200 దాటింది. అక్కడే కోహ్లి వికెట్ పడింది. ఇక్కడితో అర్ధశతకాల ఆట ముగియగా... శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ శతకాల బ్యాటింగ్‌ను చూపెట్టారు. 48 బంతుల్లో అయ్యర్, 40 బంతుల్లో రాహుల్ అర్ధశతకాలు సాధించారు. 42వ ఓవర్లో భారత్ 300 పరుగులు చేయగా... ఆ తర్వాత రాహుల్ ఆట పూర్తిగా మారింది. పరుగుల వేగం పుంజుకుంది. అయ్యర్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఆఖరి 8.2 ఓవర్లలోనే భారత్ 110 పరుగులు చేసింది. 49వ ఓవర్లో అయ్యర్ మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో 25 పరుగులు పిండుకుంటే... ఆఖరి ఓవర్లో తొలి రెండు బంతుల్ని సిక్సర్లుగా బాదిన రాహుల్ 62 బంతుల్లో సెంచరీ పూర్తిచేశాడు. దీంతో భారత్ స్కోరు 400 మార్క్ దాటింది. ఐదో బంతికి రాహుల్ అవుటయ్యాడు. రాహుల్, అయ్యర్ 208 పరుగులు జోడించి ప్రపంచకప్ చరిత్రలో నాలుగో వికెట్‌కు అత్యధిక పరుగుల భాగస్వామ్యం రికార్డు సృష్టించారు.

కూన కుదేల్

లక్ష్యం కొండంత ఉన్నా దాని గురించి ఏమాత్రం ఆలోచించకుండా నెదర్లాండ్స్ బ్యాటర్లు తమ వంతుకు వచ్చిన ఆటే ఆడారు. మ్యాక్స్ ఓ డౌడ్ (30), అకెర్మన్ (35), సైబ్రాండ్ (80 బంతుల్లో 45; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. విజయవాడలో జన్మించి నెదర్లాండ్స్‌లో స్థిరపడ్డ తేజ నిడమనూరు మిడిలార్డర్‌లో కాసేపు భారీ సిక్సర్లతో మురిపించాడు. అయ్యర్, కీపర్ రాహుల్ మినహా 9 మంది భారత తరఫున బౌలింగ్‌కు దిగారు. ప్రధాన బౌలర్లు బుమ్రా, సిరాజ్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా తలా ఒక చేయివేశారు. తేజ 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తికాగానే ఆ మెరుపులకు రోహిత్ స్వయంగా బౌలింగ్ చేసి ముగింపు పలికాడు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	9	9	0	18	2.570
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	9	7	2	14	0.841
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	9	4	5	8	-0.199
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	9	3	6	6	-0.572
బంగ్లాదేశ్	9	2	7	4	-1.087
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	9	2	7	4	-1.825

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) వెస్లీ (బి) లీడే 61; గిల్ (సి) తేజ (బి) మీకెరన్ 51; కోహ్లి (బి) మెర్వ్ 51; అయ్యర్ (నాటౌట్) 128; రాహుల్ (సి) సైబ్రాండ్ (బి) లీడే 102; సూర్యకుమార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 410. వికెట్ల పతనం:** 1-100, 2-129, 3-200, 4-408. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 7-0-52-0, వాన్ బీక్ 10-0-107-0, అకెర్మన్ 3-0-25-0, మీకెరన్ 10-0-90-1, వాన్‌డెర్ మెర్వ్ 10-0-53-1, బస్ డి లీడే 10-0-82-2.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; ఒ డౌడ్ (బి) జడేజా 30; అకెర్మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 35; సైబ్రాండ్ (బి) సిరాజ్ 45; ఎడ్వర్డ్స్ (సి) రాహుల్ (బి) కోహ్లి 17; లీడే (బి) బుమ్రా 12; తేజ (సి) షమీ (బి) రోహిత్ 54; వాన్ బీక్ (బి) కుల్దీప్ 16; మెర్వ్ (సి) షమీ (బి) జడేజా 16; ఆర్యన్ (బి) బుమ్రా 5; మీకెరన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 250. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-111, 5-144, 6-172, 7-208, 8-225 9-236, 10-250. **బౌలింగ్:** బుమ్రా 9-1-33-2, సిరాజ్ 6-1-29-2, షమీ 6-0-41-0, కుల్దీప్ 10-1-41-2, జడేజా 9-0-49-2, కోహ్లి 3-0-13-1, గిల్ 2-0-11-0, సూర్యకుమార్ 2-0-17-0, రోహిత్ 0.5-0-7-1.


కోహ్లి


రోహిత్

సినిమా

పండగ పోస్టర్ గురూ

దీపావళి పండక్కి ఇండస్ట్రీలో సినీ టపాసులు బాగానే పేలాయి. టీజర్, ట్రైలర్, ఫస్ట్ లుక్, కొత్త పోస్టర్.. ఇలా సినీ ప్రేమికులకు కావాల్సిన మతాబులు అందాయి. ఈ విశేషాల్లోకి...


● విక్రాంత్, విష్ణు విశాల్, రజనీకాంత్


● వెంకటేశ్


● రవితేజ


● ప్రభాస్


● గోపీచంద్


● సూర్య


● విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

● రజనీకాంత్, కపిల్‌దేవ్ కీలక పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా జీవితా రాజశేఖర్ ఓ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘లాల్ సలామ్’. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. దీపావళి సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. క్రికెట్‌ను ప్రేమించే కొందరు హిందు, ముస్లిం యువకుల మధ్య రాజకీయ జోక్యంతో తలెత్తిన వివాదాలను మొయిద్దీన్ భాయ్ (రజనీ పాత్ర పేరు) ఎలా సరిదిద్దుతాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం సాగుతుందని యూనిట్ చెబుతోంది.

● ‘రాంగ్ యూసేజ్’ అంటూ ‘సైంధవ్’ సినిమా కోసం పాట పాడారు వెంకటేశ్. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, బేబీ సారా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ‘రాంగ్ యూసేజ్’ పాట లిరికల్ వీడియోను ఈ నెల 21న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, ఈ సాంగ్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది.

● రవితేజ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం ‘ఈగల్’. ఇందులో కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది.

● ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ ‘సలార్’. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ‘సలార్: సీజ్‌ఫైర్’ డిసెంబరు 22న విడుదల కానుంది. తొలి భాగం ట్రైలర్‌ను డిసెంబరు 1న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ప్రభాస్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరంగదూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

● మాస్ పోలీసాఫీసర్ పాత్రలో గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ ‘భీమా’. ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఓ మాస్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

● సూర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘కంగువా’. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్. దీపావళి సందర్భంగా ‘కంగువా’ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యూవీ క్రియేషన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఈ సినిమాను నిర్మిస్తోంది. రెండు విభిన్న కాలాల్లో సాగనున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఏప్రిల్ 11న విడుదల కానుందని టాక్.

● విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఫ్యామిలీ స్టార్’. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. ఈ సినిమా తాజా షూటింగ్ షెడ్యూల్‌ను బ్యాంకాక్‌లో ప్లాన్ చేశారు. సంక్రాంతికి ‘ఫ్యామిలీ స్టార్’ విడుదల కానుంది.

● ఎన్టీఆర్ పెద్ద కుమారుడు జయకృష్ణ తనయుడు చైతన్యకృష్ణ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘బ్రీత్’. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనారోగ్యంతో హాస్పిటల్‌లో జాయిన్ అయిన తర్వాత చోటు చేసుకునే ఘటనల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని యూనిట్ చెబుతోంది.

● ప్రముఖ నటుడు ఉపేంద్ర భార్య, నటి ప్రియాంకా ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటించిన ప్రయోగాత్మక చిత్రం ‘క్యాప్చర్’. ఈ సినిమాకు లోహిత్ దర్శకుడు. రాధికా కుమారస్వామి సమర్పణలో రవిరాజ్ నిర్మించారు. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ‘‘ఇప్పటి వరకూ సినీ ప్రపంచంలో రాని ఓ ప్రయోగాత్మక చిత్రం ఇది. సింగిల్ లెన్స్‌తో తీసిన మొట్ట మొదటి సినిమా కూడా ఇదే. సినిమా మొత్తం కూడా సీసీటీవీ ఫుటేజ్ నుంచి షూట్ చేసినట్టుగా అనిపిస్తుంది. 30 రోజులు గోవాలో ఏకధాటిగా షూటింగ్ జరిపాం. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది.

● కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి సతీమణి, నటి రాధికా కుమారస్వామి నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ‘అజాగ్రత్త’. శశిధర్ దర్శకత్వంలో రవిరాజ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏడు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. అలాగే రాధికా కుమారస్వామి నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం ‘భైరా దేవి’. శ్రీ జై దర్శకత్వం వహిస్తున్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునే అఘోరా భైరాదేవిగా రాధిక నటిస్తున్నారు.

● క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో రూపొందుతున్న సినిమా ‘చే’. ‘లాంగ్ లివ్’ అనేది ఉపశీర్షిక. లావణ్య సమీరా, పూల సిద్దేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమామహేశ్వర్, బి.ఆర్ సభావత్ నాయక్ కీలక పాత్రల్లో నటించారు. బి.ఆర్ సభావత్ నాయక్ దర్శకత్వంలో సూర్య, బాబు, దేవేంద్ర నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ‘‘చేగువేరా బయోపిక్ తీయాలన్నది నా 20 ఏళ్ల కల. విప్లవ వీరుడు చేగువేరా లైఫ్‌లో జరిగిన ఎన్నో అరుదైన విషయాలు ఈ సినిమాలో ఉన్నాయి. డిసెంబరులో ఈ సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం’’ అన్నారు బి.ఆర్ సభావత్ నాయక్.


● రాధిక


● చైతన్య కృష్ణ


● ప్రియాంక


● ‘చే’ పోస్టర్

మంగళవారం ప్రకటించగానే ఆయన ఫోన్ చేశారు

- దర్శకుడు అజయ్ భూపతి



‘‘మంగళవారం’ అంటే మంచిది కాదని ఓ అభిప్రాయం ఉంది. అయితే మంగళవారం చాలా శుభప్రదమైన రోజు. జయవారం అంటారు. గతంలో మనకు ఆ రోజే సెలవు ఉండేది.. బ్రిటీషర్లు వచ్చాక ఆ సెలవుని ఆదివారానికి మార్చారు. ‘మంగళవారం’ టైటిల్ పోస్టర్ విడుదల చేయగానే సీనియర్ డైరెక్టర్ వంశీగారు ఫోన్ చేసి, ‘చాలా మంచి టైటిల్ అజయ్. నేను చాలాసార్లు ఆ టైటిల్ అనుకుంటే నిర్మాతలు ఒప్పుకోలేదు’ అన్నారు. ఆయన నుంచి ఫోన్ రావడం చాలా సంతోషంగా అనిపించింది’’ అని దర్శకుడు అజయ్ భూపతి అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతి రెడ్డి గునుపాటి, ఎం.సురేష్ వర్మతో కలిసి అజయ్ భూపతి ‘ఎ’ క్రియేటివ్ వర్క్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అజయ్ భూపతి చెప్పిన విశేషాలు.

● ‘మహాసముద్రం’ సినిమా చిత్రీకరణలో ఉన్నప్పుడు ‘మంగళవారం’ చిత్రం చేయాలని ఫిక్స్ అయ్యాను. కమర్షియల్ సినిమాలు ఒక మీటర్ మీద వెళతాయి కాబట్టి చేయడం కష్టం కాదు. కానీ, ‘మంగళవారం’ లాంటి చిత్రం తీయడం చాలా కష్టం. ప్రొడక్షన్ అండ్ టెక్నికల్ వేల్యూస్, ఆర్టిస్టుల యాక్టింగ్ వంటివి చాలా ఉంటాయి. అలాగే నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులందర్నీ ఒక్క తాటిపైకి తీసుకు రావడం కష్టంగా అనిపించింది. ● ‘మహాసముద్రం’ సమయంలో అదితీరావు హైదరీకి కూడా ‘మంగళవారం’ కథ చెప్పాను.. ఆమె చేస్తానన్నారు. అయితే ఆ తర్వాత ఆమెను నేను సంప్రదించలేదు. ‘మంగళవారం’ కోసం సుమారు 40, 50 మందిని ఆడిషన్ చేశా. ఆ తర్వాత ఓ రోజు ‘మనం మళ్లీ సినిమా చేద్దాం’ అంటూ పాయల్ నుంచి ఓ మెసేజ్ వచ్చింది. ఆ పాత్రకి తను సరిపోతుందా? లేదా అని విజువలైజ్ చేసుకున్నాను.. రెండు రోజుల తర్వాత ఫొటో షూట్ చేశాం. తను సరిపోతుందని తెలిశాక ఓకే చేశా. ● ‘మంగళవారం’ ఏ స్థాయి సినిమా అని నేను ముందు ఊహించకపోతే 20 కోట్లు ఖర్చు పెట్టను. అల్లు అర్జున్‌గారికి ఏడాదిన్నర క్రితమే ఈ కథ చెప్పాను. అందుకే ఆయన ట్రైలర్ చూసిన తర్వాత సినిమా ఎలా ఉంటుందో ఊహించి, మాట్లాడారు. మా బ్రదర్ సురేష్ వర్మ, స్వాతి రెడ్డిగార్లతో కలిసి ఈ సినిమా నిర్మాణంలో భాగమవడం సంతోషంగా ఉంది. ‘మంగళవారం’ సినిమాకు కొనసాగింపు ఉంటుంది’’ అన్నారు.

ఉత్తరాంధ్రను ఊపేసేలా...


● శ్రీకాంత్

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘కోట బొమ్మాళి పీఎస్’. తేజా మార్ని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్‌పై ‘బన్నీ’ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ 24న విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి ‘ఉత్తరాంధ్రను ఊపేసేలా... శ్రీకాకుళం చిందేసేలా...’ అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. శ్రీకాకుళం జిల్లాలోని కోట బొమ్మాళి గ్రామంలోని కోటమ్మ తల్లి సన్నిధానంలో ఈ పాటను విడుదల చేశారు. రంజిన్ రాజ్ సంగీతం అందించిన ఈ పాటకు రాంబాబు గోసాల సాహిత్యం అందించారు. ఈ పాట విడుదలలో రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, తేజా మార్ని, చిత్రసహ నిర్మాత భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వినోదాల జమాన


● భాస్కర్, సూర్య శ్రీనివాస్, వెంకీ కుడుముల

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్, స్వాతి కశ్యప్, జారా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ‘జమాన’. భాస్కర్ జక్కులని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీ లక్ష్మీ వల్లభ క్రియేషన్స్, వీఎస్ అసోసియేట్స్‌పై తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్ నిర్మించారు. ఈ మూవీ టైటిల్ ప్రోమోను దర్శకుడు వెంకీ కుడుముల విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘జమాన’ టైటిల్ ప్రోమో చాలా ఆసక్తిగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘నేటి యువతరం ఆలోచనలకు అద్దం పట్టే ఆసక్తికరమైన కథ, కథనాలతో రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘జమాన’’ అన్నారు సూర్య శ్రీనివాస్. ‘‘చార్మినార్, పాత బస్తీ నేపథ్యంలో యువతకి నచ్చేలా ఈ సినిమా తీశాను. ఈ కథని నమ్మి సినిమా నిర్మించిన మా నిర్మాతలకి కృతజ్ఞతలు’’ అన్నారు భాస్కర్ జక్కుల.

సాక్షి బిజినెస్
మంగళవారం
14-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
326	82
64,934	19,444

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	13,781	▽	20
డోజోన్స్	34,367	△	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,426	△	65
డాక్స్	15,345	△	111
షాంఘై	3,047	△	8
నికాయ్	32,585	△	17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,892
బంగారం (99.5 స్వచ్ఛత)	59,652
వెండి (కిలో)	69,400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.55	84.22
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	100.29	103.62
€	యూరో	ఒకటికి	87.53	90.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	54.14	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	51.92	54.21
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	60.29	62.24
SAR	సౌదీ రియాల్	[illegible]	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.79	23.59
¥	చైనా యువాన్	[illegible]	10.31	12.38

65 వేల దిగువకు సెన్సెక్స్

- ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో అప్రమత్తత
- 19,400 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- బలిప్రతిపద సందర్భంగా నేడు ఎక్స్చేంజీలకు సెలవు



ముంబై: ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, రూపాయి బలహీనతలు సెంటిమెంట్‌పై మరింత పెంచాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 326 పాయింట్లు నష్టపోయి 64,934 వద్ద ముగిసింది. నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 19,444 వద్ద నిలిచింది. దీంతో సూచీలకు ముహూరత్ ట్రేడింగ్ లాభాలన్నీ మాయమయ్యాయి. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 406 పాయింట్లు నష్టపోయి 64,853 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు క్షీణించి 19,415 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. నష్టాల మార్కెట్లోనూ ఇంధన, యుటిలిటీ, విద్యుత్, ఆటో షేర్ల రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.85%, 0.32% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,244 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.830 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. బలిప్రతిపద సందర్భంగా నేడు ఎక్స్చేంజీలకు సెలవు. ట్రేడింగ్ తిరిగి యథావిధిగా బుధవారం ప్రారంభవుతుంది.

"అంతర్జాతీయ అనిశ్చితితో దీపావళి మరుసటి రోజూ భారత ఈక్విటీ మార్కెట్లలో దిద్దుబాటు కొనసాగింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు ప్రభావాలతో ఐఐపీ వృద్ధి, తయారీ రంగ పీఎంఐ భారీగా క్షీణించాయి. అయితే మెరుగైన కార్పొరేట్ ఆదాయాలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, సంస్థాగత కొనుగోళ్లు తదితర అంశాలు దిగువ స్థాయిలో దేశీయ మార్కెట్‌కు దన్నుగా నిలిచే వీలుంది'.
– దీపక్ జసానీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్

- ప్రొటీయన్ ఈగవ్ టెక్నాలజీస్ షేరు లిస్టింగ్ రోజు 11% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.792) వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో క్రమంగా కొనుగోళ్ల మద్దతు పెరగడంతో ఈ షేరు పుంజుకుంది. ట్రేడింగ్‌లో 12% ర్యాలీ చేసి రూ.891 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 11% లాభంతో రూ.883 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.3,571 కోట్లుగా నమోదైంది.

రిటైల్ ధరల ఉపశమనం

అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.87%

న్యూఢిల్లీ: రెండు నెలల నుంచి దిగివస్తున్న వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా మూడవనెల అక్టోబర్‌లోనూ మరింత తగ్గింది. తాజా సమీక్షా నెల్లో 4.87 శాతంగా (2022 అక్టోబర్ నెలతో పోల్చి) నమోదయ్యింది. అంతక్రితం నాలుగు నెలల్లో (జూన్‌లో 4.81 శాతం) ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి.



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 ప్లస్ లేదా మైనస్‌తో 4 శాతం వద్ద (మినహాయింపులకు లోబడి ఎగవముఖంగా 6 శాతం) ఉండాలన్నది సెంట్రల్ బ్యాంక్‌కు కేంద్రం నిర్దేశం. సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఆర్‌బీఐకి నిర్దేశిత పరిధిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయినప్పటికీ, తమ లక్ష్యం 4 శాతమేనని గవర్నర్ శక్తికాంతదాస్ పలు సందర్భాల్లో స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 6.7 శాతంకాగా, 2023–24లో రేటు 5.4 శాతానికి తగ్గుతుందన్నది ఆర్‌బీఐ అంచనా.

కొనసాగుతున్న ఎఫ్‌పీఐ అమ్మకాలు

నవంబర్‌లో ఇప్పటివరకు రూ. 5,800 కోట్ల విక్రయాలు



న్యూఢిల్లీ: మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లు పెరుగుతుండటం వంటి అంశాల నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) దేశీయంగా ఈక్విటీలను విక్రయించడం కొనసాగిస్తున్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం .. నవంబర్‌లో ఇప్పటివరకు (1 నుంచి 10వ తేదీ వరకు) రూ. 5,800 కోట్ల మేర అమ్మేశారు. ఇప్పటికే అక్టోబర్‌లో రూ. 24,548 కోట్లు, సెప్టెంబర్‌లో 14,767 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దాని కన్నా ముందు ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (మార్చి నుంచి ఆగస్టు వరకు) దాదాపు రూ. 1.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. మరోవైపు, అక్టోబర్‌లో డెట్ మార్కెట్లో రూ. 6,381 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో ఇప్పటివరకు రూ. 6,053 కోట్లు పెట్టుబడులు పెట్టారు. మొత్తం మీద ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఈక్విటీల్లో రూ. 90,161 కోట్లు, డెట్ మార్కెట్లో రూ. 41,554 కోట్లకు చేరాయి.

ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా ట్రెజరీ బాండ్ ఈల్డ్‌లు పెరగడం వంటి అంశాల కారణంగా ఎఫ్‌పీఐల విక్రయాల ధోరణి కొనసాగుతోందని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాంశు శ్రీవాస్తవ చెప్పారు. పరిస్థితులు మెరుగుపడి ఈక్విటీల్లో తిరిగి ఇన్వెస్ట్ చేసే వరకు నిధులను స్వల్పకాలికంగా డెట్ మార్కెట్లోకి మళ్లించే వ్యూహాన్ని మదుపుదారులు అమలు చేస్తున్నట్లు పరిశీలకులు తెలిపారు. ఆర్థిక రంగ సంస్థలు మెరుగైన క్యూ2 ఫలితాలు ప్రకటిస్తూ, ఆశావహ అంచనాలు వెలువరిస్తున్నప్పటికీ ఎఫ్‌పీఐలు వాటిలో అత్యధికంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ వేల్యుయేషన్లు ఆకర్షణీయంగా మారినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటెజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు.

బికనీర్‌వాలా చైర్మన్ అగర్వాల్ కన్నుమూత



న్యూఢిల్లీ: స్వీట్స్, స్నాక్స్ బ్రాండ్ బికనీర్‌వాలా చైర్మన్ కేదార్‌నాథ్ అగర్వాల్ (86) సోమవారం కన్నుమూశారు. 'కాకాజీ' అంటూ అంతా ఆప్యాయంగా పిల్చుకునే అగర్వాల్ మరణం తమకు తీరని లోటని సంస్థ డైరెక్టరు, ఆయన కుమారుడు రాధే మోహన్ అగర్వాల్ తెలిపారు. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు రసగుల్లాలు, భుజియా వంటి తినుబండారాలను విక్రయించిన అగర్వాల్.. అంచెలంచెలుగా బికనీర్‌వాలాతో దేశ, విదేశాల్లోనూ కార్యకలాపాలు విస్తరించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం భారత్‌తో పాటు అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తదితర దేశాల్లో 60 పైచిలుకు అవుట్‌లెట్స్ ఉన్నాయి.

దీపావళి ధమాకా!

- పండుగ సీజన్‌లో ఇప్పటివరకు రూ. 3.75 లక్షల కోట్ల వ్యాపారం
- మరో రూ. 50,000 కోట్ల వరకు వ్యాపార అంచనాలు
- సీఏఐటీ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పండుగ సీజన్ సందర్భంగా రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రూ. 3.75 లక్షల కోట్ల మేర విక్రయాలు జరిగినట్లు అఖిల భారతీయ ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) వెల్లడించింది. రాబోయే గోవర్ధన పూజ, భాయ్ దూజ్, ఛత్ పూజ వంటి పర్వదినాల సందర్భంగా మరో రూ. 50,000 కోట్ల మేర వ్యాపారం జరగవచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించింది. ఈసారి దీపావళికి ఎక్కువగా దేశీయంగా తయారైన ఉత్పత్తులే అమ్ముడైనట్లు సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. చైనా ఉత్పత్తులకు రూ. 1 లక్ష కోట్ల మేర వ్యాపారం తగ్గిపోయిందని పేర్కొన్నారు. 'గతంలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మకాల్లో చైనా ఉత్పత్తుల వాటా దాదాపు 70 శాతం ఉండేది. కానీ ఈసారి దేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునకు ఇటు వ్యాపారవర్గాలు, అటు వినియోగదారుల నుంచి భారీగా స్పందన లభించింది' అని ఆయన వివరించారు.



ఇలా ఖర్చు చేశారు..

కస్టమర్లు ఈ దీపావళికి ఫుడ్, గ్రాసరీపై 13 శాతం వెచ్చించారు. వస్త్రాలు, దుస్తులపై 12 శాతం, ఆభరణాలకు 9 శాతం, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్‌పై 8 శాతం, బహుమతులకు 8 శాతం, కాస్మెటిక్స్‌కు 6 శాతం ఖర్చు చేశారు. డ్రైఫ్రూట్స్, స్వీట్స్, నమ్కీన్ 4 శాతం, ఫర్నీషింగ్, ఫర్నీచర్ 4 శాతం, గృహాలంకరణ 3 శాతం, పూజా సామగ్రి 3, పాత్రలు, వంటింటి ఉపకరణాలు 3 శాతం, కన్ఫెక్షనరీ, బేకరీ 2 శాతం కైవసం చేసుకున్నాయి. ఆటోమొబైల్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్, బొమ్మలు, ఇతర వస్తువులకు 20 శాతం వెచ్చించారని సీఏఐటీ తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లో రూ. 19,000 కోట్లపైనే..

ఇక, దీపావళి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.19,000 కోట్లపైన వ్యాపార అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో అత్యధికంగా దుస్తులు, నిత్యావసర వస్తువులు, టపాసులు, గృహోపకరణాలు జరిగినట్లు తెలిపాయి. దీపావళి అంటే టపాసులతో పాటు స్వీట్లకు అత్యధిక ప్రాధాన్యత ఉండటంతో వీటికోసమే రూ.3,800 కోట్ల వరకు వ్యయం చేసినట్లు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా సగటున ప్రతి ఒక్కరు దీపావళి పర్వదినం సందర్భంగా రూ.3,500 వరకు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని, ఆ లెక్కన చూస్తే రాష్ట్రంలో దీపావళి సందర్భంగా రూ.19,000 కోట్లపైన మార్కెట్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

అన్ని విభాగాల్లోనూ జోష్..

రిటైల్‌లో అన్ని విభాగాలు మెరుగ్గా పనితీరు కనబరిచాయి. అమ్మకాల పరంగా ఆన్‌లైన్‌కు, ఆఫ్‌లైన్‌కు వ్యత్యాసం లేదని రిటైల్ రంగ నిపుణుడు కళిశెట్టి పి.బి.నాయుడు తెలిపారు. మొత్తం రిటైల్ వ్యాపారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 16 శాతం ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో గతేడాదితో పోలిస్తే ఈ దీపావళికి డైమండ్ జువెల్లరీ విక్రయాలు 15–20 శాతం, బంగారు ఆభరణాలు 35 శాతం దూసుకెళ్లాయని హీరావాలా జెమ్స్, జువెల్లర్స్ ఎండీ గౌతమ్ చవాన్ తెలిపారు.

ఓఎన్‌జీసీ లాభం డౌన్

క్యూ2లో రూ. 10,216 కోట్లు

న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్‌లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 10,216 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 12,826 కోట్ల నికర లాభం ఆర్జించింది. చమురు ఉత్పత్తితోపాటు ధరలు తగ్గడం ప్రభావం చూపింది. ఈ ఏడాది క్యూ1 (ఏప్రిల్–జూన్)లోనూ నికర లాభం 34 శాతం వెనకడుగు వేయడం గమనార్హం! కాగా.. ప్రతీ బ్యారల్ చమురుకు 84.84 డాలర్లు లభించగా.. గత క్యూ2లో 95.5 డాలర్లు సాధించింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య తలెత్తిన యుద్ధం కారణంగా క్యూ1లో చమురు ధరలు పెరిగినప్పటికీ తిరిగి క్యూ2లో కొంతమేర నీరసించాయి.



ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు 0.6% నీరసించి రూ. 196 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

సీటెట్ జనవరి-2024

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జనవరి–2024 ఏడాదికి సంబంధించి సీటెట్ నోటిఫికేషన్ విడుదలచేసింది.

అర్హత

» పేపర్–1: 50 శాతం మార్కులతో పన్నెండో తరగతితో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో రెండేళ్ల డిప్లొమా(డీఈఎల్‌ఈడీ)/డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(ప్రత్యేక విద్య) లేదా డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» పేపర్–2: 50 శాతం మార్కులతో డిగ్రీతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్(బీఈడీ)/బీఈడీ(ప్రత్యేక విద్య) లేదా సీనియర్ సెకండరీతో పాటు నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (బీఈఎల్ఈడీ)/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్‌లను కలిగి ఉంటుంది. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాలనుకునే వారికి కోసం, రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోరు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషలలో నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.11.2023
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది: 21.01.2024
» వెబ్‌సైట్: ctet.nic.in

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి హార్టికల్చర్ ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» ఎంఎస్సీ(హార్టికల్చర్)–30 సీట్లు: స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్,ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఆరోమాటిక్ క్రాప్స్. అర్హత: బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ(హార్టికల్చర్)తో పాటు ఐకార్–ఏఐఈఈఏ(పీజీ)–2023 స్కోరు సాధించి ఉండాలి.
» పీహెచ్‌డీ(హార్టికల్చర్)–06 సీట్లు: స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఆరోమాటిక్ క్రాప్స్. అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్సీ(హార్టికల్చర్)తో పాటు ఐకార్ ఏఐసీఈ–జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)–2023 స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: గరిష్ట వయోపరిమితి 31.12.2023 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, జాతీయ స్థాయి పరీక్షల్లో సాధించిన స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, ములుగు, సిద్దిపేట జిల్లా చిరునామాకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.11.2023.
» వెబ్‌సైట్: www.skltshu.ac.in

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ-హార్టిసెట్-2023

సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి హార్టిసెట్–2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» కోర్సు: బీఎస్సీ ఆనర్స్(హార్టికల్చర్). మొత్తం సీట్ల సంఖ్య: 32
» కోర్సు వ్యవధి: నాలుగేళ్లు.
» అర్హత: శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ నుంచి హార్టికల్చర్ డిప్లొమా(పాలిటెక్నిక్) ఉత్తీర్ణులైఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» ప్రవేశ పరీక్ష: తెలుగు మాధ్యమం, బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో ఉంటుంది.
» ఎంపిక విధానం: హార్టిసెట్ ర్యాంక్‌కు 75%, డిప్లొమా మార్కులకు 25% వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: దరఖాస్తును రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, ములుగు, సిద్దిపేట జిల్లా.
» దరఖాస్తులకు చివరితేది: 20.11.2023.
» ప్రవేశ పరీక్ష తేది: 28.11.2023.
» వెబ్‌సైట్: skltshu.ac.in

సైన్స్ పరిశోధనలకు మార్గం..

సీఎస్ఐఆర్ నెట్

» సీఎస్ఐఆర్ నెట్‌తో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు మార్గం
» సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» సైన్సెస్, ఇంజనీరింగ్, పీజీ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు
» మొత్తం అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహణ

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఎంపికకు మార్గం.. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్. ఈ పరీక్షను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సంయుక్తంగా నిర్వహిస్తాయి. ప్రతి ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్) ఈ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షకు దరఖాస్తు సమయంలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యం ఆధారంగా జేఆర్ఎఫ్‌కు లేదా లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌నకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

అయిదు విభాగాలు

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ద్వారా సైన్సెస్‌కు సంబంధించిన అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.
- ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులు పరిశోధన సంస్థల్లో పీహెచ్‌డీ చేసేందుకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అందుకునే అవకాశం లభిస్తుంది. ఈ అయిదు విభాగాలకు సంబంధించి అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది.

అర్హతలు

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌కు సైన్సెస్, ఇంజనీరింగ్, పీజీ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు. 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈ/బీటెక్/ బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా అర్హులే. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఆయా కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత ఉండదు. అదే విధంగా బీఎస్సీ ఆనర్స్ చివరి సంవత్సరం చదువుతున్న వారికి, ఫలితాల కోసం వేచి చూస్తున్న వారికి దరఖాస్తుకు అర్హత లేదు.

వయసు

జేఆర్ఎఫ్‌కు అభ్యర్థుల వయసు జూలై 1, 2023 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్.. లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ స్కోర్ ఆధారంగా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాథమ్యం తెలియజేయాలి. ఫలితాల సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.

200 మార్కులకు పరీక్ష

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. పరీక్షలో పార్ట్ ఏ, పార్ట్ బీ, పార్ట్ సీ ఉంటాయి. పార్ట్ ఏ అందరికీ కామన్‌గా జనరల్ ఆప్టిట్యూడ్‌పై ఉంటుంది. పార్ట్ బీ సబ్జెక్ట్ పేపర్ కాగా, పార్ట్ సీలో సబ్జెక్ట్ పేపర్–2 ఉంటుంది.

పెరిగిన జేఆర్ఎఫ్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌లో విజయం సాధించి నిర్దేశిత ఇన్‌స్టిట్యూట్‌లు లేదా రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన అభ్యర్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.37 వేలు చొప్పున రీసెర్చ్ ఫెలోషిప్, రెండేళ్లపాటు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున కాంటింజెంట్ గ్రాంట్ కూడా లభిస్తుంది. రెండేళ్ల తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే సీనియర్ రీసెర్చ్ ఫెలోగా పరిగణిస్తూ నెలకు రూ.42 వేలు చొప్పున ఫెలోషిప్ లభిస్తుంది. ఇలా గరిష్టంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి.
- గత ఏడాది వరకు జేఆర్ఎఫ్‌కు రూ.31 వేలు; ఎస్ఆర్ఎఫ్‌కు రూ.35వేల ఫెలోషిప్ ఉండేది. తాజాగా ఫెలోషిప్‌లను పెంచుతూ యూజీసీ మార్గదర్శకాలు విడుదల చేయడంతో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్–డిసెంబర్–2023లో అర్హత సాధించిన వారికి ఈ పెరిగిన మొత్తాలను అందిస్తారు.



సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2023

అధ్యాపకులకు కనీస అర్హత

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత వల్ల కలిగే మరో ప్రయోజనం.. అధ్యాపక వృత్తిలో అవకాశాలు కచ్చితంగా లభించడం. యూజీసీ నిబంధనల ప్రకారం.. ఉన్నత విద్యా సంస్థలు లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో నియామకాలకు సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్ ఉత్తీర్ణులను నియమించుకునే విధంగా మార్గదర్శకాలు రూపొందించింది. ఈ నేపథ్యంలో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టేందుకు, యూజీసీ నిర్దేశించిన పే-స్కేల్‌కు అనుగుణంగా వేతనాలు పొందేందుకు ఆస్కారం లభిస్తుంది.

మంచి స్కోర్‌కు మార్గమిదే

జనరల్ ఆప్టిట్యూడ్

అన్ని కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం.. జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో రాణించేందుకు తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

సబ్జెక్ట్ పేపర్-1 (పార్ట్-బి)

పార్ట్–బి పేరుతో ఉండే సబ్జెక్ట్ పేపర్–1లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ స్థాయి పుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

సబ్జెక్ట్ పేపర్-2 (పార్ట్-సి)

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది. శాస్త్రీయ భావనలపై అవగాహన, అన్వయ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. విశ్లేషణాత్మక దృక్పథంతో అధ్యయనం చేయడం ద్వారా సమాధానాలను గుర్తించొచ్చు. కాబట్టి అభ్యర్థులు తమ అకడెమిక్స్ సంబంధించి పీజీ స్థాయి పుస్తకాలను చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

పరిశోధన దృక్పథం

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లో పీజీ స్థాయి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రస్తుత సమస్యలు, వాటి పరిష్కారం దిశగా పరిశోధనల గురించి అవగాహన పెంచుకోవాలి. తద్వారా పార్ట్–సిలో రాణించేందుకు మార్గం సుగమం అవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 30, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: డిసెంబర్ 2 – డిసెంబర్ 4,2023
- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తేదీలు: డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో,2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

15 నుంచి ఐసెట్ తుది దశ కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసంనిర్వహించిన ఐసెట్–2023 రెండవ /తుది దశ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదలైంది. అభ్యర్థులు 15వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. 16వ తేదీ నుంచి 18 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 17వ తేదీ నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 20వ తేదీ వెబ్ ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పించింది. 22న తుది సీట్లు కేటాయించనుంది. 23వ తేదీన సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో నేరుగా హాజరుకావాలని సూచించింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

- జీడీ, సీఆర్‌పీఎఫ్ విభాగాల్లో కానిస్టేబుల్ పోస్టుల సాధనకు కోచింగ్
- ఈ నెల 26న అర్హత రాత పరీక్ష
- రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యార్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్టు రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ సాయుధ బలగాల నియామకంలో భాగంగా త్వరలో 80 వేలకుపైగా కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందన్నారు. ఆసక్తి కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 23 ఏళ్లలోపు ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఓబీసీ, 28 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. రామ్‌కీ ఫౌండేషన్–పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన 600 మంది అభ్యర్థులకు హైదరాబాద్, గుంటూరు(పెదపరిమి గ్రామం)లోని రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రాలలో శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ నెల 26వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించి, 29న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. సమాచారం కోసం 97036 51233, 73375 85959, 90007 97789 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ఫెయిల్ అయినా.. తిరిగి ఎన్‌రోల్..

ప్రభుత్వ చర్యలతో కాలేజీల్లో చేరిన 76,603 మంది

- పేద విద్యార్థులు మధ్యలో చదువు ఆపేయకుండా క్షేత్రస్థాయిలో చర్యలు
- సచివాలయాలు, వలంటీర్ల పర్యవేక్షణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి ఒక్క విద్యార్థి మధ్యలో చదువు ఆపేయకుండా ఉన్నత చదువులు చదివించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళిక సత్ఫలితాలనిస్తున్నది. గత విద్యా సంవత్సరం (2022–23)లో ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులందరినీ ఈ విద్యా సంవత్సరం (2023–24)లో తిరిగి కాలేజీల్లో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రణాళికను అమలు చేసింది. ఫలితంగా ఫెయిలయిన వారిలో 76,603 మంది విద్యార్థులు తిరిగి కాలేజీల్లో చేరారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులు మధ్యలో చదువు ఆపేయకుండా తిరిగి కాలేజీల్లో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఫెయిలైన విద్యార్థులు తిరిగి కాలేజీల్లో చేరారా లేదా అనే వివరాలన్నింటినీ గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సర్వే ద్వారా సేకరించింది. ప్రత్యేక ట్రాకింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల వివరాలు సేకరించడమే కాకుండా వారిని రెగ్యులర్ కాలేజీల్లో తిరిగి చేర్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇదే విషయమై సమీక్షించారు. గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో చేరికలు పెరిగినట్లు విద్యా శాఖ అధికారులు వివరించారు. ఇందుకు ప్రధాన కారణం అందరినీ బడిబాట పట్టించడంతో పాటు.. పేద విద్యార్థులంతా డిగ్రీలు చదివేలాగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను అమలు చేయడమేనని విద్యా శాఖ పేర్కొంటున్నది. పేదరికం, ఆర్థిక స్తోమత లేని కారణంగా ఏ విద్యార్థి చదువు మధ్యలో మానేయకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, నాడు–నేడు కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల్లో ఈ విద్యా సంవత్సరం కాలేజీల్లో తిరిగి ఎన్‌రోలైన వారి సంఖ్య ఇలా..

జిల్లా	తిరిగి ఎన్‌రోలైన వారి సంఖ్య	జిల్లా	తిరిగి ఎన్‌రోలైన వారి సంఖ్య
ఏలూరు	2,892	పశ్చిమగోదావరి	2,677
కర్నూలు	5,125	తూర్పుగోదావరి	2,331
నంద్యాల	3,467	పల్నాడు	2,429
తిరుపతి	3,380	విజయనగరం	4,550
శ్రీకాకుళం	4,547	వైఎస్సార్	3,389
అనంతపురం	3,423	ఎన్టీఆర్	3,229
శ్రీ సత్యసాయి	2,066	కాకినాడ	3,671
చిత్తూరు	2979	అనకాపల్లి	2,863
విశాఖపట్నం	4,238	కృష్ణా	1,456
బాపట్ల	1,766	డా.బీఆర్. అంబేడ్కర్ కోనసీమ	2,281
పార్వతీపురం మన్యం	1,761	గుంటూరు	2,737
ప్రకాశం	3,738	పొట్టి శ్రీరాములు నెల్లూరు	2,000
అన్నమయ్య	2,638	అల్లూరి సీతారామరాజు	970
		మొత్తం	76,603

క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీలో

భారత్ జట్ల హవా

అండర్–19 టోర్నీలో బోణీ కొట్టిన ఎ, బి జట్లు

- ఏడు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై భారత్–బి విజయం
- బంగ్లాపై తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచిన భారత్–ఎ



అండర్ 19 క్వాడ్రాంగ్యులర్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ జట్టుపై బ్యాటింగ్ చేస్తున్న ఇండియా బి జట్టు క్రికెటర్

సాక్షి, అమరావతి/మూలపాడు (ఇబ్రహీంపట్నం): అండర్–19 పురుషుల అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీలో భారత్–ఎ, బి జట్లు బోణీ కొట్టాయి. బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆతిథ్యంలో సోమవారం విజయవాడ సమీపంలోని మూలపాడు ట్విన్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. భారత్–బి, ఇంగ్లండ్ జట్ల మధ్య పోరులో ఏడు వికెట్ల తేడాతో భారత్ జట్టు గెలుపొందింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసి 43.1 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటయ్యింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో లక్ బెంకెస్ స్టైయిన్ 69 (67బంతులు) పరుగులు చేశాడు. భారత్ బౌలర్ల దాటికి ఐదుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. భారత బౌలర్లలో జయంత్ గోయత్ 4, ప్రేమ్ 3, విఘ్నేష్ 2, మణి కందన్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్–బి 26.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 202 పరుగు చేసి విజయం సాధించింది. రుద్ర మయూర్ పాటిల్ 99 (77 బంతులు) పరుగులతో రాణించి మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ వైభవ్ 53 పరుగులతో ఆకట్టుకున్నాడు.

బంగ్లాపై భారత్–ఎ గెలుపు

భారత్–ఎ, బంగ్లాదేశ్ మధ్య జరిగిన మరో పోరులోనూ భారత్ జట్టు 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా జట్టు 37.1 ఓవర్లలో 159 పరుగులకు కుప్పకూలింది. భారత్–ఎ బౌలర్లలో నమన్ తివారీ 5, ముషీర్ ఖాన్ 3 వికెట్లు చొప్పున పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్–ఎ జట్టు ఒక వికెట్ కోల్పోయి 29.4 ఓవర్లలో 163 పరుగులు చేసి గెలుపొందింది. భారత్ బ్యాటర్లలో ఆదర్శ్ సింగ్ 65, అర్షిన్ కులకర్ణి 77 (నాటౌట్) పరుగులతో రాణించారు. అత్యధిక వికెట్లు పడగొట్టిన నమన్ తివారీకి మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ దక్కింది. ఈ విజయాలతో భారత్ ఎ, బి జట్లు రెండేసి పాయింట్లు సాధించాయి.

పెద్ద స్క్రీన్లపై భారత్–న్యూజిలాండ్ సెమీస్

- మూడు నగరాల్లో ఏర్పాటు
- ఈ నెల 15, 16 తేదీల్లో భారత్–ఆస్ట్రేలియా టీ–20 మ్యాచ్ టికెట్ల విక్రయం
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: భారత్, న్యూజిలాండ్ మధ్య ఈ నెల 15వ తేదీన జరిగే ప్రపంచ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించే అభిమానుల కోసం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో మూడు నగరాల్లో పెద్ద స్క్రీన్లను (ఫ్యాన్ పార్క్‌లు) ఏర్పాటు చేస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. వైజాగ్ ఆర్కే బీచ్ సమీపంలోని కాళీ మాత ఆలయం ఎదురుగా, విజయవాడ ఎంజీ రోడ్డులోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం, కడపలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లలో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో చోట దాదాపు 10 వేల మంది వీక్షించేలా స్క్రీన్లను సిద్ధం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 15న మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మ్యాచ్‌ను ఉచితంగా వీక్షించవచ్చన్నారు.

ఆఫ్‌లైన్‌లోనూ టికెట్లు అందుబాటులో..

భారత్–ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23వ తేదీన జరిగే తొలి మ్యాచ్‌కు ఈ నెల 15, 16 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి పేటీఎం (insider.in) లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. దీంతోపాటు ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నం పీఎం పాలెంలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలోని 'బి' గ్రౌండ్, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.

అశ్రునయనాల నడుమ చంద్రమోహన్ అంత్యక్రియలు



చంద్రమోహన్ అంతిమయాత్రలో అభిమానులు

బంజారాహిల్స్(హైదరాబాద్): రెండురోజుల క్రితం కన్నుమూసిన ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఫిలింనగర్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య కొనసాగింది. కుటుంబసభ్యులు, పలువురు సినీప్రముఖులు చంద్రమోహన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. అనంతరం పంజాగుట్ట శ్మశానవాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. అంతిమ సంస్కారాలను చంద్రమోహన్ సోదరుడు మల్లంపల్లి దుర్గాప్రసాద్ నిర్వహించారు.

ఏడు రేఖల అంతుచిక్కని చిత్రం

తెలంగాణలో తొలిసారి 'లాబ్రింత్' గుర్తింపు | బొమ్మలరామారం మండలంలో గుర్తించిన పరిశోధకులు



సాక్షి, హైదరాబాద్: అదో చక్రం లాంటి ఆకారం.. లోపల వరుసగా ఏడు వరసలుంటాయి. కానీ వృత్తం కొసలు కలుసుకోవు.. మొదటి గీత ఆధారంగా ప్రయాణిస్తే చివరకు ఓ కేంద్ర బిందువును చేరతాం.. మధ్యలో ఎక్కడా మరో దారి ఉండదు. అంతా గజిబిజిగా ఉంటుంది. మహాభారతంలో 'పద్మ వ్యూహం' లాంటిదన్న మాట. ఈ చిత్రాలను గీసింది ఇప్పుడు కాదు, దాదాపు మూడు వేల ఏళ్లకుపైమాటే. ఇలాంటి చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో వెలుగు చూశాయి. అన్ని వృత్తాల్లో ఏడు వరుసలుగానే ఉండటం విశేషం. ఏమాత్రం కమ్యూనికేషన్ వ్యవస్థ లేని ఆదిమానవుల కాలంలో ఇలా ఒకే తరహాలో వేరు వేరు దేశాల్లో ఎలా గీశారన్నది మాత్రం అంతు చిక్కని అంశం. అసలు ఆ చిత్రాలకు అర్థమేంటో ఇప్పటికీ స్పష్టంగా తేలలేదు. ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు వాటిపై అధ్యయనం చేస్తూనే ఉన్నారు. పరిశోధకులు పరిభాషలో వాటిని 'లాబ్రింత్స్' అంటారు. అంతుచిక్కని చిత్రం అన్న అర్థం వచ్చే గ్రీకు భాష పదమిది. తెలంగాణలో తొలిసారి అలాంటి చిత్రం వెలుగు చూసింది. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం మాచ న్పల్లి గ్రామ శివారు రామునిగుట్ట మీద ఈ లాబ్రింత్ చిత్రాన్ని గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు మహ్మద్ నజీర్, అన్వర్, అహోబిలం కరుణాకర్, కొరివి గోపాల్ ఆ గుట్టమీద రామాలయం, శివాలయాల కు తూర్పున సహజనీటి గుండం ఒడ్డున దీన్ని గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో ఆ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కోకన్వీనర్లు భద్రగిరీశ్, రమేశ్‌లు ఆ చిత్రాన్ని పరిశీలించారు. ఇది ఏ కాలంలో చెక్కారో ఇతమిత్థంగా తే లనప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా చరిత్ర పరిశోధకుల్లో ఆసక్తి రేపుతున్న లాబ్రింత్‌గా గుర్తించారు. 'ఇది మానవ సాంస్కృతిక విశ్వాసాలకు సంబంధించిన అంతుచిక్కని చిత్రం. జంతువులతో పోలిస్తే మనిషి తెలివితేటలతో ఉండటం, పుట్టుక తర్వాత గమ్యం ఏంటో తెలియని పరిస్థితిలో ఈ తరహా చిత్రాలను గీసినట్టు తెలుస్తోంది' అని హరగోపాల్ పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బస్.. రైట్ రైట్

- జర్మన్ పెప్పర్ బస్సుల పరిశ్రమ స్థాపనకు గ్రీన్ సిగ్నల్
- ముఖ్యమంత్రి జగన్‌కు పెప్పర్ కృతజ్ఞతలు

- 29న సీఎంతో సమావేశం
- రూ.5వేల కోట్లతో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సులు
- 2027కు 50 వేల వాహనాలతో మార్కెట్‌లోకి..
- మరో 10 అనుబంధ కంపెనీలు రాక
- పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి
- దేశ వ్యాప్తంగా పుంగనూరుకు గుర్తింపు



ఇంధన వనరుల తరుగుదల..పర్యావరణ కాలుష్యం నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటుకు సీఎంతో చర్చించారు. అందుకు ఆయన అంగీకరించి.. జర్మన్‌కు చెందిన పెప్పర్ బస్సుల తయారీ సంస్థ స్థాపనకు ఆమోదించారు. ఆ పరిశ్రమ యాజమాన్యం కూడా ఫ్యాక్టరీ స్థాపనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

2027నాటికి 50 వేల వాహనాలు

పుంగనూరులో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, 2027 సంవత్సరం నాటికి సుమారు 50 వేల బస్సులు, ట్రక్కులతో మార్కెట్‌లోకి విడుదల చేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన సిబ్బంది, ముడిసరుకు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

పుంగనూరు(చిత్తూరు జిల్లా): నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పెద్దాయన సొంత నియోజకవర్గమైన పుంగనూరులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ తొలిసారిగా ఇక్కడికి రావడంతో పుంగనూరు చరిత్రకెక్కింది. పుంగనూరులో పరిశ్రమల ఏర్పాటు చేయాలని రాష్ట్రమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సీఎం అంగీకరించడంతో గత నెల 30న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో బస్సుల కంపెనీ పుంగనూరులో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు ముఖ్యమంత్రికి కంపెనీ కృతజ్ఞతలు తెలిపింది.

రూ.5 వేల కోట్లతో ఏర్పాటు

జర్మనీలో ఉన్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు, బ్యాటరీల తయారీ సంస్థ సుమారు రూ.5 వేల కోట్లతో ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మించనుంది. పుంగనూరు మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డితోపాటు పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లె రెవెన్యూ గ్రామాల్లో 800 ఎకరాల్లో భూమిని కేటాయించేందుకు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అంగీకరించారు. ప్రస్తుతం పరిశ్రమలకు కేటాయించిన రెండువేల ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు కానున్నది. దీని ద్వారా పదివేల మందికి ఉపాధి లభించనుంది.

పుంగనూరుకు నీటి లభ్యతతో..

నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పుంగనూరులో రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలు నీటి సమస్య తీర్చేందుకు పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లె, సోమల మండలంలోని ఆవులపల్లె వద్ద రెండు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. అలాగే వైఎస్సార్ జిల్లా గండికోట ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీరు పుష్కలంగా తరలించేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. దీనికి తోడు కర్ణాటక సరిహద్దులోని జాతీయ రహదారులను పుంగనూరుకు అనుసంధానం చేశారు. ఫలితంగా పారిశ్రామిక వేత్తల కళ్లు పుంగనూరుపై పడేలా చేయడంలో ఎంపీ మిథున్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన ఆలోచనలు కార్యరూపం దాల్చాయి. పారిశ్రామిక వేత్తలు పుంగనూరును అనువైన ప్రాంతంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తికి చెందిన ఫెర్రో ఆలాయ్ పైపుల ఫ్యాక్టరీ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.

ప్రతినిధుల బృందం

పుంగనూరులో ఏర్పాటు చేయనున్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్ ఫెడ్రిచ్, సీఈఓ ఆండ్రియాస్, సీఐఓ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 మంది బృందం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఈనెల 29న కలసి కంపెనీ ఏర్పాట్లపై చర్చించనున్నారు.

జగనన్నతోనే అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పుంగనూరుకు ప్రత్యేక నిధులు కేటాయించారు. అభివృద్ధికి దూరమైన పుంగనూరులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. రెండు రిజర్వాయర్లు, గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్లతో సాగు, తాగునీరుకు లభిస్తుందన్న నమ్మకం ప్రతిఒక్కరిలోను ఉంది. దీంతోనే పారిశ్రామికవేత్తల పుంగనూరుకు వస్తున్నారు. పరిశ్రమల ద్వారా నిరుద్యోగ సమస్య పూర్తిగా నిర్మూలించి, పుంగనూరును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం. పుంగనూరు అభివృద్ధికి సహకరిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

పుంగనూరుకు ప్రత్యేక స్థానం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరుకు ప్రత్యేక స్థానం కల్పించారు. బైపాస్ రోడ్డు, మిని బైపాస్, ఆర్టీసీ డిపో, వంద పడకల ఆస్పత్రి, ఎంబీటీ రోడ్డు విస్తరణ, పాలిటెక్నికల్ కళాశాల, సబ్‌స్టేషన్లతో పాటు ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. నలభైఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేపట్టాం. ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటాం.

– రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నెలాఖరుకు పుంగనూరుకు..

పుంగనూరుకు పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్‌ఫెడ్రిచ్ తో కూడిన బృందం ఈనెలాఖరులో పుంగనూరులో పర్యటిస్తారని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. కంపెనీ భూసేకరణకు సంబంధించి వివరాలు వెల్లడిస్తారన్నారు. త్వరలోనే కంపెనీ నిర్మాణ పనులను సీఈఓ ఆండ్రియస్, సీఐఓ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

దేశ చరిత్రలో నిలిచిపోతాం

పుంగనూరు మండలం ఆరడిగుంటలో జర్మనీ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ నెలకొల్పేందుకు ముందుకు రావడం పుంగనూరు ప్రజల అదృష్టమని, దేశ చరిత్రలో పుంగనూరు పేరు నిలిచిపోతుందని పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. సోమవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల కృషితో పుంగనూరు పారిశ్రామికాభివృద్ధి చెందుతోందన్నారు. 40 ఏళ్లలో ఒకే కుటుంబం చేయని అభివృద్ధిని నాలుగన్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి కుటుంబం చేసి చూపిందన్నారు. ప్రభుత్వానికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అమరనాథ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు కొత్తపల్లె చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాలో రబీకి గ్రీన్ సిగ్నల్

- నీటి కొరత అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులపై ఫోకస్
- గతేడాది తరహాలోనే సరఫరాకు ఛాన్స్
- నేటి నుంచి ఐఏబీ సమావేశాలు



డెల్టాలో వరిచేలు

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ ఆయకట్టుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. వర్షాభావ పరిస్థితులు.. ఈ ఏడాది గోదావరిలో ఇన్‌ఫ్లో తక్కువగా నమోదు కావడంతో రబీ సాగుకు నీటి లభ్యతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. సాగుకు అవసరమైన నీటి లభ్యతలో 8.86 టీఎంసీల కొరత ఉన్నప్పటికీ దానిని అధిగమించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతులకు సిద్ధమవుతూ ఆయకట్టు మొత్తానికి నీరు ఇవ్వనున్నారు.

అత్యధిక సాగు విస్తీర్ణం

రాష్ట్రంలోనే రబీ ఆయకట్టులో కీలకమైనది గోదావరి డెల్టా. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో డెల్టా విస్తరించి ఉంది. అధికార గణాంకాల ప్రకారం మొత్తం ఆయకట్టు 10.36 లక్షల ఎకరాలు. దీనిలో తూర్పు డెల్టా 2,64,507 ఎకరాలు, మధ్యడెల్టా 1,72,000, పశ్చిమ డెల్టా 4,60,000 ఎకరాల చొప్పున మొత్తం వరి ఆయకట్టు 8,96,507 ఎకరాలు. కానీ వాస్తవ సాగు 7.50 లక్షల ఎకరాలు ఉంటోంది. మిగిలిన ఆయకట్టులో ఆక్వా చెరువులు, రియల్ ఎస్టేట్ భూములు, మెరక చేసి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

రబీలో దిగుబడి జోరు

డెల్టాలో వరి సగటు దిగుబడి ఖరీఫ్ సగటు 28 బస్తాలు (బస్తా 75 కేజీలు) కాగా, రబీలో 45 బస్తాలు. డెల్టాలలో ఖరీఫ్ కన్నా రబీ దిగుబడి అధికం. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏకంగా 34 నుంచి 48 బస్తాల వరకు దిగుబడిగా వస్తోంది. రబీలో సైతం 45 బస్తాల సగటు దిగుబడి అయినప్పటికీ అంతకన్నా అధికంగా వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 45 బస్తాలు అనుకున్న డెల్టాలో 25.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా రానుంది. ఈ కారణంగా రైతులు రబీ సాగుపై అధికంగా ఆశలు పెట్టుకుంటారు.

అవసరం ఎంతంటే..

ఈ ఏడాది గోదావరిలో ఇన్ ఫ్లో తక్కువగా ఉంది. దీంతో రబీ సాగుపై ఇది ప్రభావం చూపిస్తోందని రైతులు ఆందోళన చెందారు. కాని సహజ జలాల రాక, పోలవరం ప్రాజెక్టు వద్ద నిల్వ ఉన్న నీటిని పరిగణలోకి తీసుకుంటే కొరత చాలా తక్కువగా ఉండనుంది. మొత్తం ఆయకట్టు పరిధిలో సాగు, తాగు అవసరాలకు 91.35 టీఎంసీలు అవసరం. డెల్టాలో రబీ షెడ్యూలు డిసెంబర్ 15న మొదలై మరుచటి ఏడాది ఏప్రిల్ 15 వరకు ఉంటోంది. కాని సాగునీటి పారుదలదల శాఖ అధికారులు డిసెంబరు 1 నుంచి మార్చి 31 వరకు రబీ షెడ్యూలుగా నిర్ణయించారు. ఈ కాలంలో పంటతోపాటు తాగునీటికి కలిపి 91.35 టీఎంసీల నీటి అవసరంగా గుర్తించారు.



తూర్పు డెల్టా ప్రధన పంట కాలువ

కొరత అధిగమించేందుకు

డెల్టా అవసరాలకు సరిపడే నీటికి కొంత కొరత ఏర్పడనుంది. అధికారులు నిర్ణయించిన షెడ్యూలు సమయంలో సీలేరు నుంచి వాటాగా వచ్చే నీటి లభ్యత 40.49 టీఎంసీలు. పోలవరం ప్రాజెక్టు నుంచి 12 టీఎంసీలు, సహజ జలాలు (ఫిబ్రవరి నెలాఖరు వరకు అంచనా)30 టీఎంసీలు వస్తుంది. మొత్తం నీటి లభ్యత 82.49 టీఎంసీలు కాగా, కొరత 8.86 టీఎంసీలు. అందుకే అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నీటిని సేకరించాలని నిర్ణయించనున్నారు. పంట కాలువలపై వంతుల వారీ విధానంతో నీటిసరఫరా చేస్తే 5 టీఎంసీల నీటిని, మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు వేయడం, మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం ద్వారా 3.86 టీఎంసీలు సేకరించాలని నిర్ణయించారు. తద్వారా మొత్తం ఆయకట్టుకు సాగు నీరందించనున్నారు. గత ఏడాది కూడా ఇలాగే చేశారు. ఈ నేపథ్యంలో డెల్టా పరిధిలో మంగళవారం నుంచి జిల్లాల వారీగా సాగునీటిపారుదల సలహా మండల సమావేశం జరుగుతుంది. ఇందులో మొత్తం ఆయకట్టుకు నీరందించడంపై నిర్ణయం లాంఛనమే కానుంది. ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయంపై డెల్టా ఆయకట్టు రైతులలో హర్షం వ్యక్తమవుతోంది.

చర్చించాక తుది నిర్ణయం

గోదావరి డెల్టా రబీ ఆయకట్టుపై మంగళవారం నుంచి జిల్లాల వారీగా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశాలు జగనున్నాయి. నీటి లభ్యత, కొరత, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటి సేకరణపై చర్చించనున్నాం. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించిన తరువాత రబీ ఆయకట్టుపై స్పష్టత వస్తోంది.

– శ్రీనివాసరావు, ఎస్‌ఈ, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం | 14 | నవంబర్ | 2023

వడ్డీ వ్యాపారులపై దాడులు

కృష్ణరాజపురం: బెంగళూరులో పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అక్రమ వడ్డీ వ్యాపారులపై సీసీబీ పోలీసులు దాడి సుమారు రూ. 42 లక్షల నగదు, బంగారం సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీసీబీ డీసీపీ శ్రీనివాస్‌గౌడ ఆధ్వర్యంలో బసవగడి, చామరాజపేటె, కామాక్షి పాళ్య, బసవేశ్వరనగర పరిధిలో దాడులు చేశారు. 10 నుంచి 15 శాతం వడ్డీతో అప్పులు ఇచ్చే 4 ఫైనాన్స్ ఆఫీసులు, యజమానుల ఇళ్లలో సోదాలు చేసి సుమారు 100కు పైగా సంతకం చేసి ఉన్న ఖాళీ చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారులు వీటిని రుణగ్రహీతల నుంచి సేకరించారు. రూ.42 లక్షల విలువైన బంగారు నగలు, నగదు, 6 రోలెక్స్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి ఫైనాన్షియర్లపై కేసులు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

నగరంలో కారు బీభత్సం

- ముగ్గురికి గాయాలు



డివైడరును ఢీకొని నిలిచిన కారు

బనశంకరి: కారు డ్రైవరు అదుపు తప్పడంతో చోటుచేసుకున్న వరుస ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. ఈఘటన నగరంలో హుళిమావు పరిధిలో జరిగింది. బన్నేరుఘట్ట నివాసి, కారు డ్రైవరు అగర్వాల్ ఆదివారం సాయంత్రం జిగిణి నుంచి బెంగళూరుకు కారులో బయలుదేరాడు. బన్నేరుఘట్ట రోడ్డు కాళేన అగ్రహార వద్ద ఓ వ్యక్తి ఆకస్మాత్తుగా అడ్డం రావడంతో బ్రేక్‌వేసే బదులు ఎక్స్‌లేటర్ తొక్కాడు. దీంతో కారు వేగంగా దూసుకెళ్లి ముందు వెళుతున్న మూడు బైకులను ఢీకొట్టి రోడ్డు డివైడరును ఢీకొని నిలిచిపోయింది. ఈ దుర్ఘటనలో భర్తతో కలిసి బైక్‌పై వెళ్తున్న స్మిత అనే మహిళకు తీవ్ర గాయాలు, కిరణ్, మోమ్సిన్ అనే ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులు ఆస్పత్రిలో చేరారు. కారు డివైడర్‌లోకి చొచ్చుకుపోయినా డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. హుళిమావు ట్రాఫిక్ పోలీసులు అగర్వాల్ ను అదుపులోకి తీసుకున్నారు.

జైలులో చైత్రపై దౌర్జన్యం

బనశంకరి: డబ్బులు తీసుకుని అసెంబ్లీ టికెట్ ఇప్పిస్తానన్న కేసులో పరప్పన అగ్రహార జైలులో రిమాండులో ఉన్న చైత్ర కుందాపురపై ఆఫ్రికన్ మహిళాఖైదీలు దాడిచేశారు. సోమవారం మధ్యాహ్నం మహిళా విచారణ ఖైదీల బ్యారక్‌లో జాతీయ గీతం విషయంలో ఆఫ్రికన్ మహిళాఖైదీలు, చైత్రా మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో చైత్రతో పాటు ముగ్గురు స్థానిక ఖైదీలపై దాడికి పాల్పడ్డారు. జైలులో పోలీసులకు చైత్ర ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- తండ్రీ కొడుకులు మృతి



దొడ్డబళ్లాపురం: స్టీరింగ్ కట్ కావడంతో అదుపుతప్పిన కేఎస్ ఆర్టీసీ బస్సు స్కూటర్‌ని ఢీకొని తండ్రీ కొడుకు మృతిచెందిన సంఘటన చెన్నపట్టణ తాలూకా తిట్టమారనహళ్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. కోటమారనహళ్లికి చెందిన సిద్ధయ్య (60), అరుణ్ (27)లు సోమవారం ఉదయం స్కూటర్‌లో స్వగ్రామం నుంచి చెన్నపట్టణకు వెళ్తున్నారు. ఎదురుగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, సిద్ధయ్య ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. బస్సు స్టీరింగ్ కట్ కావడంతో అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. తరువాత బారికేడ్లను ఢీకొని నిలిచిపోయింది. లేదంటే బస్సు చెరువులోకి పడిపోయి ఉండేది. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురికి రూ.57 లక్షల టోపీ

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగం, అధిక లాభాల పేరుతో ముగ్గురికి రూ. 57.83 లక్షలకు టోపీ వేసిన సైబర్ దొంగల ఉదంతమిది. హోసూరు సమీపంలోని ఒన్నలవాడి గ్రామానికి చెందిన శీల (27) గత సెప్టెంబర్ 11వ తేదీ ఒక ఫోన్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి ద్వారా అధిక లాభం ఆర్జించవచ్చని ఫోన్ చేసిన వ్యక్తి నమ్మించాడు. అలా ఆమె నుంచి రూ. 19.33 లక్షలు ఖాతాలో వేయించుకుని ఫోన్ స్విచాఫ్ చేశారు.

- మత్తిగిరి టైటాన్ టౌన్‌షిప్‌కి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రామ్‌కుమార్ వద్ద రూ. 32.65 లక్షలు, చిన్నయలసగిరివాసి సుబ్బులక్ష్మి నుంచి రూ. 5.85 లక్షల మేర వసూలు చేసి వంచించారు.
- బాధితులు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

సిద్ధగంగ మఠంలో విజయేంద్ర



తుమకూరు: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు బీవై విజయేంద్ర సోమవారం తుమకూరు నగరంలోని సిద్ధగంగ మఠానికి వచ్చారు. శివకుమారస్వామీజీ సమాధికి ప్రత్యేక పూజల అనంతరం మఠాధ్యక్షుడు సిద్ధలింగస్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి ధ్యాన మందిరంలో పూజలు చేశారు. విజయేంద్ర విలేకరులతో మాట్లాడుతూ...ఈనెల 15న బెంగళూరు మల్లేశ్వరం పార్టీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

ఉడుపిలో నెత్తుటేర్లు

- తల్లీ, ఇద్దరు కూతుర్లు, కొడుకు హత్య
- ఆగంతకుని మారణకాండ
- హంతకుని కోసం ముమ్మర గాలింపు
- మిస్టరీగా మారిన ఘటన





హత్యాకాండ జరిగిన ఇంటిలో పోలీసుల తనిఖీల దృశ్యం

యశవంతపుర: అందమైన బీచ్‌లు, దేవస్థానాలతో ప్రశాంతంగా ఉండే ఉడుపి నగరంలో ఘోరం చోటుచేసుకుంది, ఆదివారం ఉదయం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్యకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి, ఇంటి యజమాని నూర్ మహమ్మద్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య హసీనా (45), కూతుళ్లు అఫ్నాన్ (23), అజ్నాన్ (21), కొడుకు అసీమ్ (14) ఉడుపిలో తృప్తినగరలో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కొడుకు అసాద్ బెంగళూరులో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో, అలాగే అఫ్నాన్ బెంగళూరులో ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పండుగ సెలవులు రావడంతో అఫ్నాన్ రెండు రోజుల కిందట ఉడుపిలోని ఇంటికి వచ్చింది. ఆదివారం ఉదయం 8:20 గంటల సమయంలో 45 ఏళ్ల మధ్యవయసుడు మూతికి మాస్క్ ధరించి సంతెకట్టెకు వచ్చాడు, అక్కడి నుంచి ఆటో ఎక్కి తనను తృప్తినగరకు తీసుకెళ్లాలని ఆటోడ్రైవర్ శ్యామ్‌కు సూచించాడు. ఆ మేరకు అతన్ని తృప్తినగరలో దించాడు.

నలుగురిని వెంటాడి పొడిచి

దుండగుడు వెంట తెచ్చుకున్న చాకుతో ఇంటిలోకి చొరబడి మారణహోమం సృష్టించాడు. ఎక్కడ ఉన్న వారిని అక్కడే పొడిచి, గొంతుకోసి హతమార్చాడు. వంట గది, బెడ్‌రూం, బాతురూం, హాల్‌లో ఒక్కొక్కరి శవాలు ఉండడమే దీనికి నిదర్శనం. హసీనా అత్తను వెంటాడగా ఆమె భయంతో బాతురూంలోకి వెళ్లి లాక్ చేసుకోవడంతో బతికి పోయింది. అసీమ్ సైకిల్ తొక్కుతూ ఇంటిలోకి వచ్చి దుండగున్ని చూసి కేకలు వేశాడు. దుండగుడు బాలున్ని హాల్‌లో పొడిచి చంపి పరారయ్యాడు.

15 నిమిషాల్లో దారుణం

కాగా హంతకుడు 15 నిముషాలలో పని ముగించుకొని మళ్లీ ఎవరో బైకులో వెళ్తుంటే సంతెకట్టకు డ్రాప్ తీసుకున్నాడు. సంతెకట్ట నుంచి ఎక్కడకు వెళ్లాడో జాడ లేదు. ఈ హత్యోదంతం క్షణాల్లోనే ఉడుపి అంతటా పాకిపోయింది. వందలాదిగా అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వచ్చి జాగిలాలు, వేలిముద్రల నిపుణులు ఆధారాల కోసం గాలించారు.

బెంగళూరు యాసలో మాట్లాడాడు

- ఐదు పోలీసు బృందాలు మంగళూరు, శివమొగ్గ, కారవారకు వెళ్లాయి, రెండు బృందాలు ఉడుపిలో గాలిస్తున్నాయి.
- 45 ఏళ్ల వయసున్న హంతకుని సీసీ కెమెరా ఫొటోలు, వీడియోలను విడుదల చేశారు. నిందితుడు బెంగళూరు యాసలో కన్నడ మాట్లాడినట్లు ఆటో డ్రైవర్ శ్యామ్ చెప్పాడు.
- ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తున్న యువతిపై ద్వేషంతోనే హత్యాకాండకు పాల్పడి ఉండొచ్చని, లేదా పెద్ద కొడుకు పాత్ర ఉండవచ్చని అనుమానాలు ఉన్నాయి.
- పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు ఘటనాస్థలిని పరిశీలించారు.
- దుబైలో ఉన్న మొహమ్మద్, బెంగళూరులో పెద్దకొడుకు అసాద్ చేరుకోగా సోమవారం సాయంత్రం కోడిబెంగ్రె జామియా మసీదులో అంత్యక్రియలను జరిపారు.



హత్యకు గురైన తల్లి హసీనా, ఆమె పిల్లలు (ఫైల్)



హసీనా దంపతులు, పిల్లలు (ఫైల్)

పెద్దలను కలిసి, దీవెనలు పొంది..

శివాజీనగర: బీజేపీ రాష్ట్రాధ్యక్షునిగా ఎంపికైన శికారిపుర ఎమ్మెల్యే, మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు విజయేంద్రకు రాష్ట్ర ప్రభుత్వం భద్రతా వాహనం, పోలీస్ భద్రతను కల్పించింది. ఆదివారం నుంచి ముగ్గురు పోలీస్ సిబ్బంది ఉన్న ఎస్కార్టు వాహన వసతి ఏర్పాటైంది. బుధవారం పార్టీ కార్యాలయంలో విజయేంద్ర పదవీ బాధ్యతల స్వీకారం జరుగనుంది. ఆయన సోమవారం ఉదయం మాజీ సీఎం బసవరాజ బొమ్మై, మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడ ఇంటికి వెళ్లి ఆశీర్వాదం పొందారు. మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ ఇంటికి వెళ్లి కలిశారు. తన నియామకంతో రాష్ట్ర బీజేపీకి పెద్ద శక్తి వచ్చినట్లయిందని బొమ్మై చెప్పారన్నారు. సీనియర్‌లు అందరూ సహకరిస్తామని తెలిపారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలను కలసికట్టుగా ఎదుర్కోవాలి, బొమ్మై నేతృత్వంలో రాష్ట్రమంతటా పర్యటించి పార్టీకి శక్తి నింపే పని చేస్తామన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే : హైకోర్టు



శివాజీనగర: జీవిత సంధ్యాకాలంలో ఉన్న తల్లిదండ్రుల యోగక్షేమాలు చూసుకునే బాధ్యత చట్టం, ధర్మ, నైతికత ప్రకారం పిల్లలపై ఉంటుంది. తల్లిదండ్రుల నుంచి ఆస్తిని పిల్లలు బహుమతిగా పొందినపుడు ఈ బాధ్యత మరింత ఎక్కువ అని హైకోర్టు అభిప్రాయపడింది. తండ్రి నుంచి ఆస్తిని తీసుకుని, తరువాత ఇంటినుండి బయటికి గెంటేసిన కుమార్తె, అల్లుని కేసులో ప్రధాన న్యాయమూర్తి పీబీ వరాళె, జడ్జి కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం ఈ మేరకు స్పష్టంచేసింది. వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలపైన ఉటుంది, అంతేకానీ ఇది దయ-దానం కాదు అని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కొడుకు తీరు నేపథ్యంలో గతంలో తుమకూరు ఉన్నతాధికారులు ఆ ఆస్తి బదిలీని రద్దు చేసిన కేసు విచారణను డివిజన్ బెంచ్‌కు అప్పగించారు.

దీపావళి వెలుగుల్లో అపశ్రుతులు



ధార్వాడలో మహిళలు దీపాలు వెలగించి సంప్రదాయ రీతిలో సంబరాలు



బెంగళూరులో చిచ్చుబుడ్డి కాంతులు

- బెంగళూరులో 29 మందికి గాయాలు

బనశంకరి: రాష్ట్రమంతటా ఉత్సాహంగా జరుపుకొన్న వెలుగుల పండుగ దీపావళిలో కొన్ని అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. ఆదివారం బెంగళూరులో టపాసులు కాలుస్తూ 29 మంది గాయపడ్డారు. వీరిలో అత్యధికులు బాలలే. నారాయణ నేత్రాలయ ఆసుపత్రిలో 22 మంది, మింటో ఆసుపత్రిలో 7 మంది చికిత్స పొందుతున్నారు. చేతులు, కాళ్లకు గాయాలు తగిలినవారు పెద్దసంఖ్యలో స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందినట్లు తెలిసింది. కళ్లకు, అలాగే తీవ్రంగా కాలిన గాయాలైనవారు విక్టోరియా ఆసుపత్రిలో చేరారు. నేత్రాలయలో 22 కేసుల్లో 10 మందికి కళ్లకు శస్త్రచికిత్స అవసరం ఏర్పడింది. మింటో ఆసుపత్రిలో పదేళ్ల బాలిక, 18 ఏళ్ల యువకుని కళ్లకు ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. టపాసులు పేల్చే సమయంలో అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమని చెప్పారు.

ఉదయం నుంచి టపాసుల మోత

రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య టపాసులు కాల్చాలని పోలీస్ కమిషనర్ బీ దయానంద్ సూచించారు. కానీ ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన టపాసులు మోత అర్ధరాత్రి వరకు చెవులు దిమ్మెక్కించింది. గ్రీన్ టపాసులు కాల్చాలనే ప్రభుత్వ ఆదేశాలను ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం కూడా దీపావళి అమావాస్య కావడంతో ఐటీ నగరంలో జోరుగా పటాకులు కాల్చారు. మరోవైపు ధార్వాడ, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో మహిళలు దీపాలు చేబూని సంప్రదాయ రీతిలో ఆచరించారు.





బెంగళూరు మింటో ఆస్పత్రిలో టపాసుల బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు



కబ్బన్‌పార్క్ పీఎస్‌లో బదిలీల కుదుపు

శివాజీనగర: ఐటీ సిటీలో కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సుమారు 35 మంది సిబ్బంది సామూహిక బదిలీ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశారు. వీరిలో 12 మంది ఏఎస్ఐ, 23 మంది హెడ్ కానిస్టేబుల్‌లు ఉన్నారు. వేర్వేరు కారణాలతో బదిలీకి లేఖ రాసుకున్నా, స్టేషన్‌లోని సీఐ, ఇతర ఉన్నతాధికారుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది. ముఖ్యమైన అధికారి, సిబ్బంది మధ్య సఖ్యత లేదని, ఫలితంగా ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. లేఖ రాసినవారిలో కొందరిని బదిలీ చేశారు.



పాలస్తీనాపై ఇజ్రాయెల్ దండయాత్రను ఖండిస్తూ సోమవారం కలబుర్గిలో ముస్లింల ప్రదర్శనలో పాల్గొన్న బాలలు

మంగళూరులో మెడికో ఆత్మహత్య

యశవంతపుర: మంగళూరులోని ఏజే మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో హాస్టల్‌పై నుంచి ఎంబీబీఎస్ విద్యార్థిని దూకి ఆత్మహత్య చేసుకొంది. ప్రకృతి శెట్టి (20) ఇదే కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఏం జరిగిందో కానీ సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హాస్టల్‌పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో చనిపోయింది. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు డెత్‌నోట్ రాసినట్లు తెలిసింది. కద్రి పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

రెండో భార్య కూతురి పేరు.. కేసు కొట్టివేత

యశవంతపుర: జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామిపై దాఖలు చేసిన ప్రైవేట్ కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు రద్దు చేసింది. దీంతో కుమారస్వామికి పెద్ద ఊరట కలిగింది. ఆయన రెండో భార్య కూతురి పేరును ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదంటూ ఎస్.ఆనంద అనే వ్యక్తి కేసు వేశారు. మొదటి భార్య ఉండగా చేసుకున్న రెండో పెళ్లికి గుర్తింపులేదు. దీంతో ఎన్నికల అఫిడవిట్‌లో చూపాల్సిన అవసరం లేదని కుమార న్యాయవాదులు వాదించారు. ఈ నేపథ్యంలో జడ్జి జె.ప్రీత్ కేసును కొట్టివేశారు.

పార్ట్ టైం ఉద్యోగమని రూ. 8 లక్షలు..



బనశంకరి: పార్ట్‌టైం ఉద్యోగం ఇస్తామని మహిళకు సైబర్ నేరగాళ్లు రూ.8.35 లక్షలు మోసగించారు. బెంగళూరు కనకపురరోడ్డు వాజరహళ్లి నివాసి లీనా (43) బాధితురాలు. లీనా మొబైల్‌కు పార్ట్‌టైం ఉద్యోగమని ఒక మెసేజ్, ఆపై లింక్ వచ్చాయి. లీనా లింక్‌పై నొక్కగానే మోసగాళ్లు సంప్రదించి టెలిగ్రాం గ్రూప్‌లో చేర్చారు. పెట్టుబడి పెడితే అధిక లాభం ఇస్తామని నమ్మించారు. లీనా వారి బ్యాంక్ అకౌంట్‌కు దశలవారీగా రూ.8.35 లక్షల నగదు జమ చేసింది. ఆ తరువాత కేటుగాళ్ల నుంచి స్పందన లేదు. మోసపోయినట్లు తెలుసుకుని దక్షిణ విభాగం సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పడవలు బూడిద



ఉడుపి జిల్లా కుందాపుర వద్ద గొంగొళ్లిలో చేపల రేవులో అగ్ని ప్రమాద దృశ్యం. సుమారు 9 పడవలు కాలిపోయాయి. లక్షలాది రూపాయలు నష్టపోయినట్లు జాలర్లు వాపోయారు



గుప్తనిధుల ముఠా అరెస్టు

గుర్రంకొండ: గుప్తనిధుల ముఠా సభ్యుల్ని చిత్తూరు జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్దనున్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దిలీప్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుర్రంకొండ పరిధిలోని ఎల్లుట్ల గ్రామం ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన మాలేటి శ్రీనివాసులు (44) మదనపల్లెలో నివాసముంటున్నాడు. అక్కడే ఇంటి నిర్మాణ పనుల్లో బేల్దారీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను మదనపల్లెకు చెందిన రచ్చా రవివర్మ (54)తో తమ ప్రాంతంలోని పురాతన ఆలయాలు, కొండల్లో గుప్తనిధుల ఉన్నాయని చెప్పాడు. ఎల్లుట్ల-నగరి పరిధిలో ఉన్న మూలలమ్మకొండల్లో పురాతన ఆలయాల దగ్గర గుప్తనిధులు ఉంటాయని, వాటిని తవ్వితీస్తే ఎంతో విలువైన సంపద బయటపడుతుందన్నారు. వీరిద్దరూ కలసి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన సింకి భాస్కర్ (43), కోలారు జిల్లా శ్రీనివాసపురానికి చెందిన మూరెళ్ల నాగరాజ (56), మదనపల్లెవాసి అంబటి రెడ్డిసునీల్ (39), వాల్మీకిపురం వాసి ఇడగొట్టి రెడ్డెప్ప (39), బి.కొత్తకోటకు చెందిన వెన్నముద్దల మహేంద్ర (39) కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 10వ తేదీన అందరూ నగరి సమీపంలోని మూలాలమ్మ కొండపైకి చేరుకొన్నారు. రాత్రిళ్లు అక్కడే మకాం వేసి ఏవేవో పూజలు నిర్వహించి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. 12న కొండపై నుంచి దిగి వస్తుండగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. తవ్వకాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

సీఐపై కేంద్రమంత్రి గుస్సా

- మా కార్యకర్తలను వేధించారని ధ్వజం
- మిమ్మల్నీ కొట్టాలా? అని ఆగ్రహం

హుబ్లీ: బీజేపీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడ వద్దని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ధార్వాడ టౌన్ సీఐ కాడదేవర మఠ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఆయన ఆదివారం ఇక్కడి మయూర ఎస్టేట్‌లోని జోషి నివాసం వద్ద కాంగ్రెస్ తరఫున పని చేస్తారా? అంటూ సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యకర్తలకు అనవసరంగా వేధించడం సరికాదన్నారు. ఇదే విధంగా కొనసాగితే స్టేషన్ ఎదుట వేలాది మందితో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. చట్టానికి వ్యతిరేకంగా జూదం ఆడుతున్న వారిని సాక్ష్యాలతో సహా పట్టుకొని తగిన చర్యలు తీసుకోండన్నారు. అయితే స్టేషన్‌కు పిలిపించి ఏ ఆధారం లేకుండా


సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై మండిపడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

కొట్టారన్నారు. మిమ్మల్ని తాను నాలుగు దెబ్బలు కొడితే ఎలా ఉంటుంది? అని కన్నెర్ర చేశారు. ఈ విధంగా తమ పార్టీ కార్యకర్తలను కొట్టడం, అసభ్యంగా తిట్టడం, బెదిరించడం వంటి పనులకు పాల్పడితే మీ స్టేషన్ ఎదుటే తాను కార్యకర్తలతో కలిసి ధర్నా చేపడతానన్నారు.

ఏం జరిగిందంటే..

ఇంతకు అసలు విషయం ఏమిటంటే ధార్వాడ గొల్లర కాలనీలో రవి గొల్లర అనే వ్యక్తిపై నాలుగేళ్ల క్రితం కేసు నమోదు చేశారు. ఇటీవల అతడిపై రౌడీషీట్ తెరిచి రోజు సంతకం చేయాలని హెచ్చరించారు. శనివారం తిరిగి పోలీసులు రవిని స్టేషన్‌కు పిలిపించుకొని విచారణ చేసి అతడిని కొట్టారు. పైగా పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లి మరో కేసు పెట్టడానికి ప్రయత్నించారు. దీంతో బాధితుడు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఆశ్రయించినట్లు రవి సోదరుడు రాజేష్ గొల్లర తెలిపారు. కాగా ఒక పోలీస్ అధికారిని కేంద్ర మంత్రి ఇలా మందలించడం, హెచ్చరించడం తగదని కాంగ్రెస్ నేతలు స్పందించారు.

వాగులో మొసలి ప్రత్యక్షం

కంప్లి: ఎమ్మిగనూరు గ్రామంలోని జడెసిద్దేశ్వర వంతెన సమీపంలోని వాగు నీటిలో సుమారు 12 అడుగుల పొడవైన మొసలి ప్రత్యక్షమైంది. దీంతో వంకను ఆనుకొని ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు వాగు నీటిని దాటాలంటే అర చేతిలో ప్రాణాలు పట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. రైతాంగం రేయింబవళ్లు పొలాల్లో నీరు పారించుకునేందుకు వెళ్లడానికి భయపడుతున్నారు. కొంత మంది పంప్‌సెట్ రైతులు మొసలి దాడిలో కళ్లు మూసి తెరిచే లోగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డ దాఖలాలు ఉన్నాయి. ఒకే రోజు ఈ వంకలో మూడు కంటే ఎక్కువ మొసళ్లు కనిపించాయి. దీంతో మొసలి పిల్లలను పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. వంక పక్కన మేస్తున్న కొన్ని గొర్రెలు, మేకలు కూడా మొసలి నోటికి బలయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఇకనైనా స్పందించి మొసళ్లను పట్టి తమకు విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు.


నీటిలో తిరుగుతున్న మొసలి(వృత్తంలో)

15 నుంచి రాష్ట్ర స్థాయి సహకార ఉత్సవాలు

రాయచూరు రూరల్: వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు 70వ అఖిల భారత రాష్ట్ర స్థాయి సహకార ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, కేఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ నాడగౌడ, జిల్లా కేంద్ర సహకార(ఆర్‌డీసీసీ) బ్యాంక్ అధ్యక్షుడు విశ్వనాథ్ పాటిల్ తోరణదిన్ని వెల్లడించారు. సోమవారం బ్యాంక్ సభాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సహకార శాఖా మంత్రి రాజణ్ణ, వైద్యవిద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ ధ్వజారోహణ, న్యాయ శాఖా మంత్రి హెచ్.కే.పాటిల్ వస్తు ప్రదర్శనను, చిన్న నీటిపారుదల, విజ్ఞాన సాంకేతిక శాఖా మంత్రి ఎన్.ఎస్.బో సురాజు సఫల్ సీటి పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. బ్యాంక్‌కు ప్రభుత్వం నుంచి రూ.224 కోట్లు విడుదలైందన్నారు. ఆర్ఏపీఎంసీ అధ్యక్షుడు జయంత్ రావ్ పతంగి, సహకార మహా మండలి అధ్యక్షుడు విజయ్ కుమార్ పాటిల్‌లున్నారు.


మాట్లాడుతున్న కేఎంఎఫ్ అధ్యక్షుడు నాడగౌడ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

హుబ్లీ: దీపాల పండుగ దీపావళి మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. క్రూజర్ వాహనం బైక్‌ని ఢీకొనడంతో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా 14 మందికి పైగా గాయపడిన ఘటన శివళ్లి మారడి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. హెబ్బాళ గ్రామ యల్లప్ప గంటి(55), బసవరాజ్ కురహట్టి(45), ధార్వాడ గొల్లర వీధి నివాసి రోహన్ అంగడి(25) మృతులు. నవలగుంద నుంచి ధార్వాడకు బాణాసంచా కొనుగోలు కోసం బయలుదేరారు. ఈ క్రమంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనం ఢీకొంది. ధార్వాడలో పని ముగించుకొని తిరిగి ఇంటి వైపు 20కి పైగా మందితో వెళుతున్న క్రూజర్ బైక్‌ను ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా, 15 మందికి పైగా స్వల్పంగా గాయపడ్డారు. వీరిలో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యల్లప్ప, బసవరాజ్ ఆదివారమే చనిపోగా రోహన్ అంగడి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుల కుటుంబాలను నవలగుంద ఎమ్మెల్యే ఎంహెచ్ కోనరెడ్డి పరామర్శించారు.


ప్రమాదానికి కారణమైన క్రూజర్, పక్కన గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నరేగ పనులతో కూలీలకు ఉపాధి


పనులు చేస్తున్న కూలీలు

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల ఉపాధికి నరేగ పనులు సహాయకారిగా మారాయని కర్ణాటక ప్రాంత రైతు సంఘం అధ్యక్షుడు కరియప్ప హచ్చొళ్లి పేర్కొన్నారు. సోమవారం కల్మలలో వ్యవసాయ కూలీలు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(నరేగ) పథకం కింద చేపట్టిన పనులను ఆయన పరిశీలించి తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుబడిన లారీ

బళ్లారిఅర్బన్: బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు నగరంలోని రూపనగుడి రోడ్డులో రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని తనిఖీ చేసి పట్టుకున్నట్లు సీఐ సింధూర్ తెలిపారు. ఆహార పౌర సరఫరాల శాఖ అధికారి తెలిపిన మేరకు తమ సిబ్బందితో వెళ్లి నగరంలో నుంచి బైపాస్ వైపు వెళుతున్న లారీని అదుపులోకి తీసుకొని పరిశీలించగా లారీలో 450 బస్తాల బియ్యం ఉన్నట్లు తెలిపారు. లారీ నెలమంగలకు చెందిన రేణుకాప్రసాద్‌దిగా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కార్తీక పూజలు ప్రారంభం

బళ్లారిఅర్బన్: నగరంలోని 20వ వార్డు గొల్లన రసప్ప కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక దేవస్థానంలో ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచారి ప్రత్యేక అలంకరణ, ధార్మిక పూజలు, సాయంత్రం స్థానిక భక్తులతో కార్తీకదీపాలను వెలిగించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధ్యక్షులు బీ.సత్యనారాయణ తెలిపారు. 16, 17, 18 తేదీల్లో దేవస్థానం 12వ వార్షికోత్సవం సందర్భంగా మహా కుంభాభిషేకం చేపడుతామన్నారు. ముఖ్యంగా సత్యనారాయణ పేట రాఘవేంద్ర మఠం నుంచి దేవస్థానం వరకు పీఠాధిపతితో పాటు పలువురు స్వామీజీలు, గురువులతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఈ నెల 18న పూర్ణాహుతి, మహామంగళ హారతీ, మూలమహాసంస్థాన పూజ, మహాకుంభాభిషేకం, భక్తులకు ఆశీర్వచనం, పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

దీపావళి అమావాస్య సందర్భంగా నగర ప్రజల ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణ పూజలను జరిపారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో వెలసిన చేళ్లగుర్కి ఎర్రితాత దేవస్థానంలో అలంకరణ పూజలు, భక్తులకు దర్శనం, నిత్య అన్నదానం నిర్వహించారు. అల్లీపుర మహాదేవ తాత ఆలయంలో కూడా అమావాస్య పూజలను విశేషంగా నిర్వహించారు.


చేళ్లగుర్కి ఎర్రితాతకు వెండి ఆభరణాల అలంకరణ

హంపీలో తవ్వకాలపై నోటీసులు

హొసపేటె: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం హంపీలో రాతి స్తంభానికి రంధ్రాన్ని వేసేందుకు డ్రిల్లింగ్ మిషన్ ఉపయోగించిన అధికారులకు కేంద్ర పురావస్తు శాఖ అధికారులు నోటీసులు జారీ చేసిన ఘటన సోమవారం జరిగింది. హంపీ విరుపాక్ష ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తిరిగి బయటకు వెళ్లేటప్పుడు రక్షణగా గ్రిల్‌ను అమర్చేందుకు ఆవరణలోని రాతి స్తంభానికి డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రం చేసి మరమ్మతులు చేపట్టారు. ఈ విషయం తెలిసిన కేంద్ర పురావస్తు శాఖ అధికారులు వెంటనే మరమ్మతులను నిలిపి వేయాలని సంబంధిత అధికారులకు నోటీసులను అందించారు.


రాతిస్తంభానికి డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రం వేసిన దృశ్యం

పేకాటరాయుళ్ల అరెస్ట్

బళ్లారిఅర్బన్: స్థానిక బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, రూ.12,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సింధూర్ తెలిపారు. దీపావళి సందర్భంగా ఆదివారం రాత్రి ఇందిరా సర్కిల్ సమీపంలోని ఎస్ఎల్ఎన్ మాల్ సినిమా థియేటర్ వెనుక స్థానికులు పేకాట ఆడుతున్న విషయం తెలుసుకొని పోలీసు సిబ్బందితో దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఏఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు పండుగకు పేకాటను నిషేధించినా లాడ్జిలు, చెట్ల పొదల్లో ఆడుతున్న వారిపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

బసవదర్శన ప్రవచనం షురూ

హొసపేటె: కొట్టూరు సంస్థాన మఠంలో బసవదర్శన ప్రవచనాన్ని బసవ స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభించారు. జగద్గురు డాక్టర్ సంగనబసవ స్వామీజీ పట్టాధికార సువర్ణ మహోత్సవం సందర్భంగా మఠంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి ఈ నెల 22 వరకు జరిగే ప్రవచన కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపటి నుంచి కొత్త కోర్టులో కేసుల విచారణకు ఏర్పాట్లు


తాళూరు రోడ్డులోని నూతన జిల్లా కోర్టు భవనం

బళ్లారిటౌన్: నగరంలోని పాత కోర్టులో కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున వివిధ కోర్టులను స్థానిక తాళూరు రోడ్డులోని నూతన కోర్టుకు తరలించి ఈ నెల 15 నుంచి కేసుల విచారణను నిర్వహిస్తున్నట్లు కోర్టు పాలన అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 1వ జిల్లా కోర్టు, ఎఫ్‌టీఎస్‌సీ 1వ కోర్టు, 2వ అడిషినల్ జిల్లా కోర్టు, నాలుగో అడిషినల్ జిల్లా న్యాయమూర్తి కుటుంబీక కోర్టు కార్యక్రమాలు నూతన కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

పండగ సందడితో రోడ్లు కిటకిట


ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న నగరవాసులు


కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఓ రోడ్డు

హొసపేటె: దీపావళి సందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. నగరవాసులు పండుగకు కావాల్సిన పూజ సామగ్రి కొనుగోలుకు పెద్ద ఎత్తున తరలి రావడంతో మెయిన్ బజార్, కాయగూరలు, పూల మార్కెట్ల వద్ద రోడ్లు జనసంచారంతో నిండిపోయాయి. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు నానా యాతన పడ్డారు. పండుగకు పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి.

కంప్లి: దీపావళి సందర్భంగా పండుగకు అవసరమైన అరటి పిలకలు, ఆకులు, పూలు, పండ్లు, ఇతర పూజ సామగ్రిని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఎగబడి కొనుగోలు చేశారు. ఈ సామగ్రి విక్రయాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు విచ్చేసి ప్రధాన కూడళ్లలో అమ్మి సొమ్ము చేసుకొన్నారు.

సంబరాల రవళి..సంతోషాల దీపావళి


దుకాణం ముందు బాణాసంచాను పేలుస్తున్న దృశ్యం


వాహనాలకు పూజలు నిర్వహించిన దృశ్యం


హొసపేటె: బాణాసంచా వెలిగించిన గ్రామస్తులు


హొసపేటె: దీపాలను వెలిగిస్తున్న ఓ చిన్నారి

- ఇంటింటా మహిళల పూజలు
- మార్మోగిన టపాసుల పేలుళ్లు

బళ్లారిఅర్బన్: చీకటి వెలుగుల సంకేతం అయిన వెలుగు దివ్వెల దీపావళిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా నగరంలో రెండు రోజుల పాటు లక్ష్మీదేవి పూజలు నిర్వహించి బాణాసంచాను పేల్చి సంబరంగా పండుగను జరుపుకున్నారు. ఆది,సోమవారాల్లో నరక చతుర్దశి, ధనలక్ష్మీ పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నెరవేర్చారు. ప్రతి ఇంటా, ప్రతి అంగడితో పాటు తాము నిత్యం ఉపయోగించే వివిధ వాహనాలకు భక్తితో పూజలు చేశారు. ఇళ్లు, దుకాణాలను వెలుగుజిలుగుల దీపాలతో అలంకరించారు. ధనలక్ష్మీదేవిని కరెన్సీ నోట్లు, బంగారు, వెండీ ఆభరణాలతో అలంకరించి ప్రజలు వేడుకగా పండుగను ఆచరించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన బాణాసంచా పేల్చాలని జిల్లా యంత్రాంగం కోరడంతో జిల్లా వ్యాప్తంగా పెరిగిన ధరల మధ్య బాణాసంచా హోరు అక్కడక్కడ జోరుగా వినిపించింది.

విజయనగరలో..

హొసపేటె: దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం రాత్రి నగరవాసులు భక్తిశ్రద్ధలతో పండుగను సంబరంగా జరుపుకొన్నారు. తమ ఇళ్లల్లో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి పూలమాలలతో విశేష అలంకరణ నిర్వహించారు. ఇళ్లముందు మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. పూజ అనంతరం కుటుంబ సమేతంగా బాణాసంచా పేల్చారు.

క్లుప్తంగా

మున్సిపల్ కౌన్సిలర్‌పై హత్యాయత్నం


తోరణగల్లులోని రైల్వేస్టేషన్ ప్రాంతం

సాక్షి బళ్లారి: తోరణగల్లు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని 11వ వార్డు ఘోర్పడే నగర్‌లో హెచ్ఎల్‌సీ కాలువ వద్ద మున్సిపల్ కౌన్సిలర్‌పై సోమవారం హత్యాయత్నం జరిగింది. ఉదయం కౌన్సిలర్ నాగరాజు నాయక్(32)అనే వ్యక్తిపై శివకుమార్ అనే వ్యక్తి కొడవలితో దాడి చేయడంతో తల, వీపు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని జిందాల్ సంజీవిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్ ఆస్పత్రికి తరలించారు. గతేడాది ఎన్నికల అనంతరం డ్రైనేజీ సమస్యపై వివాదం ఏర్పడటంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ విషయంపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. ప్రస్తుతం అదే వివాదానికి సంబంధించిన గొడవలో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై తోరణగల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లబ్ధిదారులకు హక్కుపత్రాల అందజేత


ఫారం-3 పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున

కంప్లి: హరపనహళ్లి పురసభ పరిధిలోని పలు ఎక్స్‌టెన్షన్లలో స్వంత స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి ఇంటింటికీ వెళ్లి ఫారం నెంబర్- 3 లను ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున అందజేశారు. అనేక కుటుంబాలు ఈ ఫారం-3 లబ్ధిని పొందాలన్నారు. కాగా తమవే ఈ ఇళ్లు అనుకున్న వారి కలలను నేటితో నిజం చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పురసభ సభ్యుడు ఎంపీ అంజినప్ప అభినందనలు తెలిపారు.

స్వామీజీకి తులాభారం


తులాభారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రాయచూరు రూరల్: తాలూకాలోని ముర్కిదొడ్డిలో స్వామీజీకి గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ 79వ తులాభారం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అవధూత అత్రికుల తిలక్ రామారావ్ బుడదిన్ని 39వ జయంతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో దానధర్మాలు ఉండడం వల్లే సమాజంలో శాంతి నెలకొందని స్వామీజీ అన్నారు. గ్రామీణాభివృద్ధికి ఆ భగవంతుడు మరింత శక్తిని ప్రసాదించాలని ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి


అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం

కంప్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మౌలానా అబుల్ కలాం సర్కిల్‌ను నిర్మించి విగ్రహం స్థాపించాలని మున్సిపల్ యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను అబుల్ కలాం ఆజాద్ ముస్లిం అభివృద్ధి సమితి అధ్యక్షుడు హొన్నూర్‌సాబ్ ఒత్తిడి చేశారు. ఉపాధ్యాయుడు బడిగేర్ జిలాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో హిందూ ముస్లింలను చైతన్యపరిచి వారిలో భావైక్యత, సమగ్రత, దేశభక్తిని నింపడంలో ప్రధాన పాత్ర వహించారన్నారు.

ప్రచార జాతాకు శ్రీకారం


జాతాను ప్రారంభించిన దృశ్యం

రాయచూరు రూరల్: బాగల్‌కోటెలోని భోవి సమాజ జగద్గురు ఇమ్మడి సిద్ధరామేశ్వర ఆశ్రమంలో చేపట్టిన గురుకుటీర జాతాకు మద్దతుగా సోమవారం నగరంలోని గౌస్‌నగర్‌లో సంచాలకుడు యల్లప్ప, శశికళ ప్రచార జాతాకు శ్రీకారం చుట్టారు. భోవి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు వీలుగా బాగల్‌కోటె నవనగర్‌లో నిర్మించే గురు కుటీరకు ఆర్థికంగా సహాయ సహకారాలు అం దించాలన్నారు. ప్రచార జాతాలో చంద్రశేఖర్, శివప్ప, హన్మంతు, తిమ్మప్ప, భీమేష్, నవీన్‌లున్నారు.

ఢిల్లీ చలో సమావేశానికి సంతకాల సేకరణ


సంతకాలను సేకరిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దేశ వ్యాప్తంగా దళితుల అభివృద్ధి, దౌర్జన్యాలపై వచ్చే నెల 4న న్యూఢిల్లీలో చేపట్టే సమావేశానికి కోటి మందితో సంతకాల సేకరణ చేపట్టినట్లు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రవి పేర్కొన్నారు. సోమవారం ఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళితుల అభివృద్ధికి తోడు రోజురోజుకు సమాజంలో దళితులపై దౌర్జన్యాలు అధికం అయ్యాయన్నారు. సమావేశంలో పద్మ, వీరేష్, అనిల్ కుమార్, శరణ బసవలున్నారు.

నేడు జ్యోతి రథయాత్ర జిల్లాకు రాక

బళ్లారిఅర్బన్: కర్ణాటక అని పునర్నామకరణం జరిగి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఏడాది పాటు చరిత్ర, కళలు సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష తదితర విషయాలకు సంబంధించి యువతలో చైతన్యం కల్పించడానికి కర్ణాటక సంభ్రమ-50 పేరిట వివిధ కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఈవేళ రాష్ట్ర వ్యాప్తంగా సంచరించనున్న జ్యోతి రథయాత్ర మంగళవారం జిల్లాకు రానున్నందున ఘనంగా స్వాగతించడానికి తగిన ఏర్పాట్లు చేసింది.

కాలువలో నీటి గేజ్‌ను కాపాడాలి


కాలువపై రైతులతో మాట్లాడుతున్న గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

రాయచూరు రూరల్: ఎడమ కాలువకు సక్రమంగా నీరందించి గేజ్‌ను కాపాడాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అధికారులకు సూచించారు. సోమవారం గణేకల్ రిజర్వాయర్ వద్ద ఆయన జిల్లాధికారితో మాట్లాడుతూ కాలువలో నీటి పరిమాణం(గేజ్) నిర్వహణకు అధికారులు సహకరించాలని, ఆయకట్టు చివరి భూములకు నీరందేలా గేజ్‌ను పెంచాలని కోరారు.

బంతిపూల దిగుబడికి వర్షాల కాటు

కంప్లి: బంతిపూలను సాగుచేసి మంచి లాభాలు పొందాలని ఆశించిన రైతాంగానికి దీపావళి పండగకు ముందు కురిసిన వర్షాలతో దిగుబడి తగ్గి నిరాశకు గురి చేసింది. నాలుగైదు రోజుల పాటు కురిసిన ఆకస్మిక వర్షాలతో భూమిలో తేమ అధికమై మరో వైపు పూసిన పూలభారానికి ముద్ద బంతి చెట్లు నేలకొరిగి పోయి పూజకు పనికి రాకుండా కుళ్లిపోయాయి. పట్టణ సమీపంలోని బెళగోడ్‌హాళ్ గ్రామ పరిసరాల్లో సాగు చేసిన ముద్దబంతి పంట చివరి క్షణంలో రైతాంగానికి చేదును మిగిల్చింది.

విద్యుత్ స్తంభానికి కారు ఢీ


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

హొసపేటె: వేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన సోమవారం తాలూకాలోని కమలాపుర చెరువు వద్ద జరిగింది. హొసపేటె వైపునకు వెళుతుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ఘటన స్థలాన్ని కమలాపుర పోలీసులు పరిశీలించారు.

వైద్యుడి తల్లి నేత్రదానం

రాయచూరు రూరల్: నగరంలోని హృద్రోగ వైద్యుడు సురేష్ సగరద్ తల్లి కమలాక్షమ్మ(72) ఆదివారం మరణించారు. సోమవారం జాతీయ దేహాంగ దాన సమితి, లయన్స్‌క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో రాయచూరు ప్రభుత్వ వైద్యవిజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాలకు నేత్రదానం చేశారు. నేత్ర బ్యాంక్ అధిపతి సిద్దేష్, వైద్యులు రాకేష్, నీరజ్ ఆమె నేత్రాలను స్వీకరించి భద్రపరిచారు.

దళిత సేన శాఖ ఆరంభం


దళిత సేన శాఖను ప్రారంభిస్తున్న కట్టిస్వామి

బళ్లారిఅర్బన్: కర్ణాటక నేల, నీరు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు దళిత సేన కృషి చేస్తుందని ఆ సంస్థ జిల్లాధ్యక్షుడు కట్టిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ తెలిపారు. సోమవారం సండూరు తాలూకా బొమ్మగట్ట గ్రామంలో దళిత సేన నూతన శాఖ ప్రారంభోత్సవంలో వారు మాట్లాడారు. అంతకు ముందు తమ గ్రామానికి వచ్చిన దళిత సేన జిల్లా ప్రముఖులకు ఘనంగా స్వాగతం పలికారు. సంబంధిత నామఫలకాన్ని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో సేన ప్రముఖులు రాజ కురువళ్లి, మానప్ప, మురళీకృష్ణ, సురేష్ బాబు, ప్రసాద్, సండూరు తాలూకా అధ్యక్షులు రాజేష్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.